www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 6-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 218 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి రా. 12.41 తదుపరి షష్ఠి; నక్షత్రం: మూల ఉ. 11.00 తదుపరి పూర్వాషాఢ వర్జ్యం: ఉ. 9.19-11.00, రా. 8.54-10.33; దుర్ముహూర్తం: ఉ. 11.36-12.21; అమృతఘడియలు: ఉ. 6.49-8.28; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.19, సూర్యాస్తమయం: 5.37 | వరంగల్

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆంధ్రజ్యోతి
బిజినెస్
వరంగల్ ● బుధవారం 6 నవంబరు 2024

రాయల్ ఎన్‌ఫీల్డ్ తొలి ఈవీ



ప్రముఖ మోటార్ సైకిళ్ల కంపెనీ రాయల్ ఎన్‌ఫీల్డ్ సైతం ఎలక్ట్రిక్ బైక్‌ల విభాగంలోకి ప్రవేశించింది. తన తొలి ఎలక్ట్రిక్ మోడల్ 'ఫ్లయింగ్ ఫ్లీ సీ 6'ను ఇటలీలోని మిలాన్‌లో ఆవిష్కరించింది. కంపెనీ ఈ బైక్‌ను తొలుత అమెరికా, యూరప్ మార్కెట్లలో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. 2026 తొలినాళ్లలో ఈ బైక్ మార్కెట్లో అందుబాటులోకి రానుంది.

ఒక రాష్ట్రానికి ఒకే ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్

ఆర్‌ఆర్‌బీలు 28కి కుదింపు
రంగం సిద్ధం చేసిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్‌ఆర్‌బీ)ను మరింత పటిష్ఠం చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలోని ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఇప్పటికే నాబార్డ్‌తో కలిసి చర్చా పత్రాన్ని సిద్ధం చేసింది. దీనిపై ఈ నెల 20వ తేదీ లోగా తమ అభిప్రాయాలు తెలియజేయాలని ఆయా ఆర్‌ఆర్‌బీలను స్పాన్సర్ చేసిన బ్యాంకులకు డీఎఫ్ఎస్ లేఖలు రాసింది. ప్రస్తుతం దేశంలో 43 ఆర్‌ఆర్‌బీలు పని చేస్తున్నాయి. వీటిని రాష్ట్రానికి ఒకటి చొప్పున 28కి కుదించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల వీటి నిర్వహణా సామర్థ్యం పెరగడంతో పాటు ఖర్చుల హేతుబద్ధీకరణ జరిగి తమ నిర్దేశిత లక్ష్యాలను సమర్థవంతంగా నిర్వహిస్తాయని అధికార వర్గాలు చెప్పాయి. 2004-05 ఆర్థిక సంవత్సరం తర్వాత ఆర్‌ఆర్‌బీలను కుదించడం ఇది నాలుగోసారి అవుతుంది.

ఏపీజీవీబీ ఆస్తుల విభజనే సమస్య

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ), చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీడీజీబీ), సప్తగిరి గ్రామీణ బ్యాంక్ (సీజీబీ), ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) ఏపీ విభాగం పేరుతో నాలుగు ఆర్‌ఆర్‌బీలు ఉన్నాయి. ఇందులో ఏపీజీవీబీ అతిపెద్ద ఆర్‌ఆర్‌బీ. మిగతా మూడు ఆర్‌ఆర్‌బీలను ఏపీజీబీలో విలీనం చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో ఏపీజీబీని కెనరా బ్యాంక్ స్పాన్సర్ చేస్తుండగా సీడీజీబీకి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సీజీబీకి ఇండియన్ బ్యాంక్, ఏపీజీవీబీకి భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ) స్పాన్సర్ బ్యాంకులుగా ఉన్నాయి. కాగా ఈ నాలుగు ఆర్‌ఆర్‌బీలకు కెనరా బ్యాంక్‌ను స్పాన్సర్ బ్యాంక్‌గా చేయాలని ప్రభుత్వం చర్చాపత్రంలో ప్రతిపాదించింది. అయితే ఏపీజీవీబీ ఆస్తుల పంపకం ఏపీజీవీబీ-తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ)ల మధ్య కొద్దిగా సమస్యగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ పంపకం తేలిన తర్వాత ఈ మార్పులు జరుగుతాయని అధికార వర్గాలు చెప్పాయి. తెలంగాణకు సంబంధించి ప్రస్తుతం ఏపీజీవీబీతో పాటు ఎస్‌బీఐ స్పాన్సర్ చేసిన టీజీబీ కూడా పని చేస్తోంది. ఆస్తుల విభజన తర్వాత ఏపీజీవీబీ తెలంగాణ శాఖలను టీజీబీలో విలీనం చేస్తారు.

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,342 కోట్లు

సెప్టెంబరు త్రైమాసికంలో 9% తగ్గుదల • ఆదాయంలో 17% వృద్ధి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జులై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 9.35 శాతం క్షీణించి రూ.1,341.50 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.1,480 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం 16.51 శాతం వృద్ధితో రూ.6,880.20 కోట్ల నుంచి రూ.8,016.20 కోట్లకు చేరుకుంది. ఒక త్రైమాసిక కాలంలో రూ.8,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించటం ఇదే తొలిసారని కంపెనీ పేర్కొంది. ఈ కాలంలో గ్లోబల్ జెనరిక్స్ ఆదాయాలు మెరుగ్గా ఉండటం ఎంతగానో కలిసివచ్చిందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

వర్ధమాన మార్కెట్లు సహా భారత్, యూరప్, అమెరికా మార్కెట్ల నుంచి రెవెన్యూలు అంచనాలకు తగ్గట్టుగా ఉన్నాయని పేర్కొంది. త్రైమాసిక కాలంలో మొత్తం నిర్వహణ వ్యయాలు 34.3 శాతం వృద్ధి చెంది రూ.3,021.80 కోట్లకు చేరుకున్నాయని తెలిపింది. కంపెనీకి చెందిన అన్ని విభాగాలు నిలకడైన వృద్ధిని సాధించటంతో సెప్టెంబరు త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు రాబట్టుకోగలిగినట్లు డాక్టర్ రెడ్డీస్ కో చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ అన్నారు. నెస్లే భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన సంస్థ కార్యకలాపాలు ప్రారంభించటంతో పాటు నికోటినల్, ఇతర బ్రాండ్ల కొనుగోలు పూర్తి కావటంతో భవిష్యత్‌లో మంచి వృద్ధిని కనబరిచే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

రూ.1,200 కోట్ల పెట్టుబడులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.2,500 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించగా ఇప్పటి వరకు రూ.1,200 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎఫ్ఓ నరసింహం తెలిపారు. సెప్టెంబరు ముగిసే నాటికి కంపెనీ వద్ద రూ.1,889 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయని వివరించారు. కాగా బయోసిమిలర్స్, ఇతర ఇన్నోవేటివ్ ఉత్పత్తులపై డాక్టర్ రెడ్డీస్ పెట్టుబడులను యథాతథంగా కొనసాగించనుందని కంపెనీ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ తెలిపారు. 2027 నాటికి అమెరికా, యూరోపియన్ మార్కెట్లలోకి కనీసం మూడు బయోసిమిలర్ ఉత్పత్తులను విడుదల చేయాలని చూస్తున్నట్లు చెప్పారు.

అమెరికా ఆదాయం రూ. 3,728 కోట్లు

సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ గ్లోబల్ జెనరిక్స్ ఆదాయాలు 17 శాతం వృద్ధి చెంది రూ.7,157.60 కోట్లుగా ఉన్నాయని డాక్టర్ రెడ్డీస్ సీఎఫ్ఓ ఎంవీ నరసింహం చెప్పారు. కాగా అమెరికా ఆదాయాలు కూడా 17 శాతం వృద్ధితో రూ.3,728.10 కోట్లకు చేరుకున్నాయన్నారు. అమ్మకాలు గణనీయంగా పెరగటంతో పాటు అమెరికా మార్కెట్లోకి కొత్తగా నాలుగు ఔషధాలను విడుదల చేయటం కలిసివచ్చిందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు యూరప్, వర్ధమాన దేశాల మార్కెట్ల నుంచి రెవెన్యూలు వరుసగా 9 శాతం, 20 శాతం మేరకు పెరిగాయని తెలిపారు. రష్యా మార్కెట్లో కొన్ని ఔషధాల బ్రాండ్ల ధరలు పెంచటంతో పాటు అమ్మకాలు పెరగటంతో కలిసివచ్చిందన్నారు. భారత మార్కెట్లో కూడా కంపెనీ ఆదాయాలు 18 శాతం వృద్ధి చెంది రూ.1,397.10 కోట్లకు చేరుకున్నాయని వివరించారు. ఈ కాలంలో దేశీయ మార్కెట్లోకి కంపెనీ కొత్తగా మూడు ఔషధ బ్రాండ్లను విడుదల చేసిందని నరసింహం తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కంపెనీ మొత్తం 16 ఔషధాలను విడుదల చేసిందని చెప్పారు.

బ్యాంకింగ్, లోహ షేర్లలో కొనుగోళ్లు


694 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు స్వల్ప లాభ, నష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆ తర్వాత కొనుగోళ్లు పుంజుకోవడంతో భారీ లాభాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ 694.39 పాయింట్ల వృద్ధితో 79,476.63 వద్దకు చేరుకోగా.. నిఫ్టీ 217.95 పాయింట్లు బలపడి 24,213.30 వద్ద ముగిసింది. ఆసియా, యూరప్ మార్కెట్ల సానుకూల సంకేతాలతో పాటు బ్యాంకింగ్, స్టీల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లలో వాల్యూ బైయింగ్ ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 21 రాణించాయి. జేఎస్ డబ్ల్యూ స్టీల్ షేరు 4.72 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా స్టీల్ 3.64 శాతం వృద్ధి చెందగా.. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు 2 శాతానికి పైగా పెరిగాయి. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.48 శాతం వరకు లాభపడగా.. రంగాలవారీ సూచీల్లో ఐటీ, టెక్, సర్వీసెస్ మినహా అన్నీ ఎగబాకాయి. మెటల్ 2.38 శాతం, బ్యాంకెక్స్ 2.09 శాతం పుంజుకోగా.. కమోడిటీస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ 1.84 శాతం వరకు పెరిగాయి.

స్విగ్గీ ఐపీఓ నేటి నుంచే..

» ఇష్యూ ధరల శ్రేణి రూ.371-390
» రూ.11,327 కోట్ల సమీకరణ లక్ష్యం

న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీతో పాటు క్విక్ కామర్స్ సేవలందించే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) బుధవారం ప్రారంభమై శుక్రవారం ముగియనుంది. ఐపీఓలో షేర్ల విక్రయ ధరల శ్రేణిని కంపెనీ రూ.371-390గా నిర్ణయించింది. పబ్లిక్ ఆఫరింగ్‌లో భాగంగా కంపెనీ రూ.4,499 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ఇన్వెస్టర్లకు చెందిన రూ.6,828 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. అంటే ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ.11,327 కోట్లు సమీకరించనుంది. గరిష్ఠ ధర శ్రేణి ప్రకారంగా కంపెనీ 1,130 కోట్ల డాలర్ల (దాదాపు రూ.95,000 కోట్లు) మార్కెట్ విలువను ఆశిస్తోంది. స్విగ్గీ ప్రధాన ప్రత్యర్థి జొమాటో 2021 జూలైలోనే ఐపీఓకు వచ్చింది. ప్రస్తుతం జొమాటో మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) రూ.2.14 లక్షల కోట్ల స్థాయికి చేరింది.

హిందుస్థాన్ జింక్‌లో 2.5% వాటా విక్రయం

» షేరు కనీస ధర రూ.505

న్యూఢిల్లీ: వేదాంత గ్రూప్‌నకు చెందిన హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్‌ఎల్)లో 2.5 శాతం వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా షేరు కనీస ధరను రూ.505గా నిర్ణయించింది. మంగళవారం బీఎస్ఈలో కంపెనీ షేరు ముగింపు ధర రూ.559.45తో పోలిస్తే, ఓఎఫ్ఎస్‌లో షేరు 9.7 శాతం తక్కువకు లభించనుంది. కంపెనీలో వాటా విక్రయం ద్వారా ప్రభుత్వానికి రూ.5,000 కోట్లకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. రెండు రోజులపాటు సాగనున్న ఈ ఓఎఫ్ఎస్‌లో బుధవారం నాన్-రిటైల్ ఇన్వెస్టర్లు, గురువారం రిటైల్ ఇన్వెస్టర్లు కంపెనీ షేర్ల కొనుగోలుకు బిడ్ వేయవచ్చు. హెచ్‌జెడ్‌ఎల్‌లో వేదాంత 63.24 శాతం, కేంద్రం 29.54 శాతం, ఎల్ఐసీ 2.76 శాతం వాటా కలిగి ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

6వ తేదీ			
హైదరాబాద్	545	విజయవాడ	555
వరంగల్	547	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	128	విజయవాడ	125
వరంగల్	128	గుంటూరు	126
కరీంనగర్	128	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	128	చిత్తూరు	118
కర్నూలు	128	నెల్లూరు	118
విశాఖపట్నం	111	అనంతపురం	118
గోదావరి	125		

మారుత్ డ్రోన్స్ రూ.52 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన డ్రోన్ సాంకేతిక స్టార్టప్ మారుత్ డ్రోన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ తాజాగా 62 లక్షల డాలర్ల (సుమారు రూ.52 కోట్లు) నిధులు సమీకరించింది. సిరీస్ ఏ ఫండింగ్‌లో భాగంగా లోక్ క్యాపిటల్ నుంచి ఈ నిధులను సేకరించినట్లు మారుత్ డ్రోన్స్ మంగళవారం వెల్లడించింది. వ్యాపార వృద్ధికి ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు తెలిపింది. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక వ్యవసాయ రంగ డ్రోన్ల అభివృద్ధితో పాటు భాగస్వామ్య నెట్‌వర్క్, సర్వీస్ సెంటర్లను ద్వితీయ, తృతీయ శ్రేణికి విస్తరించడం, డ్రోన్ అగ్రికల్చర్ సర్వీస్ హబ్‌ల ఏర్పాటు ద్వారా వ్యాపారాన్ని విస్తరించాలని కంపెనీ ప్రణాళికను రూపొందించుకుంది. తద్వారా వచ్చే ఐదేళ్లలో టర్నోవర్‌ను రూ.1,000 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఐటీ అధికారులు వడ్డీ మాఫీ చేయవచ్చు

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను శాఖ అధికారులు నిర్దిష్ట షరతులకు లోబడి పన్ను చెల్లింపుదారులు చెల్లించాల్సిన వడ్డీని మాఫీ చేయడం లేదా తగ్గించడం చేయవచ్చని ఆ శాఖ తెలిపింది. ప్రత్యక్ష పన్నుల సెంట్రల్ బోర్డు (సీబీడీటీ) ఈ మేరకు సోమవారం సర్క్యులర్ జారీ చేసింది. ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 220 (2ఎ) కింద పన్ను చెల్లింపుదారుడు డిమాండ్ నోటీసు ప్రకారం పన్ను చెల్లించడంలో విఫలమైతే జాప్యం జరిగిన కాలానికి నెలకు ఒక శాతం వంతున వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ (పీఆర్‌సీసీఐటీ) లేదా చీఫ్ కమిషనర్ (సీసీఐటీ) లేదా ప్రిన్సిపల్ కమిషనర్ (పీఆర్‌సీఐటీ), లేదా కమిషనర్ ర్యాంక్ అధికారులకు ఈ వడ్డీని మాఫీ చేయడం లేదా రద్దు చేసే అధికారం ఐటీ చట్టం దఖలు పరిచింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,240 ▼	73,550 ▼	1,05,000 ▼
ముంబై	78,566 ▲	71,967 ▲	94,261

స్పోర్ట్స్

జెడ్డాలో ఐపీఎల్ వేలం

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మెగా వేలానికి వేదిక ఖరారైంది. ఈ నెల 24, 25 తేదీల్లో సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో వేలాన్ని నిర్వహించనున్నట్టు బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. తొలుత సౌదీ రాజధాని రియాద్‌లో వేలాన్ని నిర్వహిస్తారనే ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. కాగా, ఈ వేలం కోసం మొత్తం 1574 మంది క్రికెటర్లు రిజిస్టర్ చేసుకోగా.. వారిలో 1165 మంది భారత ఆటగాళ్లు. గతేడాది దుబాయ్‌లో వేలం నిర్వహించారు. ఇప్పటిదాకా 16 సార్లు ఐపీఎల్ మెగా వేలం జరగగా... వేలానికి ఎనిమిది సార్లు బెంగళూరు ఆతిథ్యమిచ్చింది.

వామప్ మ్యాచ్ రద్దు సరికాదు


గవాస్కర్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ 'ఎ'తో ఆడాల్సిన టీమిండియా ప్రాక్టీస్ మ్యాచ్‌ను రద్దు చేయడాన్ని మాజీ కెప్టెన్ గవాస్కర్ తప్పుపట్టాడు. 'వామప్ మ్యాచ్ ద్వారా జైస్వాల్, సర్ఫరాజ్‌లాంటి యువ ఆటగాళ్లకు అక్కడి పిచ్‌లపై అవగాహన వచ్చేది. ఒకవేళ వారు త్వరగా అవుటైనా నెట్స్‌లో త్రోడౌన్ స్పెషలిస్టుల ద్వారా ప్రాక్టీస్ సాగించేవారు. అలాగే పేసర్లు ఆకాశ్, హర్షిత్‌లకు సైతం వికెట్‌పై ఏ లెంగ్త్‌లో బౌలింగ్ వేయాలో తెలిసొచ్చేది' అని గవాస్కర్ సూచించాడు. ప్రస్తుత జట్టులో 8 మంది ఆటగాళ్లకు ఆసీస్ గడ్డపై భారత్ తరఫున ఆడిన అనుభవం లేకపోవడం గమనార్హం.



కల సాకారం దిశగా..

ఒలింపిక్స్ ఆతిథ్యంలో ముందడుగు
ఐఓసీకి ఆసక్తి వ్యక్తీకరణ లేఖ అందజేసిన భారత్

న్యూఢిల్లీ: ఒలింపిక్స్ ఆతిథ్యానికి పట్టుదలగా ఉన్న భారత్ ఆ దిశగా ఓ అడుగు వేసింది. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ నిర్వహణకు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణ (ఎల్ఓఐ) లేఖను అందజేసింది. ఈమేరకు లేఖను అక్టోబరు ఒకటిన అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) పంపింది. 'ఈ మహదావకాశం దేశానికి గణనీయమైన ప్రయోజనం చేకూరుస్తుంది. ఆర్థికాభివృద్ధికి ఊతం ఇవ్వడంతోపాటు, సామాజిక పురోగతికి, యువత సాధికారితకు దోహదం చేస్తుంది' అని కేంద్ర క్రీడాశాఖ పేర్కొంది. 2036 విశ్వక్రీడలకు ఆతిథ్యమివ్వాలన్న ఆకాంక్షను ప్రధాని మోదీ గత ఏడాది వ్యక్తంజేసిన విషయం తెలిసిందే. వచ్చే సంవత్సరం ఐఓసీ ఎన్నికలు జరిగాక 2036 ఒలింపిక్స్ వేదికపై నిర్ణయం తీసుకుంటారు. సౌదీ అరేబియా, ఖతార్, టర్కీ సహా పలు దేశాలనుంచి భారత్ తీవ్రమైన పోటీ ఎదుర్కొంటోంది. ఆసక్తి వ్యక్తీకరణ లేఖ సమర్పించడమంటే..ఒలింపిక్స్ ఆతిథ్య దేశం ఎన్నిక ప్రక్రియలో 'అనధికార చర్చల' నుంచి 'నిరంతర సంప్రదింపుల' దిశగా అడుగులు పడినట్టే. ఈ దశలో ఆయా దేశాల ఒలింపిక్స్ నిర్వహణ సత్తాపై అధ్యయనాన్ని ఐఓసీ ప్రారంభిస్తుంది. ఇందులో భాగంగా మానవ హక్కులు, సామాజిక వ్యాపార బాధ్యత, ప్రకృతి పరిరక్షణ ద్వారా సుస్థిర సాధించడం.. తదితర అంశాలను ఐఓసీ సునిశితంగా పరిశీలిస్తుంది. ఇది పూర్తయ్యాక 'లక్ష్యిత సంప్రదింపు'ల దశ మొదలవుతుంది. ఈ దశలో..ఒలింపిక్స్ ఆతిథ్యానికి సంబంధించి అధికారిక బిడ్ సమర్పించాల్సి ఉంటుంది. దీనిని ఐఓసీకి చెందిన 'భవిష్య ఆతిథ్య కమిషన్' అంచనా వేస్తుంది. ఆపై ఆతిథ్య దేశ ఖరారుకు ఎన్నిక నిర్వహణతో మొత్తం ప్రక్రియ ముగుస్తుంది. ఇక..ఒలింపిక్స్ నిర్వహించాలన్న భారత ప్రతిపాదనకు ఐఓసీ చీఫ్ థామస్ బాచ్ సంపూర్ణంగా మద్దతు పలుకుతుండడం విశేషం. 2010లో ఢిల్లీ కామన్వెల్త్ క్రీడల ద్వారా చివరిసారిగా భారత్ ఓ పెద్ద క్రీడా సంరంభానికి ఆతిథ్యం ఇచ్చింది.

అహ్మదాబాద్ ఆతిథ్య నగరం!

2036 ఒలింపిక్స్ ఆతిథ్య నగరం రేసులో అహ్మదాబాద్ ముందంజలో ఉన్నట్టు తెలిసింది. కాగా..ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష సహా పలువురు ఉన్నతస్థాయి దేశ క్రీడా పరిపాలకులు పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా మన దేశానికి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేశారు. ఒలింపిక్స్ ఆతిథ్యం దక్కించుకోవడంలో సఫలమైతే..స్వదేశీ క్రీడలు ఖోఖో, కబడ్డీ, యోగాలను కూడా విశ్వక్రీడల్లో ప్రవేశపెట్టాలని భారత్ యోచిస్తోంది. అలాగే చెస్, టీ20 క్రికెట్, స్క్వాష్ అంశాలకు కూడా స్థానం కల్పించాలని భావిస్తోంది. ఈమేరకు కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్యకు ఒలింపిక్స్ ఆతిథ్యానికి సంబంధించిన సవివర పత్రాన్ని భారత క్రీడాప్రాధికార సంస్థ 'మిషన్ ఒలింపిక్ సెల్' ఇప్పటికే అందజేసింది.

ఆరో రౌండ్లో హంపి పరాజయం

షైంకెంట్ (కజకిస్థాన్): ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ రెండో అంచె ఆరో రౌండ్లో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఓటమి పాలైంది. మంగళవారం జరిగిన ఈ రౌండ్‌లో తెల్లపావులతో బరిలోకి దిగిన హంపిని స్టావ్‌రౌలా సోలకిడౌ (గ్రీస్) 41వ ఎత్తులో ఓడించింది. మరో భారత జీఎం దివ్యాదేశ్‌ముఖ్ తన గేమ్‌ను డ్రా చేసుకుంది. ఈ పోటీల్లో ఓటమి లేకుండా దూసుకెళ్తున్న రష్యా జీఎం అలెక్సాండ్రా గోరియాచ్కినా ఆరో రౌండ్లో ఎలిజబెత్ (జర్మనీ)పై నెగ్గి మొత్తం ఐదు పాయింట్లతో టాప్‌లో కొనసాగుతోంది. తాజా ఓటమితో హంపి 3 నుంచి 6వ స్థానానికి పడిపోయింది. టోర్నీలో మరో మూడు రౌండ్లు మిగిలున్నాయి.

అర్జున్ శుభారంభం

చెన్నై: తెలుగు యువ జీఎం ఇరిగేసి అర్జున్ చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. మంగళవారం మొదలైన ఈ పోటీల్లో అర్జున్ తొలి రౌండ్‌లో విదిత్ సంతోష్ గుజరాతిపై గెలిచాడు. ఇక, ఇక్కడే జరుగుతున్న గ్రాండ్‌మాస్టర్స్ చాలెంజర్స్ ఓపెన్ టోర్నీని హారిక ఓటమితో ఆరంభించింది. తొలి రౌండ్‌లో ప్రణవ్ చేతిలో హారిక పోరాడి ఓడింది.

ఆమె కాదు.. అతడే?

రహస్య వైద్య నివేదికలో వెల్లడి!
ఒలింపిక్ విజేత ఖెలిఫ్ లింగత్వంపై మళ్లీ వివాదం
బాక్సర్ పతకం వెనక్కి తీసుకోవాలన్న హర్భజన్ సింగ్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన అల్జీరియా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ లింగత్వంపై మరోసారి వివాదం రేగింది. ఫ్రెంచ్ జర్నలిస్టు ఫైర్స్ మోర్గాన్.. తాను సంపాదించిన రహస్య వైద్య నివేదికల ప్రకారం ఖెలిఫ్ మహిళ కాదు పురుషుడని ఆరోపిస్తున్నాడు. మగవాళ్లలో కనిపించే హార్మోన్ల లక్షణాలు ఆమెలో ఉన్నాయన్నాడు. జీవశాస్త్రపరంగా ఖెలిఫ్ పురుషుడేనని చెబుతున్నాడు. పారిస్‌లోని క్రెమ్లిన్ బైసెట్రీ ఆసుపత్రి, అల్జీరియాలోని మరో హాస్పిటల్ కలసి ఈ నివేదికను 2023 జూన్‌లో తయారు చేసినట్టుగా తెలుస్తున్నదని మోర్గాన్ పేర్కొన్నాడు. 'ఖెలిఫ్ జననాంగాల ఎదుగుదలలో లోపాలున్నాయని ఎంఆర్ఐ రిపోర్టులో ఉంది. ఆమెకు గర్భాశయం లేదని.. అంతర్గత వృషణాలతోపాటు సూక్ష్మ పురుషాంగం ఉందని అందులో రాశారు. మరో పరీక్షలో ఎక్స్ వై క్రోమోజోమ్‌లతో పాటు పురుష హార్మోన్ టెస్టోస్టిరాన్ స్థాయిలు కూడా ఎక్కువగా ఉన్నట్టు నివేదికలో వైద్యులు పేర్కొన్నార'ని తెలిపాడు. శస్త్రచికిత్సతో సరిచేయించుకోవడంతోపాటు హార్మోన్ చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు చెప్పాడు. ఈ ఆరోపణలు బయటకు రావడంతో తక్షణం ఆమె ఒలింపిక్ స్వర్ణాన్ని వెనక్కు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ కూడా ఆమె పతకాన్ని తిరిగి తీసుకోవాలని కోరాడు. 'మహిళగా భావించి ఆడవాళ్లతో తలపడేందుకు అనుమతించారు. అన్యాయం అని ప్రశ్నించిన వారికి వివక్ష అంటగట్టారు. కానీ, వైద్య నివేదికల ప్రకారం ఖెలిఫ్ పురుషుడే'నని ఎక్స్‌లో భజ్జీ రాశాడు.

విరాట్‌కు విషెస్ చెబుతావా?

ఇటలీ మహిళా ఫుట్‌బాలర్‌పై ట్రోలింగ్



న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన ఓ ఇటలీ మహిళా ఫుట్‌బాలర్ నెట్టింట ట్రోలింగ్‌కు గురైంది. మంగళవారం విరాట్ 36వ జన్మదినం సందర్భంగా 'ఇటలీలోని ఓ అభిమాని తరఫున విరాట్ కోహ్లీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఆల్ ద బెస్ట్' అంటూ ఎగటా ఇసబెల్లా సెంటాస్సో అనే ఫుట్‌బాలర్ ఎక్స్‌లో పేర్కొంది. దీంతో భారత్ నుంచే ఆమెకు విమర్శలు ఎదురయ్యాయి. 'నీకు క్రికెట్ గురించి, కోహ్లీ గురించి ఏమీ తెలీదు. అత్యధిక జనాభా కలిగిన భారత్ నుంచి ఎక్కువ లైక్స్ రావాలనే ఈ ప్రయత్నం' అంటూ ఒకరు.. 'రోహిత్ శర్మ ఫ్యాన్స్ నుంచి నీకిదే చివరి హెచ్చరిక. వెంటనే పోస్ట్‌ను తొలగించు' అని మరొకరు ఆమెను లక్ష్యంగా చేసుకున్నారు. అయితే వీటికి ఇసబెల్లా ఘాటుగానే స్పందిస్తూ.. 'విరాట్ లేదా క్రికెట్ గురించి నేనెప్పుడు మాట్లాడినా నాపై విమర్శలకు దిగుతుంటారెందుకో. నామీద ఇంత తక్కువ అభిప్రాయం ఉంటే నన్ను ఫాలో అవకండి' అని తెలిపింది.

జైపూర్ గెలుపు బాట



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జైపూర్ ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో జైపూర్ పింక్‌పాంథర్స్ జట్టు మూడు మ్యాచ్‌ల తర్వాత గెలుపుబాట పట్టింది. మంగళవారం ఇక్కడ జరిగిన పోరులో జైపూర్ 33-30తో యూపీ యోధాస్‌పై గెలిచింది. కాగా, పింక్ పాంథర్స్ స్టార్ రైడర్ అర్జున్ దేశ్వాల్ పీకేఎల్‌లో 1000 రైడ్ పాయింట్లు సాధించిన ఏడో ఆటగాడిగా అరుదైన ఘనత సాధించాడు. మరో మ్యాచ్‌లో యూ ముంబా 32-26తో దబాంగ్ ఢిల్లీపై విజయం సాధించింది.

మళ్లీ ఆఫ్రో-ఆసియా కప్!

బెనోని (దక్షిణాఫ్రికా): భారత-పాకిస్థాన్‌కు చెందిన క్రికెటర్లు ఒకే జట్టు తరఫున కలిసి ఆడితే ఎలా ఉంటుంది? ప్రస్తుతం కష్టమే అనిపిస్తున్నా.. గతంలో రెండుసార్లు ఇలా ఆడిన అనుభవముంది. ఆసియా ఎలెవన్-ఆఫ్రికా ఎలెవన్ పేరిట ఈ రెండు ఖండాలకు చెందిన క్రికెట్ జట్ల మధ్య ఆఫ్రో-ఆసియా కప్ వన్డే టోర్నీ జరిగేది. 2005లో మొదట దక్షిణాఫ్రికాలో జరగ్గా, 2007లో భారత్‌లోనే నిర్వహించారు. అప్పుడు ధోనీ, గంగూలీ, సచిన్, సెహ్వాగ్, జహీర్, యువరాజ్, షోయబ్ అక్తర్, ఆసిఫ్‌లతో కూడిన జట్టు విజేతగా నిలిచింది. ఆ తర్వాత మూడో ఎడిషన్ 2009లో కెన్యాలో జరగాల్సి ఉన్నా, ముంబై దాడుల నేపథ్యంలో కార్యరూపం దాల్చలేదు. మళ్లీ ఇన్నాళ్లకు ఈ టోర్నీని పునరుద్ధరించాలని ఆఫ్రికా క్రికెట్ సంఘం (ఏసీఏ) భావిస్తోంది. గత శనివారం జరిగిన వార్షిక సమావేశంలో ఈ కప్ నిర్వహణ కోసం ఆరుగురితో మధ్యంతర కమిటీని వేసింది. వీరి నివేదిక ఆధారంగా లీగ్ నిర్వహణపై చర్చించనుంది.

మన్‌దీప్‌కు డబ్ల్యూబీఎఫ్ టైటిల్



న్యూఢిల్లీ: ప్రపంచ బాక్సింగ్ సమాఖ్య (డబ్ల్యూబీఎఫ్) సూపర్ ఫెదర్‌వెయిట్ టైటిల్‌ను భారత ప్రొఫెషనల్ బాక్సర్ మన్‌దీప్ జాంగ్రా సొంతం చేసుకొన్నాడు. కేమన్ ఐలాండ్స్‌లో జరిగిన టైటిల్ బౌట్‌లో బ్రిటన్ బాక్సర్ కానర్ మెకింటోష్‌ను జాంగ్రా మట్టికరిపించాడు. 2021లో ప్రొఫెషనల్‌గా మారిన జంగ్రా తాను తలపడిన 12 బౌట్లలో 11 గెలిచాడు. 2014 కామన్వెల్త్ క్రీడల్లో మన్‌దీప్ అందుకున్నాడు.

ఆసియా పికిల్‌బాల్‌లో 5 స్వర్ణాలు

ముంబై: తైవాన్‌లో జరిగిన ఆసియా పికిల్‌బాల్ క్రీడల్లో భారత ఆటగాళ్లు 5 స్వర్ణాలతో అదరగొట్టారు. 50+ పురుషుల సింగిల్స్‌లో నితిన్, 35+ సింగిల్స్‌లో విశాల్, డబుల్స్‌లో నితిన్-సందీప్, మిక్స్‌డ్‌లో కపాడియా-వృశాలి పసిడి గెలిచారు. టోర్నీలో భారత్ మొత్తం 14 పతకాలు (5 స్వర్ణ, 4 రజత, 5 కాంస్య) సాధించింది.

www.andhrajyothy.com

ANDHRAJYOTHI

బుధవారం | 6-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 218

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

నేరానికి తగ్గ శిక్ష పడుతోందా?

సమీక్షించే యోచనలో కేంద్ర ప్రభుత్వం.. అవసరమైతే ఆ 'తీర్పులు' నిలుపుదల

బాలికలపై అత్యాచారం కేసుల్లో పెద్దగా విచారణ లేకుండానే మరణ శిక్షలు

ఓ కేసులో 30 నిమిషాల్లోనే విచారణ, తీర్పు.. మరోదాంట్లో అరెస్టు చేసిన 23 రోజుల్లో ఉరి

దీంతో 2021 తర్వాత నమోదైన పోక్సో కేసుల్లో తీర్పులన్నింటినీ సమీక్షించే యోచన

విధాన రూపకల్పనలో కేంద్ర న్యాయ శాఖ.. డిసెంబరులో సుప్రీంకోర్టుకు నివేదన

2



హైదరాబాద్‌లో కులగణన సంప్రదింపుల సదస్సు వేదికపై దీపాదాస్ మున్షీ, మహేశ్‌గౌడ్, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క

తెలంగాణలో కులగణన..

దేశానికి నమూనా

భవిష్యత్తులో దేశవ్యాప్తంగా చేపడతాం.. కులగణన కేవలం కులాల గణన కాదు

కుల వివక్ష, అసమానతను ఎదుర్కొంటున్నవారి అభివృద్ధికి సాధనం

ఈ వివరాలతో రాబోయే తరాల భవిష్యత్తుకు, పాలనా విధానానికి రూపకల్పన చేస్తాం

దేశంలో తీవ్ర స్థాయిలో కుల వివక్ష ఉంది

అనేక మంది జీవితాలను నాశనం చేస్తోంది

దీనిపై సవాల్‌కు మోదీ ముందుకు రావట్లేదేం?

కులగణనపై సంప్రదింపుల సదస్సులో రాహుల్

బీసీలకు న్యాయమైన రిజర్వేషన్లు అందిస్తాం

కులగణన మా ప్రభుత్వ బాధ్యత: సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న కులగణన.. దేశానికే ఒక నమూనా కానుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఇక్కడ చేపట్టే కులగణనలో ఏమైనా లోటుపాట్లు జరిగితే.. దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహించేటప్పుడు వాటిని సరి చేసుకుంటామని చెప్పారు. ఈ కులగణన ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంభాషణలాగా ఉండాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం కులగణన కార్యక్రమం చేపట్టడం పట్ల తాను గర్వపడుతున్నానని, రాష్ట్ర నాయకత్వాన్ని అభినందిస్తున్నానని చెప్పారు. మంగళవారం టీపీసీసీ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో కులగణనపై నిర్వహించిన సంప్రదింపుల సదస్సుకు రాహుల్‌గాంధీ హాజరయ్యారు. వివిధ సంఘాలు, వర్గాల నుంచి కులగణనపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం సదస్సునుద్దేశించి రాహుల్ మాట్లాడుతూ.. దేశంలో కులవివక్ష చాలా తీవ్రంగా, లోతుగా ఉందన్నారు. రాజకీయ, న్యాయ, కార్పొరేట్ వ్యవస్థలు సహా అన్ని చోట్లా ఈ వివక్ష ఉందని, దానిని

మిగతా 11వ పేజీలో...

నేటి నుంచి కుల గణన!

కులాలవారీగా ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి సమాచార సేకరణ

'సమగ్ర కుటుంబ సర్వే'కు ఏర్పాట్లు పూర్తి

గోప్యత బాధ్యత ఎన్యూమరేటర్‌దే

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు 11

కులం, మతం లేదని చెప్పొచ్చు

ఆ రాజ్యాంగ హక్కు పౌరులకు ఉంది

కులగణనలో దీన్ని పరిశీలించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

అన్నీ కుదరదు

ప్రైవేటు ఆస్తులన్నింటిపై ప్రభుత్వానికి హక్కు లేదు!



సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు

ఉమ్మడి ప్రయోజనాల కోసమంటూ స్వాధీనం చేసుకోవడానికి వీల్లేదు

8:1 మెజారిటీతో తీర్పు ఇచ్చిన ధర్మాసనం

వ్యతిరేక తీర్పు ఇచ్చిన జస్టిస్ ధులియా

రాజ్యాంగం ఆర్టికల్ 39ని వివరించడంలో గత న్యాయమూర్తులు విఫలం

1977 నాటి కేసులో జస్టిస్ అయ్యర్ వ్యాఖ్యానం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం: సీజేఐ

అయ్యర్‌పై సీజేఐ వ్యాఖ్యలు అవాంఛనీయం

అప్పటి పరిస్థితులకు తగ్గట్లు ఆయన తీర్పు

తన తీర్పులో జస్టిస్ నాగరత్న వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబరు 5: ప్రభుత్వం ప్రైవేటు ఆస్తుల్ని స్వాధీనం చేసుకునే విషయంలో సుప్రీంకోర్టు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. ప్రైవేటు యాజమాన్యంలో ఉన్న అన్ని ఆస్తులనూ ఉమ్మడి ప్రయోజనం కోసం ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం 8:1 మెజారిటీతో ఈ మేరకు తీర్పు ఇచ్చింది. గతంలో దేశంలో సర్వం ప్రభుత్వం కింద ఉండాలనే ఆర్థిక పిడివాదాలు ఉండేవని ధర్మాసనం పేర్కొంది. కానీ, దేశ ఆర్థిక వ్యవస్థ చాలా పరివర్తన చెందిందని, ఆ తరహా సిద్ధాంతం ఇప్పటి కాలానికి సరిపోదని వ్యాఖ్యానించింది. 1977లో రంగనాథరెడ్డి వర్సెస్ కర్ణాటక కేసులో ఆర్టికల్ 39(బి) ప్రకారం ప్రైవేటు యాజమాన్యంలోని ఆస్తులన్నీ సామాజిక ఆస్తుల కింద సేకరించే అధికారం ప్రభుత్వాలకు లేదంటూ 4:3 మెజారిటీతో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. అయితే నాటి ధర్మాసనంలో


మిగతా 2వ పేజీలో...

మదర్సాలకు సుప్రీం ఊరట

యూపీ మదర్సా చట్టం రాజ్యాంగబద్ధమే

17 లక్షల మందిని బడుల్లో చేర్చాలన్న అలహాబాద్ హైకోర్టు తీర్పు కొట్టివేత 2

ఫాజిల్, కామిల్ డిగ్రీలు యూజీసీ చట్టం, రాజ్యాంగానికి విరుద్ధం: ధర్మాసనం



11

శ్రీశైలం, సాగర్‌ను ఖాళీ చెయ్యొద్దు

నీటిని తాగు, సాగుకే వాడండి

వానాకాలం దాకా పొదుపు పాటించండి

తెలుగు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు లేఖ

పోటాపోటీగా నీటి విడుదలపై ఆందోళన

సహజ, సేంద్రియ వ్యవసాయానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

కొత్తగూడెంలో ఏర్పాటుకు కేంద్రం ఓకే

రాష్ట్రంతో కలిసి స్థాపనకు సుముఖం

మంత్రి తుమ్మల లేఖకు స్పందన

మంజూరు కానున్న రూ.10 కోట్లు 12



9

ఇందిరాపార్కు వద్ద మహాధర్నాలో ఆటోడ్రైవర్ చొక్కా వేసుకుంటున్న కేటీఆర్

బిల్డర్లకు ఏడుపే తక్కువ

రాష్ట్రంలో కుదేలవుతున్న నిర్మాణ రంగం

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్లే..

రియల్టర్ల తరఫున అసెంబ్లీలో ప్రశ్నిస్తాం

ఆత్మహత్యలకు పాల్పడే స్థితిలో ఆటోవాలా

రాహుల్.. రంగుల కలలేమైనయ్: కేటీఆర్

25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

2

జమిలి, వక్ఫ్ బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం

విదేశాంగం, కుల గణనపై విపక్షాల గళం

కమల గెలిస్తే చరిత్రే!

చివరి అంకం సర్వేల్లో హ్యారిస్ వైపే స్వల్పంగా మొగ్గు

స్వింగ్ రాష్ట్రాల్లో కొనసాగుతున్న హోరాహోరీ

అయినా.. ఓటర్లు కమలవైపేనంటున్న సర్వేలు

ఆమె విజయావకాశాలు 50.015%

49.985శాతానికి పడిపోయిన ట్రంప్

అమెరికా వ్యాప్తంగా ప్రారంభమైన పోలింగ్

తొలిఫలితం.. ఆరు ఓట్లలో ఇద్దరికీ చెరిసగం

ఎన్నికలవ్వగానే కౌంటింగ్.. 7న పూర్తి ఫలితాలు

ట్రంప్ న్యాయపోరుకు 5 వేల మంది లాయర్లు

ఫలితాలు ప్రతికూలంగా వస్తే కోర్టుకెళ్లేందుకే

కమల గెలుపు కోసం తమిళనాట పూజలు

ఎన్నికల బరిలో భారతీయ అమెరికన్లు

9 మంది పోటీ.. మరోసారి బరిలో ఐదుగురు

వీరిలో ఆరుగురి గెలుపు నల్లేరుపై నడకే

అమెరికన్లు కొత్త అధ్యాయాన్ని లిఖించబోతున్నారు. నేను ఓ మహిళగా ఓట్లడగలేదు. అధ్యక్ష పదవికి సరైన వ్యక్తిని అని భావించినందుకే ఓట్లడిగాను. - కమలాహ్యారిస్

అమెరికా చరిత్రలోనే ఇది గొప్ప రోజు. దేశాన్ని తిరిగి గొప్పగా నిలబెడతా. అది నా వల్లే సాధ్యం. - ట్రంప్



ఓటు హక్కు వినియోగించుకుంటున్న రిపబ్లికన్ ఉపాధ్యక్ష అభ్యర్థి వాన్స్

న్యూయార్క్, నవంబరు 5: హోరాహోరీగా ప్రచారం కొనసాగిన 47వ అమెరికా అధ్యక్ష ఎన్నికలు మంగళవారం తుది అంకానికి చేరుకున్నాయి. దేశవ్యాప్తంగా వేర్వేరు కాలమానాల ప్రకారం.. ఆయా రాష్ట్రాల్లో తెల్లవారుజాము నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. పోలింగ్ క్రతువు మంగళవారం రాత్రి 10 గంటలకు(భారత కాలమానం ప్రకారం.. బుధవారం ఉదయం 11 గంటలకు) పూర్తికానుంది. పోలింగ్

మిగతా 2వ పేజీలో...



మిర్యాలగూడలో రైస్‌మిల్లుల వద్ద బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు

సన్నాలు మిల్లర్లకే

ధాన్యం అమ్మేస్తున్న అన్నదాతలు

తేమ నిబంధనలు లేకపోవడమే ప్రధాన కారణం 11

రూ.2200 నుంచి రూ.2400 వరకు పలుకుతున్న ధర

నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు వెలవెల

సీఎంఆర్ గడువు 30కి పొడిగింపు

11

వ్యవధిని పెంచుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

మళ్లీ 'భారత్' బ్రాండ్ అమ్మకాలు

2

బియ్యం కిలో రూ.34

గోధుమ పిండి రూ.30

అయ్యో.. నాది ఏ రాష్ట్రం?

మెడికోకు శాపంగా 148 జీవో.. పీజీ సీటు కోల్పోతున్న తెలంగాణ వాసి

జీవో ప్రకారం 6-12వ తరగతితో పాటు.. ఎంబీబీఎస్ చదివిన చోటే స్థానికత

ఉమ్మడి ఏపీలో కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదివిన షాద్‌నగర్‌కి చెందిన పృథ్వీరెడ్డి

హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో ఎంబీబీఎస్

పీజీ కౌన్సెలింగ్‌కు అనుమతించని తెలంగాణ

ఎంబీబీఎస్ ఏపీలో చేయలేదని అక్కడా నో..

7న కౌన్సెలింగ్.. ప్రశ్నార్థకంగా భవితవ్యం

ప్రభుత్వం న్యాయం చేయాలంటూ అభ్యర్థన

షాద్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో పుట్టి పెరిగాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు కొన్నాళ్లపాటు ఆంధ్ర ప్రాంతంలో చదువుకున్నాడు. అది కూడా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలలో చదివాడు. ఆ విద్యార్థి ఇప్పుడు ఏ రాష్ట్రానికి చెందినవాడవుతాడు? వైద్య విద్యార్థి ధూరెడ్డి పృథ్వీరెడ్డికి ఇప్పుడు ఇదే సమస్య ఎదురైంది. పీజీ వైద్య విద్యకు అర్హత పరీక్షలో సీటు సాధించి కౌన్సెలింగ్‌కు సిద్ధమైన పృథ్వీరెడ్డిని తెలంగాణ అధికారులు ఏపీకి వెళ్లమంటున్నారు. ఏపీకి వెళితే.. అక్కడి అధికారులు తెలంగాణకు వెళ్లమంటున్నారు. దీంతో రెంటికీ చెడ్డ రేవడిలా మారి.. ఎంతో కష్టపడి సాధించిన పీజీ సీటుకు దూరమయ్యే ప్రమాదంలో ఉన్నాడు. మెడికల్ పీజీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరులో జారీ చేసిన 148 జీవోనే ఇందుకు కారణమైంది. ఈ జీవో ప్రకారం.. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదవడంతోపాటు ఎంబీబీఎస్ కూడా ఇక్కడే పూర్తి చేసినవారికి ఇక్కడి స్థానికత కల్పిస్తారు. అయితే పృథ్వీరెడ్డి.. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందినవాడు. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న విజయనగరం జిల్లా పరిధిలోని కోరుకొండ సైనిక్ స్కూల్లో 6వ తరగతిలో సీటు రావడంతో 12వ తరగతి వరకు అదే పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించాడు. అనంతరం నీట్ పరీక్షలో 1830 ర్యాంకు సాధించి గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో చేరి వైద్య విద్యను పూర్తి చేశారు.



పృథ్వీరెడ్డి

ఆన్‌లైన్ దరఖాస్తు తిరస్కరణ..

ఇటీవల జరిగిన నీట్ మెడికల్ పీజీ ఎంట్రెన్స్‌లో పృథ్వీరెడ్డి 11,362 ర్యాంకు సాధించి కౌన్సెలింగ్‌కు సిద్ధమయ్యాడు. ఈ నెల 7 నుంచి జరగనున్న కౌన్సెలింగ్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ప్రయత్నించగా.. ఆయన

మిగతా 9వ పేజీలో...



1ఎడారిలో మంచు దుప్పటి

దుబాయిలో వర్షాలకు తోడు పొగమంచు కమ్ముకుంది. దీంతో ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు



1నేలపాలు

నాగులచవితికి హైదరాబాద్ వెంగళరావు నగర్‌లో పుట్టలో పోసిన పాలు ఇలా రోడ్డుపైకి వచ్చాయి

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జార్ఖండ్‌లో వరాల వర్షం

జార్ఖండ్ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో, మంగళవారం ఇండియా కూటమి తన మేనిఫెస్టో విడుదల చేసింది. కూటమి పార్టీలైన జార్ఖండ్ ముక్తిమోర్చా (జెఎంఎం), కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఎం ఉమ్మడిగా ఏడుగ్యారంటీలతో ఈ మేనిఫెస్టోను ప్రకటించాయి. పదిలక్షలమంది యువతకు ఉపాధి, పదిహేను లక్షల రూపాయలవరకూ ఆరోగ్యబీమా, నాలుగువందల యాభైరూపాయలకే సిలండర్, మహిళలకు నెలకు రెండున్నరవేల రూపాయలు, ప్రతివ్యక్తికీ ఏడుకేజీల ఆహారధాన్యాలు, వరి కనీస మద్దతుధరను ఎనిమిదివందల రూపాయలు పెంచడం, వెనుకబడిన తరగతులవారికి ప్రత్యేక కమిషన్, మైనారిటీల హక్కుల పరిరక్షణ ఇందులో ఉన్నాయి. జార్ఖండ్‌లో ఉన్నవి 81 సీట్లే కానీ, అక్కడ రెండువిడతల్లో, ఈనెల 13, 20 తేదీల్లో పోలింగ్ జరపాలని ఎన్నికల సంఘం నిర్ణయించుకుంది. గత ఎన్నికల్లో బీజేపీ కంటే ఓ ఐదుసీట్లు ఎక్కువ తెచ్చుకున్న జెఎంఎం, కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. స్థాయితో సంబంధం లేకుండా ప్రతీ చిన్న ఎన్నికనూ తీవ్రంగా తీసుకొనే బీజేపీ ఈ మారు జార్ఖండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది.

బీజేపీ ఇప్పటికే విడుదల చేసిన మేనిఫెస్టోలో, తాను అధికారంలోకి రాగానే 2.87లక్షల ప్రభుత్వోద్యోగాలను భర్తీచేస్తానని, నెలకు రెండువేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇవ్వడంతోపాటు, మహిళలకు వివిధ పథకాలద్వారా దండిగానే ఆర్థికసాయం ప్రకటించింది. పదేళ్ళక్రితం బీజేపీ ఆదివాసీయేతరులను, ప్రధానంగా ఓబీసీలను దగ్గరచేర్చుకొని జార్ఖండ్‌లో అధికారంలోకి రాగలిగింది. ఆ ఎన్నికల్లో మోదీ హవా ఉధృతంగా ఉన్నందువల్ల కూడా ఆ ఎత్తుగడ సులువుగా పనిచేసింది, ఓబీసీ నాయకుడు రఘుబర్‌దాస్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడింది. కానీ, ఐదేళ్ళక్రితం బీజేపీయేతర శక్తులన్నింటినీ దగ్గరకు చేర్చుకోగలిగిన జెఎంఎంకు అనుకూలంగా గాలి తిరిగిపోయింది. ఆదివాసులను విస్మరించినందునే అధికారాన్ని చేజార్చుకున్నానని బీజేపీ నమ్ముతున్నందున ఈ మారు వారి ఓట్లను సైతం అధికంగా కొల్లగొట్టేందుకు విశేషమైన ప్రయత్నం చేస్తోంది. జార్ఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి (యూసిసి)ని అమలు చేస్తానని ప్రకటించిన ఆ పార్టీ దానినుంచి ఆదివాసులను మాత్రం మినహాయించింది. ఇందుకు పూర్తిభిన్నంగా జెఎంఎం ఆదివాసులకు 1932 నాటి ఖతియాన్ విధానం ఆధారంగా సర్నా మతనియమావళిని అమలుచేసి ఒక ప్రత్యేక ఆదివాసీ మత గుర్తింపునకు హామీ పడుతోంది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం ఐదు ఎస్టీ రిజర్వుడు సీట్లనూ ఇండియా బ్లాక్ గెలుచుకున్న విషయం తెలిసిందే.

ఆదివాసుల ఓట్లకోసం బీజేపీ ఎంతగా కష్టపడుతోందో సోమవారం ఎన్నికల సభలో మోదీ చేసిన వ్యాఖ్యలు తెలియచెబుతాయి. రాష్ట్ర బీజేపీ ఉధృతంగా ప్రచారం చేస్తున్న అంశాలను ఆయన కాస్తంత హుందాగా చెప్పారంతే. బంగ్లాదేశీ అక్రమ వలసదారులు జార్ఖండ్ మూలమూలల్లోకి చొరబడ్డారని, వారికి దొంగసర్టిఫికేట్లు ఇచ్చి స్థిరపరచడం ద్వారా ఇండియా కూటమిలోని పార్టీలు అతిపెద్ద ఓటుబ్యాంకును తయారుచేసుకున్నాయని, ఆ చొరబాటుదారులు గిరిజన ఆడబిడ్డలమీద అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, విద్యాసంస్థలకు మైనారిటీ గుర్తింపుతో ఆదివాసీ విద్యార్థులకు జెఎంఎం ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని బీజేపీ విమర్శ. సంథాల్ పరగణాస్‌లో పెద్దసంఖ్యలో అక్రమ చొరబాటుదారులు స్థిరపడ్డారంటూ జార్ఖండ్ హైకోర్టులో ఒక పిల్ దాఖలు కావడం, దానిపై మీడియాలో విస్తృతంగా చర్చ జరుతూండటం ఎన్నికల మహత్యమే కావచ్చు. జెఎంఎం–కాంగ్రెస్ కూటమి ఏలుబడిలో అన్ని రకాలుగా అన్యాయమైపోయిన ఆదివాసుల ప్రయోజనాలను పరిరక్షించేది తానేనని బీజేపీ చెబుతోంది.

ఒక భూకుంభకోణంలో హేమంత్ సొరేన్ అరెస్టు, సుప్రీంకోర్టుతో విడుదల కావడం, హేమంత్ భార్య కల్పనా సొరేన్ తెరమీదకు రావడం ఇత్యాది పరిణామాలు నిజానికి జెఎంఎంకు కొత్తశక్తిని ఇచ్చాయి. మహిళా ఓటర్లను ఆమె బలంగా ఆకర్షించగలుగుతున్నదని అంటారు. అయితే, ఓబీసీలు, ఎగువకులాల ఓట్లు అధికంగా బీజేపీపక్షాన ఉన్నందున ఇండియా కూటమిని ఆదుకోవాల్సింది ప్రధానంగా రాష్ట్రజనాభాలో దాదాపు 27శాతంగా ఉన్న ఆదివాసులే. హేమంత్ సొరేన్ మీద కేసులు, అనంతరం చంపయ్ సొరేన్ బీజేపీలో చేరడం ఇత్యాది పరిణామాల మీద జార్ఖండ్ వాసులు ఏ తీర్పు ఇచ్చారో నవంబరు 23న తేలుతుంది.

వివక్షలు లేని వ్యాపార భారతం లక్ష్యం

ఈస్టిండియా కంపెనీ భారత్‌ను అణచివేసింది. తన వ్యాపార శక్తి సామర్థ్యాలతో కాకుండా, భారతీయ సంపద సృష్టికర్తలను తన కుటిల వ్యాపార పద్ధతులతో జీవన్మరణ దుస్థితిలోకి నెట్టివేయడం ద్వారా ఆ కంపెనీ మన దేశంపై పెత్తనం చేసింది. మన మహారాజులు, నవాబులతో భాగస్వామ్యం నెరపి, ముడుపులు, లేదంటే బెదిరింపులతో వారిని వశంచేసుకుని మన మాతృభూమి జీవన చైతన్యాన్ని స్తంభింపజేసింది. సుదూర పరాయి దేశం నుంచి వచ్చిన ఆ కంపెనీ మన సంప్రదాయ బ్యాంకింగ్ వ్యవస్థలను నియంత్రించింది; పాలనా యంత్రాంగాలపై అజమాయిషీ చేసింది; సమాచార వాహికలను తన ప్రభావ ప్రాబల్యాలలోకి తీసుకున్నది. మనం మన స్వాతంత్ర్యాన్ని మరో దేశానికి కోల్పోలేదు. ఒక గుత్తాధిపత్య వాణిజ్య సంస్థకు చేజార్చుకున్నాము. ఇదొక కఠోర వాస్తవం. ఈ విషాద చరిత్రను మరువ వద్దు, సదా జ్ఞాపకముంచుకోవాలి.


మనతో వాణిజ్యానికి వచ్చిన ఈస్టిండియా కంపెనీ మనకు వ్యాపార నిబంధనలను నిర్దేశించింది. పోటీని నిర్మూలించింది. ఎవరు ఎవరికి ఏది అమ్మాలో, అమ్మకూడదో ఆజ్ఞాపించింది. మన సంప్రదాయ వస్త్ర ఉత్పత్తి రంగాన్ని సర్వనాశనం చేసింది. సరుకుల తయారీ వ్యవస్థలను ఆనవాలు లేకుండా చేసింది. వినూత్న ఉత్పత్తులు వేటినైనా ఆ కంపెనీ ప్రవేశపెట్టిందా? విపణి అవకాశాలను విస్తరింపచేసిందా? నాకు తెలియదు. చరిత్ర చెప్పితే కదా. నాకు తెలిసిందల్లా మన దేశంలో అభిని (నల్ల మందు మొక్క) సాగుపై సంపూర్ణ నియంత్రణ సమకూర్చుకుని మరో దేశం (చైనా)లో నల్లమందు వ్యసనపరులకు ఆ సరుకును సరఫరా



ఒక రాజకీయవేత్తగా నా కర్తవ్యం చారిత్రకంగా అణగారిపోయిన, గొంతుక లేనివాళ్ల పక్షాన నిలబడడమే.

చేయడంపై ప్రత్యేక, సురక్షిత గుత్త వ్యాపార హక్కులను సాధించుకున్నది. ఆ కంపెనీ మన సిరిసంపదలను దోపిడీ చేసింది. పాలనాధికారాలూ పొంది మన ప్రజలను అధిక పన్నులతో పీడించింది. అయినప్పటికీ బ్రిటన్‌లో ఆదర్శ వాణిజ్య సంస్థ (నవీన పరిభాషలో మోడల్ కార్పొరేట్ సిటిజన్)గా ప్రస్తుతులనందుకున్నది. ఆ కంపెనీ విదేశీ వాటాదారులు ఆ సంస్థ పేరు ప్రఖ్యాతులకు పొంగిపోయేవారు!

1857లో ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంతో ఈస్టిండియా కంపెనీ ప్రాబల్యం అన్ని విధాల అంతరించింది. దాన్ని మన తీరానికి పంపిన ఆ పరసీమ సామ్రాజ్యవాదులే మన దేశానికి ప్రత్యక్ష పాలకులు అయ్యారు. ఆనాడు ఆ కంపెనీ వ్యాపార, పాలనా కార్యకలాపాలతో నెలకొన్న భీతి ఇప్పుడు మళ్లీ మన దేశ ప్రజలను ఆవహిస్తోంది. ఆ కంపెనీ లక్షణాలను పుణికి పుచ్చుకున్న కొత్త గుత్త వ్యాపారులు మన వ్యాపార, వాణిజ్య రంగాలలో చెలరేగిపోతున్నారు. అపార ధనరాశులను కూడగట్టుకున్నారు. వారి ఆర్థిక అభిజాత్యానికి హద్దులు లేకుండా పోయాయి. కోటానుకోట్ల భారతీయులు కృశించిపోతుండగా ఆ ఆధునిక కుబేరులు ఉజ్వలంగా వెలిగిపోతున్నారు. మన సంస్థలు, వ్యవస్థలు ఇంకెంత మాత్రం మన ప్రజలకు చెందినవిగా లేవు. వాటి కార్యకలాపాలు మన ప్రజల నిర్ణయాలకు లోబడి జరగడం లేదు. అతి కొద్దిమంది గుత్త వ్యాపారుల ఆదేశాల మేరకు అవి పనిచేస్తున్నాయి. వారి పురోగతే వాటి లక్ష్యమైపోయింది. పర్యవసానంగా లక్షలాది చిన్న పరిశ్రమలు చితికిపోయాయి. మన దేశం ఇప్పుడు యువ భారతీయులకు సరైన ఉపాధి అవకాశాలను కల్పించలేని దుస్థితిలోకి జారిపోయింది. వందే మాతరం. భారత భూమి ఈ గడ్డపై పుట్టిన వారందరికీ మాతృమూర్తి. అయితే ఆమె ప్రసాదించిన అపార సహజ వనరులు అన్నీ ఇప్పుడు గుత్తాధిపత్యంలో ఉన్నాయి. అనేక మంది హక్కులను త్రోసిపుచ్చి ఎంపిక చేసుకున్న అతి కొద్ది మందికి ఆ అనంత సిరులపై స్వామ్యం కల్పించడమేమిటి? భారతమాత పరితాపం చెందుతోంది.



ఈ దేశం మనందరి కోసం ఉన్నది. ప్రభుత్వాధినేతలతో మంచి సంబంధాలతో బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయల రుణం తీసుకుని తిరిగి చెల్లించడాన్ని ఎగవేసిన 100 మంది బడా వ్యాపారస్తుల పట్ల ఇంకెంత మాత్రం ఆదరభావం చూపవద్దు. నిబంధనల ప్రకారం వ్యవహరించే వ్యాపార సంస్థలకు మాత్రమే రుణాలు మంజూరుచేసి లాభాలు ఆర్జించాలి. ఇది అందరికీ శ్రేయస్కరం.

దేశ ఆర్థిక రంగంపై గుత్తాధిపత్యం పెంచుకుంటున్న వారి మూలంగా భీతి చెందుతున్న వ్యవస్థాపనాదక్షులు, దేశభక్తి ప్రపూర్ణులు అయిన భారతీయ వ్యాపారులు ఎంతో మంది ఉన్నారని నాకు తెలుసు. మీరూ వారిలో ఒకరుగా ఉన్నారా? ఫోన్‌లో మాట్లాడడానికి సైతం భయపడుతున్నారా? గుత్తాధిపత్యవాదులు రాజ్య వ్యవస్థతో లాలూచీపడి మీ వ్యాపార రంగంలోకి ప్రవేశించి, మీ సొంత సంస్థను స్వాయత్తం చేసుకోవడానికి పూనుకుంటారేమోననే భయం కలుగుతుందా? మీ వ్యాపార సంస్థలను ఆ గుత్తాధిపత్య కంపెనీలకు విక్రయించేలా చేసేందుకు ఐటీ, సీబీఐ, ఈడీ దాడులు జరగవచ్చని ఆందోళన చెందుతున్నారా? వ్యాపార పురోగతికి అవసరమైన పెట్టుబడి సకాలంలో మీకు లభించకుండా చేస్తారేమోనని కలవరపడుతున్నారా? మీ వ్యాపార మనుగడను దెబ్బతీసేందుకు హఠాత్తుగా నియమ నిబంధనలు మార్చివేస్తారేమోనని స్థిమితం కోల్పోతున్నారా? ఇంతకూ ఉత్పత్తుల ఉత్కృష్టతగానీ, వినియోగదారుల బాహుళ్యం కానీ, భావాల వినూత్నత్వంగానీ ఆ బడా గుత్త వ్యాపారుల ప్రధాన యోగ్యత కానే కాదు; అది, భారతదేశ పాలనా సంస్థలు, విధాన నిర్దేతలను తమకు అనుకూలంగా ప్రభావితం చేయగల సామర్థ్యం మాత్రమే. మీ వలే కాకుండా, ఆ బడా గుత్తాధిపత్య కంపెనీలు భారతీయులు ఏ పుస్తకాలు, పత్రికలు చదవాలో, ఎలాంటి సినిమాలు, ఏ టీవీ కార్యక్రమాలు చూడాలో నిర్ణయిస్తున్నాయి. భారతీయులు ఎలా ఆలోచించాలో, ఏ విధంగా మాట్లాడాలో ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పుడు ఒక వ్యాపారవేత్త విజయం, ఒక వ్యాపార సంస్థ సాఫల్యం లేదా పురోగతిని నిర్ణయిస్తుంది మార్కెట్ శక్తులు కావు, అధికార సంబంధాలు మాత్రమే! వ్యాపార జయాపజయాలను ఇవే నిర్ణయిస్తున్నాయి.

మీ హృదయాలలో ఒక భయవిహ్వలత గూడుకట్టుకుని ఉంది. అయితే దానితో పాటు ఆశాభావం కూడా ఉన్నది. ఒక రాజకీయవేత్తగా నా లక్ష్యం, కాదు కర్తవ్యం చారిత్రకంగా అణగారిపోయినవాళ్ళ, గొంతుక లేనివాళ్ల పక్షాన నిలబడడమే. సమాజంలో అట్టడుగున ఉన్న చిట్టచివరి బడుగుజీవిని ఉద్ధరించడమే మన ధ్యేయం కావాలన్న గాంధీజీ మాటలే నాకు స్ఫూర్తి. ఆ స్ఫూర్తే నా రాజకీయ కార్యాచరణను సదా ప్రభావితం చేస్తోంది. ఆ ప్రభావమే గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, ఆహార హక్కుకు, భూ స్వాధీన బిల్లుకు మద్దతునిచ్చేలా నన్ను పురిగొల్పింది. నియామగిరి ఘర్షణల్లో ఆదివాసీల తరఫున నేను నిలబడ్డాను. మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమించినప్పుడు వారి పక్షాన నా గొంతు విప్పాను. మణిపూర్ ప్రజల వద్దకు స్వయంగా వెళ్లి వారి బాధలు చూశాను, వారి వ్యథలు విన్నాను.

మీకు ఇదిరాస్తున్న సందర్భంగా గాంధీజీ స్ఫూర్తిదాయకమాటల గాంభీర్యాన్ని, పరమార్థాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోయానన్న సత్యాన్ని గ్రహించాను. మన సమాజంలో అనేక సామాజిక శ్రేణులు ఉన్నాయి. మీ వ్యాపార వర్గం వాటిలో ఒకటి. మీరు అనేక ప్రతికూలతల నెదుర్కొంటున్నారు. పీడనలకు గురవుతున్నారు మీకు ఏవైతే నిరాకరించబడ్డాయో అంటే ఒకటి రెండు సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ న్యాయమైన రీతుల్లో పోటీపడే పరిస్థితులు లేకుండా చేశారో అటువంటి పరిస్థితులు, అవకాశాలను కల్పించడమే నా రాజకీయాల లక్ష్యం. ప్రభుత్వం కేవలం ఒకరి ప్రయోజనాలకు మాత్రమే కాపుకాస్తూ మిగతా వారిని ఉపేక్షించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించకూడదు. అవినీతికర రహస్య వ్యాపార పద్ధతులను ప్రోత్సహించకూడదు. ప్రభుత్వ ఏజెన్సీలు అనేవి ఆయుధాలు కాదు. వ్యాపార సంస్థలను బెదిరించడానికి వాటిని దుర్వినియోగం చేయకూడదు. ఇదలా ఉంచితే మీలో నెలకొని వున్న భయం మీ నుంచి ఆ బడా గుత్తాధిపత్య వ్యాపారులకు బదిలీ కాకూడదు. అలా కావడాన్ని నేను ఎటువంటి పరిస్థితులలోను సమర్థించను. వారు చెడ్డ వ్యక్తులేమీ కాదు. మన సామాజిక, రాజకీయ పరిస్థితుల నుంచి ఉత్పన్నమైనవారే. వారికీ వ్యాపారాల నిర్వహణకు అవకాశాలు కల్పించాలి. అలాగే మీకు కూడా.

ఈ దేశం మనందరి కోసం ఉన్నది. ప్రభుత్వాధినేతలతో మంచి సంబంధాలతో బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయల రుణం తీసుకుని తిరిగి చెల్లించడాన్ని ఎగవేసిన 100 మంది బడా వ్యాపారస్తుల పట్ల ఇంకెంత మాత్రం ఆదరభావం చూపవద్దు. నిబంధనల ప్రకారం వ్యవహరించే వ్యాపార సంస్థలకు మాత్రమే రుణాలు మంజూరుచేసి లాభాలు ఆర్జించాలి. ఇది అందరికీ శ్రేయస్కరం. చివరిగా రాజకీయ ప్రవర్తనా రీతులను ప్రభావితం చేసి వాటిని తీర్చిదిద్దడంలో సామాజిక ఒత్తిళ్ల, ప్రతిఘటనల శక్తిని తక్కువ అంచనా వేయకూడదు. అవతార పురుషులు, మహాశక్తిశీలురయిన అతివలు అవసరం లేదు. మీరు మార్పును సాధించగల శక్తులు. సంపదను సృష్టించండి, అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించండి.

ప్రగతిశీల భారతీయ వ్యాపార సంస్థలకు చేయూత నివ్వాలి. వాటిని ప్రత్యేకంగా ప్రోత్సహించాలి. అందుకు శాసనపరమైన, పాలనాపరమైన చర్యలు చేపట్టాలి. ఇది వ్యాపార భారత్‌కు ఒక కొత్త ఒప్పందం. ఇదొక నూతన భావన. దీనిని అమలుపరచాల్సిన సమయమాసన్నమయిందని నేను నిండుగా విశ్వసిస్తున్నాను.

• రాహుల్ గాంధీ
కాంగ్రెస్ ఎంపీ

కాలానికి ముందు నడిచిన ఆర్థికవేత్త



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'మీ ఆంధ్రజ్యోతికి కాలమ్ రాయడం నాకు సంతోషమే.. కాని ప్రతి వారమూ రాయలేను' అని రెండునెలల క్రితం చెప్పిన ప్రముఖ ఆర్థికవేత్త, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆర్థిక సలహా మండలి చైర్మన్ బిబేక్ దేబ్‌రాయ్ నవంబర్ 1న అనారోగ్యంతో మరణించారు. చాలా కాలం క్రితం యూపీఏ హయాంలో ఆయన ఆంధ్రజ్యోతికి కాలమ్ రాసేవారు. అప్పుడు ఆయన సోనియాగాంధీ చైర్మన్‌గా ఉన్న రాజీవ్ గాంధీ ఫౌండేషన్‌లో పనిచేసేవారు. 1991లో ఆర్థిక ఉదారీకరణ తర్వాత వెలుగులోకి వచ్చిన వారిలో బిబేక్ దేబ్‌రాయ్ ఒకరు. అమర్త్యసేన్, వై. వేణుగోపాల్ రెడ్డి, రఘురామరాజన్, అనంత్, అరవింద్ పనగ్రియా లాంటి కొద్ది మంది ప్రముఖ భారతీయ ఆర్థికవేత్తలకు సమస్కంధుడు వివేక్ దేబ్‌రాయ్.

పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టకపోతే దేశంలో అభివృద్ధి రేటు ఇంత వేగంగా పెరిగేది కాదని, మౌలిక సదుపాయాల కల్పన పుంజుకునేది కాదని కొద్ది రోజుల క్రితం తమిళనాడులో పీవీ స్మారకోపన్యాసంలో చెప్పిన దేబ్‌రాయ్ కోల్‌కతా ప్రెసిడెన్సీ కాలేజీ, పూణే గోఖలే ఇనిస్టిట్యూట్, ఐఐఎఫ్‌టిల్లో పని చేశారు. ఆయన భారతదేశ భావజాలం, సంస్కృతి పూర్తిగా ఇముడ్చుకున్న స్వదేశీ ఆర్థిక నిపుణుడు. 40వ ఏట సంస్కృతం నేర్చుకుని మహాభారతం, రామాయణంతో పాటు అనేక పురాణాలను ఆంగ్లంలో అనువదించిన బిబేక్ దేబ్‌రాయ్ పాత వ్యవస్థల్ని సృజనాత్మక విధ్వంసం చేయడం ద్వారానే కొత్త వ్యవస్థల్ని ఏర్పర్చగలమని విశ్వసించే ఆధునికుడు. నిజమైన ఆధునిక ఆర్థిక వ్యవస్థ ఏర్పడాలంటే కాలం చెల్లిన చట్టాల్ని రద్దు చేయాలని, రెడ్ టేపిజం, అవినీతిని అంతం చేయాలని, న్యాయ సంస్కరణలతో పాటు మొత్తం రాజ్యాంగాన్నే తిరగరాయాలని ఆయన వాదించారు. పెండింగ్‌లో ఉన్న వేలాది కేసులు పరిష్కారం కావడం, న్యాయమూర్తుల నియామకాలు, గవర్నర్ల పాత్ర, ఎన్నికల సంస్కరణలపై విప్లవాత్మక నిర్ణయాలు అవసరమని ఆయన చెప్పారు. అంతర్జాతీయ వర్తకం, పెట్టుబడులపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, పరిపాలనా సంస్కరణలను, వికేంద్రీకరణను, సమాఖ్య స్ఫూర్తిని సమగ్రంగా అమలు చేయాలని ఆయన విశ్వసించారు. ఏడవ షెడ్యూలులో చెప్పిన విధంగా రాష్ట్రాల అధికారాలను కాపాడాలని, స్థానిక సంస్థలకు పూర్తిగా సాధికారిత కల్పించాలని ఆయన చెప్పారు.

రాజీవ్ గాంధీ ఫౌండేషన్‌లో పనిచేసినప్పుడు గుజరాత్ ఆర్థిక నమూనాను సమర్థించినందుకు బయటకు వెళ్లాల్సి వచ్చిన బిబేక్ దేబ్‌రాయ్ ప్రధానమంత్రి సలహాదారుగా ఉన్నప్పటికీ ఆయన సలహాల ప్రకారమే మోదీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నిర్వహించిందని చెప్పలేము. బిబేక్ దేబ్‌రాయ్ లాంటి వారు తమ కాలాని కంటే ముందు ఆలోచించి స్వల్పకాలిక లక్ష్యాలు కాకుండా దీర్ఘకాలిక లక్ష్యాలు నిర్ణయించుకోవడంలో ప్రభుత్వానికి సలహా నిస్తారు. 2047 కల్లా వికసిత భారత్, అమృత కాల్ అన్న పదాలు ఆయన ఆలోచనల నుంచే పుట్టాయి. కాని నినాదాలు చేయడమే కాని ఆచరించడంలో పాలకులు శ్రద్ధ చూపకపోతే ఆర్థికవేత్తలు మాత్రం ఏమి చేయగలుగుతారు? ఉదాహరణకు వచ్చే ఏడాది కల్లా భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గత ఏడాది బడ్జెట్ ప్రసంగంలో చెప్పిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది జనవరిలో మాట మార్చి 2027–28 నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకోనున్నట్లు ప్రకటించారు. బిబేక్ దేబ్‌రాయ్ ఈ విషయంలో స్పష్టంగా ఉన్నారు. 'రూపాయి విలువతో అంచనా వేసే జీడీపీని డాలర్లకు మార్చి 5 ట్రిలియన్లకు చేరుకోవడం సాధ్యమా? అలా జరగాలంటే మన జీడీపీ కనీసం 10 శాతం దాటాలి' అని చెప్పారు.

14వ ఆర్థిక సంఘం చైర్మన్ వైవి రెడ్డి చేసిన అనేక ప్రతిపాదనలను బిబేక్ దేబ్‌రాయ్ ప్రభుత్వానికి సూచించారు. భారతదేశంలో పరిపాలన అత్యధికంగా కేంద్రీకృతం అయిందని ఆయన అభిప్రాయపడ్డారు. అధికారాల వికేంద్రీకరణ, నిధుల పంపిణీ, కేంద్ర ప్రాయోజిత పథకాలను పునర్వ్యవస్థీకరించడం. రాష్ట్రాలకు పన్నుల్లో వాటా పెంచడం వంటి 14వ ఆర్థిక సంఘం చేసిన సిఫారసులను అమలు చేయాలని ఆయన సూచించారు. అసలు ఫైనాన్స్ కమిషన్లను శాశ్వతం చేయాలా లేక రద్దు చేయాలా అన్న చర్చను లేవనెత్తించారు. రాష్ట్రాలకు పన్నులు, నిధుల పంపిణీ వాటాను రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించవచ్చు కదా అని ఆయన వాదించారు. కేంద్ర రాష్ట్ర సంబంధాల గురించి ఆయన కొత్త అధ్యాయాన్ని తెరిచారు.

రిజర్వు బ్యాంకుకు స్వతంత్ర ప్రతిపత్తి లేదని స్పష్టంగా చెప్పిన వారిలో బిబేక్ దేబ్‌రాయ్ ఒకరు. మన వ్యవస్థలో అలాంటి అవకాశం లేదని, విత్త విధానం, ఆర్థిక విధానం వేర్వేరు కాదని ఆయన చెప్పారు. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి నీతి ఆయోగ్‌ను, ఆ తర్వాత, జీఎస్టీ కౌన్సిల్ నేర్పాటు చేసిన తర్వాత భారతీయ ఆర్థిక సమాఖ్య స్ఫూర్తిలో మౌలిక మార్పులు వస్తున్నాయని వేణుగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యతో ఆయన పూర్తిగా ఏకీభవించారు. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసిన తర్వాత ఏర్పడిన అసమానతల్ని పూరించేందుకు సంస్థాగత యంత్రాంగం అవసరమని ఆయన వాదించారు. డాలర్ డినామినేషన్‌తో కూడిన బాండ్లలో విదేశాల నుంచి అప్పులు తీసుకోవాలని బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనను బిబేక్ దేబ్‌రాయ్‌తో పాటు వైవి రెడ్డి, రంగరాజన్, రఘురామరాజన్ కూడా విమర్శించారు. దీనివల్ల దేశం శ్రీలంకలాగా స్వతంత్రత కోల్పోతుందని హెచ్చరికలు రావడంతో ప్రభుత్వం ఆ బడ్జెట్ ప్రసంగాన్ని తయారు చేసిన అధికారిని తప్పించాల్సి వచ్చింది.

ప్రభుత్వ రంగ అసమర్థత సంకెళ్ల నుంచి భారత ఆర్థిక వ్యవస్థను విముక్తి చేయాలని వాదించిన వారిలో బిబేక్ ఒకరు. అంతర్గత వనరులను సృష్టించలేని రైల్వే లాంటి వ్యవస్థలను అభివృద్ధి చేయాలంటే భారీ ఎత్తున ప్రభుత్వ రంగ, ప్రైవేట్ భాగస్వామ్యం అవసరమని ఆయన చెప్పారు. పెరుగుతున్న ప్రయాణీకులు, రవాణా అవసరాల రీత్యా 2030 నాటికి 50 లక్షల కోట్లు అవసరమని, అది కేవలం ప్రభుత్వరంగమే సమకూర్చ లేదని ఆయన వాదించారు. కాని రైల్వేలో ఆయన ఆశించినంత భారీ మార్పులు జరుగుతున్న దాఖలాలు కనపడడం లేదు.



40వ ఏట సంస్కృతం నేర్చుకుని మహాభారతం, రామాయణంతో పాటు అనేక పురాణాలను ఆంగ్లంలో అనువదించిన బిబేక్ దేబ్‌రాయ్ పాత వ్యవస్థల్ని సృజనాత్మక విధ్వంసం చేయడం ద్వారానే కొత్త వ్యవస్థల్ని ఏర్పర్చగలమని విశ్వసించే ఆధునికుడు. నిజమైన ఆధునిక ఆర్థిక వ్యవస్థ ఏర్పడాలంటే కాలం చెల్లిన చట్టాల్ని రద్దు చేయాలని, రెడ్ టేపిజం, అవినీతిని అంతం చేయాలని, న్యాయసంస్కరణలతో పాటు మొత్తం రాజ్యాంగాన్నే తిరగరాయాలని ఆయన వాదించారు. యూపీఏ హయాంలో 'ఆంధ్రజ్యోతి'కి కాలమ్ రాసిన బిబేక్ దేబ్‌రాయ్ ప్రముఖ ఆర్థికవేత్తలు వై.వి. రెడ్డి, రఘురామరాజన్, అరవింద్ పనగ్రియాలకు సమస్కంధుడు.

పన్ను వ్యవస్థను సరళతరం చేసి పన్నును చెల్లించే వారి సంఖ్య పెంచేందుకు ఆయన 15 సంవత్సరాల లక్ష్యాన్ని నిర్దేశిస్తూ నీతీ ఆయోగ్‌కు ఒక పత్రాన్ని ఏడేళ్ల క్రితమే సమర్పించారు. కాన్ని పట్టించుకున్న నాథుడే లేడు. 'మన దేశంలో విద్యారంగం నాణ్యత అన్ని రాష్ట్రాల్లో ఒకే రకంగా లేదు. ప్రభుత్వాలు పూర్తిగా దృష్టి కేంద్రీకరించి, వనరుల్ని కేటాయించి, అధ్యాపకులు, తల్లిదండ్రులతో చర్చించి దేశమంతా ఒకే రకమైన నాణ్యమైన విద్య అందించేలా చూడాలి' అని ఆయన చెప్పారు. కాని ఆధునిక భారతదేశానికి అవసరమైన నాణ్యమైన విద్యను కల్పించడంలో మనం ఎన్నో దశాబ్దాలు వెనుకబడి ఉన్నాం.

దేశంలో పోషకాహారం లేకపోవడం మనకు కనపడని ఆకలితో సమానమేనని బిబేక్ దేబ్‌రాయ్ చెప్పారు. ఈ కనపడని ఆకలి వల్ల పుట్టుక లోపాలు, శిశుమరణాలు, అంధత్వం వంటి వాటికి దారితీస్తుందని ఆయన చెప్పారు. వివేక్ దేబ్‌రాయ్ లాంటి ఆర్థిక విజ్ఞుల ప్రోద్బలం వల్లే 80 కోట్ల మందికి ఆహార ధాన్యాల పంపిణీ జరుగుతోంది. 'సంస్కరణలంటే ఏమిటి? వ్యక్తులు, సమూహాలు, సంస్థల్లో మార్పులు రావడం. ప్రభుత్వం అవసరమైన చోట ప్రజల పట్ల తన బాధ్యతను విస్మరించకుండా అనవసరమైన చోట్ల నుంచి తప్పుకోవడం కావాలి' ఆయన రాజస్థాన్ కేడర్‌కు చెందిన తెలుగు అధికారి వి. శ్రీనివాస్ పుస్తకానికి రాసిన ముందుమాటలో పేర్కొన్నారు. భారతదేశంలో అవినీతిపై ఆయన ఒక పుస్తకమే రాశారు. మన జీడీపీలో ప్రభుత్వ అధికారుల అవినీతి, రియల్ ఎస్టేట్‌తో సహా వివిధ రంగాల్లో ఎంత శాతం ఉన్నదో ఆయన పూసగుచ్చినట్లు తెలిపారు. కాని అవినీతిపై ప్రభుత్వం మాటల్లోనే కాని చేతల్లో ఏమీ చేయదని రోజురోజుకూ రుజువవుతోంది.

కేంద్రం నిర్విచక్షణగా వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌ఛార్జీల వల్ల ఫైనాన్స్ కమిషన్ నిర్ణయించిన పన్నుల పంపిణీ అనే దానికే అర్థం లేకుండా పోయింది. వైవిరెడ్డి హయాంలో 14వ ఆర్థిక సంఘం నిర్ణయించిన అత్యధిక పంపిణీకి అర్థం లేకుండా పోయింది. భారతీయ పన్ను వ్యవస్థలో సెస్‌లు, సర్ ఛార్జిలు శాశ్వత లక్షణంగా మారిపోయాయి. సెస్‌ల వినియోగంలో పారదర్శకత లేదు. జాతీయ ప్రాధాన్యత గల రంగాలకే కేంద్ర ప్రాయోజిత పథకాలను అమలు చేయాలని ముఖ్యమంత్రుల కమిటీలతో పాటు అనేక కమిటీలు సిఫారసు చేసినప్పటికీ కేంద్ర ప్రాయోజిత పథకాలు రాష్ట్రాల జాబితాలో ఉన్న అంశాల్లోకి కూడా చొచ్చుకుపోయాయి. రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్ర పథకాలను పునర్వ్యవస్థీకరించకూడదని బిబేక్ దేబ్‌రాయ్ చెప్పిన మాటల్ని కేంద్రం విస్మరిస్తోంది. అధికరణ 282 ప్రకారం చేసే ప్రాయోజిత పథకాల క్రింద గ్రాంట్లు ఫైనాన్స్ కమిషన్ బదిలీలకు మించిపోతున్నాయి. ఉచితాలను బిబేక్ దేబ్‌రాయ్ తీవ్రంగా విమర్శించారు. దేశమంతటా బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు అన్ని రాష్ట్రాలు ఉచితాలను, రాయితీలను ఎడా పెడా కల్పించడంపై ఆయన వ్యాఖ్యానిస్తూ 'మన ప్రజలు దేనికి అర్హులవుతారో అవే వారికి లభిస్తాయి' అని వ్యాఖ్యానించారు. మీరు ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ కదా.. మీ సలహాలన్నీ అమలు అవుతున్నాయా అని ప్రశ్నిస్తే 'నా పాత్ర ప్రధానమంత్రికి సలహా ఇవ్వడం మాత్రమే. అది కూడా ఆయనకు అవసరమైనప్పుడే' అని బిబేక్ దేబ్‌రాయ్ నిర్వేదంగా అన్నారు!

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

శ్వేతసౌధ విజేత ఎవరు?

గల్ఫ్ లేఖ

అమెరికా అధ్యక్ష ఎన్నికలలో సాధారణంగా స్థానిక అంశాల ప్రాతిపదికన కాకుండా అంతర్జాతీయ అంశాల ఆధారంగా తమ అధినేతను ఎన్నుకోవడానికి ఓటర్లు ప్రాధాన్యత ఇవ్వడం పరిపాటి. ఈ కారణంగా అమెరికా అధ్యక్ష ఎన్నికలలో విదేశాంగ విధానం సహజంగా ముఖ్య భూమిక వహిస్తుంది.

అమెరికాకు అత్యంత సన్నిహిత దేశం ఇజ్రాయెల్. ఈ యూదు దేశానికి చేసినంతగా ఆర్థిక, సైనిక సహాయం అమెరికా ఇప్పటివరకు ఏ ఇతర దేశానికీ చేయలేదు. అమెరికా విదేశాంగ విధానంలో ఇజ్రాయెల్ అరబ్బు, ఇరాన్ ఉద్రిక్తతలకు అగ్ర ప్రాధాన్యం వహిస్తున్నాయి. గత ఏడాది అక్టోబర్ నుంచి ఫలస్తీనాలోని గాజాపై ఇజ్రాయెల్ అమానుష సైనిక దాడులు చేస్తోంది. అమెరికాతో సహా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో పెల్లుబుకుతున్న నిరసనల నేపథ్యంలో అమెరికా ఓటర్లు తమ తీర్పును వెలువరిస్తున్నారు.



గుజరాత్‌లోని ముంద్రా రేవు నుంచి ఇజ్రాయెల్‌లోని హైఫా రేవు మీదుగా ఐరోపాకు సరుకులు రవాణా చేయడానికి ఉద్దేశించిన ఒక బృహత్తర పథకాన్ని అమలుపరిచేందుకు ప్రధాని మోదీ పూర్తి స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సముద్ర మార్గం విషయమై అమెరికా, యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్, భారత్ అధికారులు కసరత్తు చేస్తున్నా అనూహ్యంగా గాజా దాడుల నేపథ్యంలో దానిపై పురోగతి కొరవడింది. ఈ పరిస్థితులలో అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల ఫలితాల పట్ల ఇటు భారత్ నుంచి అటు అరబ్బు, ఇజ్రాయెల్ వరకు ఆసక్తి నెలకొని ఉన్నది.

అధ్యక్ష పదవీ పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థులు – డోనాల్డ్ ట్రంప్, కమలా హరిస్ – కూడ ఇజ్రాయెల్‌కు అనుకూలురే. ఇరువురిలో ఎవరు విజేతగా నిలిచినా ఇజ్రాయెల్‌ను నివారించడం లేదా దానికి సైనిక సహాయాన్ని స్తంభింపచేసే అవకాశాలు అంతగా లేవు. అయినా మధ్య ప్రాచ్య ఉద్రిక్తతలు అమెరికా ఎన్నికలలో ఒక కీలక అంశం కావడం విచిత్రం. అక్రమిత గాజా, లెబనాన్‌లపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల ప్రకంపనలు అమెరికా అనుకూల అరబ్బు దేశాల ప్రజానీకంలో ఆగ్రహావేశాలకు కారణం కాకూడదని ఆయా దేశాల ప్రభుత్వాలు కోరుకుంటున్నాయి. అందుకే అవి అమెరికా ద్వారా ఇజ్రాయెల్‌ను నిలువరించేందుకు విఫలయత్నాలు చేశాయి. అమెరికా చరిత్రలో జో బైడెన్ ఇజ్రాయెల్‌కు అత్యంత సన్నిహిత అధ్యక్షుడుగా పేరు పొందగా అదే రాజనీతిని కమలా హరిస్ కూడ కొనసాగించే అవకాశాలు ఉన్నాయని అరబ్బు మేధావులు అభిప్రాయపడుతున్నారు. అయితే డెమొక్రాట్లలో వ్యవస్థీకృతమైన దౌత్యవిధానం ఉంటుందని, అందులో అరబ్బులకు కూడ కొంత వరకు స్థానం ఉంటుందని కూడా అరబ్బు మేధావులు విశ్వసిస్తున్నారు. ఈ నాటకీయ దౌత్య విధానం తమకు కొంత వరకు ఉపశమనం చేకూర్చగలదని అరబ్ ప్రభుత్వాల ఆశ.

ఇజ్రాయెల్‌తో సరిహద్దులు ఉన్న జోర్డాన్, ఈజిప్టులు ఆ యూదు దేశంతో దౌత్య సంబంధాలు కలిగి ఉండడమే కాకుండా అమెరికా కారణాన ఫలస్తీనాపై దాడులకు జోర్డాన్ పరోక్షంగా ఇజ్రాయెల్‌కు సహకరిస్తుందనే ఆరోపణలు కూడ ఉన్నాయి.

డోనాల్డ్ ట్రంప్ తన అధ్యక్ష హాయంలో అబ్రహం ఒడంబడికకు శ్రీకారం చుట్టడం ద్వారా మధ్యప్రాచ్య అరబ్బు దేశాలలో ఒక సాహసోపేత దౌత్య విధానానికి నాంది పలికారు. ఈ ఒడంబడిక ద్వారా ఇజ్రాయెల్‌తో సంపన్న అరబ్బు దేశాలు మైత్రి చేసుకొనే అవకాశం కల్పించారు. గల్ఫ్‌లోని యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్, బహ్రెయిన్‌లతో పాటు సుడాన్, మొరకో దేశాలు ఇజ్రాయెల్‌ను గుర్తిస్తూ వాటితో దౌత్యసంబంధాలను నెలకొల్పుకున్నాయి. దుబాయి అయితే ఇజ్రాయెల్ దోస్తానా విషయమై మిగతా గల్ఫ్ రాజ్యాల కంటే ముందంజలో ఉన్నది. ఫలస్తీనాను కూడ ఒక ప్రత్యేక దేశంగా గుర్తించే నిబంధనలతో కీలకమైన సౌదీ అరేబియా సైతం అబ్రహం ఒడంబడికలో చేరుతుందనే వార్తలు వచ్చిన నేపథ్యంలో గత ఏడాది అక్టోబర్ 7న ఇరాన్ ప్రొద్బలంతో హమాస్ ఇజ్రాయిల్‌పై క్షిపణి దాడులు చేసింది. అందుకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ పాల్పడుతున్న మారణకాండతో అరబ్బులలో ఆగ్రహావేశాలు పెరిగిపోయాయి. దీంతో ఏ ఒక్క అరబ్బు దేశం కూడ అబ్రహం ఒడంబడిక లేదా మరే ఇతర నూతన ఒప్పందాల ద్వారా ఇజ్రాయెల్‌తో బాహాటంగా మైత్రి చేసేందుకు మొగ్గు చూపకపోవచ్చు.

అబ్రహం ఒడంబడిక ద్వార భారత్ నుంచి కీలక గల్ఫ్ అరబ్బు దేశాలతో పాటు ఇజ్రాయెల్ మీదుగా ఐరోపాకు నౌకా రవాణా మార్గాన్ని సుగమం చేసే దిశగా కూడ అడుగులు పడుతున్నాయి. ఈ యురేసియా మార్గం ద్వారా భారత్ నిజంగా తాను విశ్వగురు అని నిరూపించుకునె అవకాశం ఉంది. గుజరాత్‌లోని ముంద్రా రేవు నుండి ఇజ్రాయిల్‌లోని హైఫా రేవు మీదుగా ఐరోపాకు సరుకులు రవాణా చేయడానికి ఉద్దేశించిన ఈ బృహత్తర పథకాన్ని అమలుపరిచేందుకు ప్రధాని మోదీ పూర్తి స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. గుజరాత్‌లోని ముంద్రా నౌకాశ్రయం, అటు చివర ఇజ్రాయిల్‌లోని హైఫా నౌకాశ్రయ నిర్వహణ రెండు కూడ అదానీ గ్రూప్ యాజమాన్యంలో ఉన్నాయనేది మరో విషయం. ఈ మార్గం గురించి అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, భారతీయ అధికారులు కసరత్తు చేస్తున్నా అనూహ్యంగా గాజా దాడుల నేపథ్యంలో దీనిపై పురోగతి కొరవడింది. ఈ పథకం ముందుకు సాగడానికి అబ్రహం ఒడంబడిక కర్త అయిన డోనాల్డ్ ట్రంప్ మరోసారి శ్వేత సౌధంలో ఉండడం భారత్‌కు చాలా అవసరం కూడా.

డోనాల్డ్ ట్రంప్ మొదటిసారి అమెరికా అధ్యక్షునిగా ఎన్నికయిన తర్వాత తన విదేశీ పర్యటనను సౌదీ అరేబియా నుంచి ప్రారంభించారు. తద్వారా మధ్య ప్రాచ్య అరబ్బు ప్రాంతం పట్ల తనకున్న ప్రాధాన్యతను చాటారు. జెరుసాలం మూమ్మాటికి ఇజ్రాయిల్‌కు చెందాలని చెప్పిన డోనాల్డ్ ట్రంప్‌కు కీలక అరబ్బు పాలకులందరితో పాటు ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమీన్ నెతన్యాహుతో కూడ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ పరిస్థితులలో అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల ఫలితాల పట్ల ఇటు భారత్ నుంచి అటు అరబ్బు, ఇజ్రాయెల్ వరకు ఆసక్తి నెలకొని ఉన్నది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)


కులగణనపై దుష్ప్రచారాలు నమ్మవద్దు!

ప్రజల జీవితాల్లో మరింత వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో కులగణనకు శ్రీకారం చుడుతున్నది. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వస్తే సామాజిక, ఆర్థిక, రాజకీయ కులగణన జరిపి తీరుతామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. 2023 సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లోని తుక్కుగూడ బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం ఇదే విధంగా ప్రకటన చేశారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే మడప తిప్పదు. ఈ విషయాన్ని గతంలో ఎన్నోసార్లు చరిత్ర రుజువు చేసింది. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని సోనియా గాంధీ హామీ ఇచ్చి నెరవేర్చారు. రాహుల్ గాంధీ చెప్పిన మాట ప్రకారం నేటి నుంచీ తెలంగాణ రాష్ట్రంలో కులగణన (సమగ్ర కుటుంబ సర్వే) జరగబోతున్నది. రాష్ట్రంలో ఏ కులాల వారు ఎంతమంది అన్న సమాచారంతో పాటు విద్య, ఉద్యోగ, సామాజిక రాజకీయ రిజర్వేషన్లు ఆయా వర్గాలకు పక్కాగా అందేందుకు ఈ దోహదపడుతుంది.

2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పాలకులు తెలంగాణలో సమగ్ర సర్వేను అట్టహాసంగా చేపట్టారు. సర్వే వివరాలను మాత్రం బయటపెట్టలేదు. వాటిని బహిర్గతం చేసేందుకు జంకారు. వివరాలను బుట్టదాఖలు చేశారు. దేశంలో కులగణన చివరిసారిగా 2011లో జరిగింది. ఆ తర్వాత 2014 నుంచి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం తాత్సరం చేస్తూనే ఉన్నది. కులగణనతో అన్ని వివరాలు తెలిస్తే ఎక్కడ తమ వైఫల్యం బయటపడుతుందోననే భయం వల్ల కావచ్చు. గత పదేళ్లలో నిరుద్యోగం, పేదరికం పెరిగిన అంశం ప్రస్ఫుటమవుతుందన్న భయంతో కావచ్చు.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ సమగ్ర కుల సర్వే ప్రజల భవిష్యత్తును నిర్ణయించేందుకు ఉపకరిస్తుంది. సంక్షేమ పథకాలు అట్టడుగు వర్గాల ప్రజలకు అందేలా చూడడం, అందరికీ సమాన అవకాశాలు, సమన్యాయం దక్కేలా చూడటం కాంగ్రెస్ ప్రభుత్వ ఆకాంక్ష. ఈ దిశగానే ఈ సర్వే. ప్రతిపక్షాలు లేనిపోని అనుమానాలు కలిగించినా, దుష్ప్రచారం చేసినా ప్రజలు ఏ మాత్రం పట్టించుకోరాదు. నిరంతరం ప్రజల కోసం పాటుపడేదే ప్రజా ప్రభుత్వం. ఇందులో ఏలాంటి అనుమానాలకు తావు లేదు. ప్రభుత్వానికి అండగా ఉండడమే ఏకైక మార్గం.

– వెలిచాల రాజేందర్‌రావు
కాంగ్రెస్ నాయకులు, కరీంనగర్.



ఘనంగా సైక్లింగ్ పోటీలు షురూ
రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు 4

మా పూజలందుకో నాగన్న



- భక్తి శ్రద్ధలతో నాగుల చవితి
- నాగేంద్రుడికి మహిళల నీరాజనం
- పుట్టల వద్దకు తరలొచ్చిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు

'శరవణ భవ.. శరవణ భవ.. శ్రీనాగేంద్రహ రాయా త్రిలోచనాయా.. సుబ్రహ్మణ్యం మాంపాహి' అంటూ నాగుల చవితి పర్వదినం రోజున భక్తులు నాగేంద్రస్వామిని ఆరాదించారు. పుట్టలో పాలు పోసి పసుపు కుంకుమలు చల్లి మా కష్టాలను తీర్చవయ్యా.. మమ్ములను ఆదుకోవయ్యా.. అంటూ భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. అందరి దైవం నీవయ్యా.. పూజలు గైకొనుమా.. అంటూ వరంగల్ నగరంలో భక్తి ప్రపత్తులతో నాగేంద్రుడిని మహిళలు కొలిచారు.

వివరాలు : 6లో..

-హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్

ఆధ్యాత్మికం



హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్‌లో పుట్ట వద్ద మొక్కులు సమర్పిస్తున్న మహిళలు

తెలంగాణ ప్రభుత్వం
సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే
(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)





సర్వేకు సిద్ధం

- నేటి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే
- రెండు దశల్లో ప్రక్రియ.. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ

హనుమకొండ/వరంగల్ సిటీ/వరంగల్ కార్పొరేషన్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో బుధవారం నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) జరుగనున్నది. సర్వేను పారదర్శకంగా, పగడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గణకులకు మూడు రోజులుగా శిక్షణా తరగతులను నిర్వహించి సర్వేకు సన్నద్ధం చేశారు. కాగా, సమగ్ర ఇంటింటి సర్వే మొత్తం రెండు దశలలో జరుగుతుంది. మొదటి దశ ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు జరుగుతుంది. ఇంటింటి సర్వే చేసి కుటుంబ జాబితా షెడ్యూల్ ద్వారా మొత్తం కుటుంబాల జాబితాను రూపొందిస్తారు. రెండో దశ ఈనెల 9 నుంచి 15 రోజుల పాటు సర్వే చేసి ప్రతీ కుటుంబం సమగ్ర సమాచారాన్ని సమగ్ర షెడ్యూల్ ద్వారా సేకరిస్తారు. సర్వే గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు విస్తృతంగా ప్రచారం చేశామని, ప్రజాప్రతినిధులు కూడా ఇందులో భాగస్వాములు అవుతున్నారని హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారద తెలిపారు. ప్రజలందరూ ఈసర్వేలో పాల్గొని సరైన సమాచారం అందించాల్సిందిగా కోరారు.

జిల్లాల్లో..

హనుమకొండ జిల్లాలో మొత్తం 3 లక్షల కుటుంబాలున్నాయి. 150 కుటుంబాలను ఒక గణన బ్లాకుగా నిర్ణయించారు. ఈ లెక్కన 1,916 బ్లాకులుగా విభజించారు. ఒక్కో బ్లాకు ఒక గణకుడి చొప్పున మొత్తం 1,916 గణకులను నియమించారు. వీరిపై పర్యవేక్షణకు పది గణకులకు ఒక సూపర్‌వైజర్ చొప్పున 218 మందిని నియమించారు. వీరికి మూడు రోజులుగా శిక్షణా తరగతులను నిర్వహించి సర్వేకు సన్నద్ధం చేశారు. వరంగల్ జిల్లాలో మొత్తం 1,45,882 లక్షల కుటుంబాలున్నాయి. 150 కుటుంబాలను ఒక గణన బ్లాకుగా నిర్ణయించారు. ఈ లెక్కన 1,841 బ్లాకులుగా విభజించారు. ఒక్కో బ్లాకు ఒక గణకుడి చొప్పున మొత్తం 1,841 గణకులను నియమించారు. వీరిపై పర్యవేక్షణకు పది గణకులకు ఒక సూపర్‌వైజర్ చొప్పున 204 మందిని నియమించారు.

బల్దియాలో పకడ్బందీ ఏర్పాట్లు

వరంగల్ నగరంలో ఈ నెల 6 బుధవారం నుంచి 66 డివిజన్‌లలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నుంచి నిర్వహించనున్నట్టు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇందుకోసం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. 75 అంశాలతో కూడిన ప్రశ్నావళిని రెండు పార్ట్‌లుగా విభజించామని తెలిపారు. ఎన్యుమరేటర్ 90 నుంచి 175 గృహాల్లో సర్వే నిర్వహిస్తారని తెలిపారు. సర్వే పక్కాగా నిర్వహించడానికి వీలుగా గృహాలకు స్టిక్కర్లు అందజేయడంతోపాటు గృహాలకు సంబంధించిన జాబితాతో కూడిన స్టేషనరీ అందించామన్నారు. తొలి దఫాలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు గృహాలకు స్టిక్కరింగ్ చేస్తామని, 9 నుంచి సర్వే మొదలవుతుందని అన్నారు. సర్వే నిర్వహణకు వచ్చే సిబ్బందికి నగర ప్రజలు సమగ్ర సమాచారం అందజేసి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. బల్దియా పరిధిలో 2,90,969 గృహాలకు సంబంధించి 1674 ఎన్యుమరేటర్లు 168 సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొంటారని కమిషనర్ తెలిపారు.

ఏం చెప్పాలి?

- ప్రశ్నలు, సమాధానాలపై ప్రజల్లో అనుమానాలు
- ఏ వివరాలు ఇవ్వాలన్నదానిపై చర్చ

6

సర్వే సరే.. పాఠాలు మరి?

- నెల రోజుల పాటు ప్రాథమిక విద్యకు విఘాతం
- ప్రక్రియ పూర్తయ్యే వరకు ఒంటిపూట బడులు
- ఉపాధ్యాయ వర్గాల నుంచి అభ్యంతరాలు

6



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో న్యాయం జరిగేలా కృషి చేస్తాం..

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులలో చట్ట ప్రకారం న్యాయం జరిగే విధంగా కృషిచేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ కాన్ఫరెన్స్‌హాల్‌లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు వివరాలు, వాటి పురోగతి, తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై కమిటీ సభ్యులు, పోలీసు, రెవెన్యూ అధికారులతో చర్చించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ మూడునెలలకోసారి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని, మానిటరింగ్ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. కమిటీ సమావేశంలో చర్చించిన అన్ని అంశాలను, సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, హనుమకొండ, పరకాల ఆర్‌డీఓలు, ఏసీపీలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటానికి ప్రపంచ గుర్తింపు..

- భూమి, భుక్తి కోసం జరిగిన పోరు అజరామరం
- నల్ల నర్సింహులు లాంటి వారు పుట్టడం ఈ గడ్డకే గర్వకారణం
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ
- నర్సింహులు పోరాటం ఎంతో గొప్పదని : దయాకర్‌రావు
- పాలకుర్తిలో నల్ల నర్సింహులు విగ్రహావిష్కరణ

4

2050 విజన్‌తో వరంగల్ మాస్టర్ ప్లాన్

- త్వరలో సీఎం చేతుల మీదుగా విడుదల
- యుద్ధ ప్రాతిపదికన వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- వరంగల్ అభివృద్ధిపై హైదరాబాద్‌లో విస్తృతస్థాయి సమావేశం



హైదరాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన కొండా సురేఖ, వేం నరేందర్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చారిత్రక నేపథ్యం కలిగిన వరంగల్ నగర అభివృద్ధికి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 2050- విజన్‌తో రూపొందించిన మాస్టర్‌ప్లాన్ తుది దశకు చేరుకుందని, త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా దాన్ని విడుదల చేస్తామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో వరంగల్, హనుమకొండ జిల్లాల అభివృద్ధి కార్యక్రమంపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి, ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన మాస్టర్ ప్లాన్, వరంగల్ ఇన్నర్‌రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు, భద్రకాళి ఆలయ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మెగా టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్‌పోర్టు, ఎకో టూరిజం తదితర అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరానికి దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తమ ప్రభుత్వం కొలిక్కి తీసుకొచ్చిందని అన్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డుకు అవసరమైన భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. 41 కిలో మీటర్ల పరిధి ఉన్న వరంగల్ ఔటర్ రింగు రోడ్డును మూడు దశల్లో చేపట్టాలని సూచించారు. మొదటి దశలో 20 కిలో మీటర్లు, రెండో దశలో 11 కిలో మీటర్లు, మూడో దశలో 9 కిలో మీటర్లు పనులు చేపట్టాలని నిర్ణయించినట్టు చెప్పారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ జిల్లాలోనే ఎయిర్‌పోర్టు రాబోతోందని, వీలైనంత త్వరగా పనులను ప్రారంభించి ఏడాదిలోపు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 382 ఎకరాల పరిధిలో ఉన్న భద్రకాళి చెరువులో పేరుకుపోయిన పూడికను తీయాలని అన్నారు. ఇందుకు సంబంధించిన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటుచేసిన కంపెనీలు తప్పనిసరిగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వీలైనంత త్వరగా ప్రాంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. వరంగల్ ప్రజల చిరకాల వాంఛ అయిన మామునూరు ఎయిర్‌పోర్టు కల త్వరలో సాకారం కానుందన్నారు. ఇక్కడి నుంచి ప్రజలకు రవాణా సౌకర్యంతో పాటు కార్గో విమాన సర్వీసులు ప్రారంభించే దిశగా కృషి చేస్తామన్నారు. వరంగల్ మాస్టర్ ప్లాన్ అమలు కోసం ప్రత్యేక అధికారిని నిమమించాలని ఎంఏయూడీ ముఖ్యకార్యదర్శిని ఆదేశించినట్టు చెప్పారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో తమ నియోజకవర్గంలో ట్రిపుల్‌ఐటీ కళాశాలను స్థాపిస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదని, కాంగ్రెస్ హయాంలో కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎంఏయూడీ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, రోడ్లుభవనాల కార్యదర్శి హరిచందన, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆయారే.. టెక్నోజియాన్..

- నిట్‌లో 8 నుంచి 10 వరకు నిర్వహణ

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో టెక్నోక్రాట్స్ అద్భుత ప్రదర్శనల టెక్నోజియాన్ ఈ నెల 8 నుంచి 10 వరకు మూడు రోజల పాటు నిర్వహించనున్నారు. భావి ఇంజనీర్లు అబ్బురపరిచే ఆవిష్కరణలను మన ముందు ఉంచనున్నారు. ఈ మేరకు మంగళవారం నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి టెక్నోజియాన్ టీజర్‌ను క్యాంపస్‌లో విడుదల చేశారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న నిట్ టెక్నోజియాన్‌లో వివిధ విభాగాల సొసైటీలు, క్లబ్‌ల ద్వారా 50కి పైగా ఈవెంట్లు నిర్వహించనున్నారు. రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని, పాల్గొనే వారు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు.



టెక్నోజియాన్ టీజర్, టీజర్‌ను విడుదల చేస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి



సమావేశంలో మాట్లాడుతున్న సాయిని నరేందర్

బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం చేయాలి

ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్

బాలసముద్రం, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు బీసీలు పోరాటం చేయాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాయిని నరేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటాల ఫలితంగా తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి బీసీల సమగ్ర కుల జనగణన జరిపి తద్వారా స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ముందుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఓబీసీ జాక్, తెలంగాణ పూలే యువజన సంఘాల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీం కోర్టు సూచనల ప్రకారం డెడికేటెడ్ కమిషన్ కమిటీని నియమించినట్లు తెలిపారు. సమగ్ర కుల గణన అనంతరం ఆలస్యం లేకుండా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, కామారెడ్డి డిక్లరేషన్, పలు అంశాల అమలు జరిగే వరకు బీసీ నాయకులు సంఘటితంగా పోరాటం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల బీసీ నాయకులు వేణుమాధవ్, చిల్లా రాజేంద్రప్రసాద్, నలుబాల రవికుమార్, అమరేందర్, పి.వెంకటచారి, సద్గుణ, సరోజన, అశ్విని, చంద్రశేఖర్, సాయితేజ, రాఖీ, మాధవి, స్వప్నరాణి, స్వప్న, స్వరుప తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేటలో మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

వర్గీకరణ పేరుతో చేసే కుట్రలను తిప్పికొట్టాలి

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

నర్సంపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలో ఏ,బీ,సీ,డీ వర్గీకరణ పేరుతో దళితుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలను తిప్పికొట్టాలని తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన మహాపాదయాత్ర ఖమ్మం జిల్లా భద్రాచలం నుంచి నర్సంపేట పట్టణానికి మంగళవారం చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ దళితులను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకుంటున్నాయని, దళితుల మధ్య అనైఖ్యత ఏర్పరిచి రాజ్యాధికారానికి దూరం చేస్తున్నాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను పెంచాలని, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరగబోయే మాలమహానాడు సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు ప్రకాష్, దార్ల రమాదేవి, మోటూరి రవి, పెరుమాండ్ల రవి, బండి ప్రవీణ్, దండెం రతన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటానికి ప్రపంచ గుర్తింపు

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ● పాలకుర్తిలో నల్ల నర్సింహులు విగ్రహావిష్కరణ



పాలకుర్తిలో మాట్లాడుతున్న నారాయణ

పాలకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక గుర్తింపు ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. మంగళవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యోధుడు నల్ల నర్సింహులు విగ్రహాన్ని నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4వేల మంది రైతులు, ప్రజలు అమరులయ్యారని గుర్తు చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన పోరాటం అజరామరం అన్నారు. నర్సింహులులాంటి యోధుడు తెలంగాణలో జన్మించడం ఈ ప్రాంతానికే గర్వకారణన్నారు. నర్సింహులు రాసిన పుస్తకాన్ని తాను ఢిల్లీకి రైల్లో వెళ్తున్న సందర్భంలో చదివినట్లు చెప్పారు. వచ్చే రెండేళ్లలో నర్సింహులకు నూరేళ్లు నిండుతాయని, ఇక్కడి ప్రజలందరు ఆయన శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేరళ, పశ్చిమ బెంగల్‌లాంటి రాష్ట్రాల్లో భూమి కోసం భూస్వాములపై ప్రజలు తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. భారత దేశంలో 1920లో కమ్యూనిస్టు పార్టీ దున్నేవాడికే భూమి అనే నినాదం తీసుకువచ్చిందని గుర్తుచేశారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అన్నివర్గాల ప్రజలు పోరాటం చేశారని అన్నారు. మా దేహం ముక్కలైన దేశాన్ని ముక్కలు కానివ్వం అని కమ్యూనిస్టులు పోరాడినట్లు తెలిపారు.

జమిలి ఎన్నికలకు బీజేపీ సన్నాహం..

దేశంలో జమిలి ఎన్నికలు జరపించేలా బీజేపీ సిద్ధమవుతోందని, దానిని వ్యతిరేకించేందుకు ఇండియా కూటమితో కలిసి వామపక్ష పార్టీలు పని చేస్తాయని నారాయణ స్పష్టం చేశారు. ఈ రోజుల్లో ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి వెళ్తున్న నాయకులు సిగ్గుపడాలన్నారు. పార్టీ మారాలి అనుకునేవారు రాజీనామా చేసి వెళ్లాలని సూచించారు. దేశంలో మెజారిటీ ప్రజలు ఐక్యంగా ఉండాలని ప్రధాని పిలుపునివ్వడం సిగ్గు చేటన్నారు.

నర్సింహులు పోరాటం ఎంతో గొప్పది..

మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. నల్ల నర్సింహులు చేసిన పోరాటం ఎంతో గొప్పదన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో చాకలి ఐలమ్మ, దొడ్డి కొంరయ్య, షేక్‌బందగీ లాంటి పోరాట యోధులే కాకుండా కవులు బమ్మెర పోతన, పాల్కూరికి సోమనాథుడు, వాల్మీకి లాంటి వారు ఇక్కడి జన్మించినట్లు తెలిపారు. పాలకుర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ మంచి మిత్రుడని అన్నారు. నల్ల నర్సింహులు, కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాల ఏర్పాటుకు తాను సహకరించినట్లు తెలిపారు.

దేశ్‌ముఖలది నీచమైన చరిత్ర: పాశం

సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ.. సాయుధ పోరాట సమయంలో 150 మందిని చంపి, మహిళలను అర్ధనగ్నంగా బతకమ్మలాడించిన నీచ చరిత్ర దేశ్‌ముఖ్‌లదన్నారు. నర్సింహులు, నంద్యాల శ్రీనివాస్‌రెడ్డిలకు ఉరి శిక్ష వేసింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. పోరాటం గురించి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏం తెలుసని ప్రశ్నించారు. కార్యక్రమానికి సభ అధ్యక్షుడుగా మాచెర్ల సారయ్య, నర్సింహులు కూతురు అరుణ, సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యేలు రాజారెడ్డి, వన్నాల శ్రీరాములు, వల్లకాటి రాజ్‌కుమార్, అబ్బాస్, సింగారపు రమేష్, తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మంజుల, సాంబయ్య, భార్గవ్, సుదర్శన్ కృపాకర్, చిదురాల ధనుంజయ ఉన్నారు.



పాలకుర్తిలో నల్ల నర్సింహులు విగ్రహానికి పూలమాల వేస్తున్న దయాకర్‌రావు

క్రీడలకు పెద్ద పీట

హనుమకొండ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్‌లో క్రీడలకు పెద్ద పీట వేస్తున్నామని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే టీఎస్ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్‌కు సంబంధించి 2023-24 సంవత్సరానికి ఇంటర్ సర్కిల్ టోర్నమెంట్లను తెలంగాణలోని ట్రాన్స్‌కో డిస్కమ్స్‌లోని అన్ని సర్కిళ్ల పరిధిలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్లలో టీఎస్ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్‌లోని ఉమ్మడి సర్కిళ్ల వారిగా హాకీ, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మంగళవారం హనుమకొండలోని విద్యుత్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి విజేతలకు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ టి.మధుసూదన్, సూపరింటెండెంట్ ఇంజనీర్లు మధుసూదన్, జె.నరేష్‌కుమార్, వేణుమాధవ్, స్పోర్ట్స్ కౌన్సిల్ మెంబర్స్ ఎండి యాకూబ్ పాషా, వి.సునిల్‌కుమార్, ప్రేమ్‌కుమార్, హనుమకొండ ఎస్ఏవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్ష ఫీజును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 25లోగా చెల్లించాలని వరంగల్, హనుమకొండ డీఐఈవోలు ఎ.గోపాల్, డాక్టర్ శ్రీధర్ సుమన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో డిసెంబరు 4 వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 11 వరకు చెల్లించే అవకాశం ఉందని తెలిపారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పరిధిలోని చార్‌బౌళి వాటర్ ట్యాంక్ వద్ద మరమ్మతుల కారణంగా బుధవారం ఈ ప్రాంతంలో నీటి సరఫరా నిలిపి వేస్తామని ఈఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో వెల్లడించారు. గిర్మాజీపేట, మండిబజార్, నిజాంపుర, రాధికా టాకీస్ గల్లీ, లక్ష్మీపురం, పాత, కొత్త చార్‌బౌళి ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదని, ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

ఘనంగా సైక్లింగ్ పోటీలు షురూ



సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ పార్థసారథి

లింగాలఘణపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీసులు మంగళవారం జనగామ జిల్లా లింగాలఘణపూరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జనగామ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 9వ అంతర్ జిల్లా రోడ్ సైక్లింగ్ చాంపియన్ షిప్-2024 పోటీలను జనగామ ఏసీపీ పార్థసారథి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన 382 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ఇప్పటికే క్రీడాకారులు లింగాలఘణపురం చేరుకున్నారు.

ముఖ్యఅతిథి ఏసీపీ మాట్లాడుతూ.. సైక్లింగ్ పోటీలు క్రీడాకారుల్లో మానసికోల్లాసంతోపాటుగా శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు గ్రామీణప్రాంత క్రీడాకారుల్లో ఆసక్తి పెరగడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలో క్రీడాకారుల మధ్య స్నేహసంబంధాలను మెరుగుపరుస్తాయన్నారు. అంతర్ జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలకు జనగామ జిల్లాలోని లింగాలఘణపురం మండలం వేదిక కావడం గర్వకారణమన్నారు. అంతర్‌జిల్లా స్థాయి పోటీలు జనగామ జిల్లా ప్రాంత యువతకు ఎంతగానో ఉపకరిస్తుందని సూచించారు. తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్, ఉమ్మడి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కృషి అభినందనీయమన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఏసీపీ ఆకాంక్షించారు.

తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కాంత్‌రావు మాట్లాడుతూ.. సైక్లింగ్ పోటీలను గ్రామీణ ప్రాంతాల్లో జనగామ జిల్లాలో నిర్వహించడం మొదటిసారి అన్నారు. సైక్లింగ్ పోటీల పట్ల గ్రామీణ ప్రాంత క్రీడాకారులు దృష్టిసారించి తమలో అంతర్లీనంగా ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని సూచించారు. కార్యక్రమంలో లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్, జనగామ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఐత కిషన్‌తో పాటుగా ఫిజికల్ డైరెక్టర్లు రవి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీలో ఖమ్మం టీమ్ ప్రతిభ



విజేతగా నిలిచిన ఖమ్మం జిల్లా జట్టు సభ్యులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్డిపురంలోని టీవీపీఎస్, మొగిచర్లలోని క్రికెట్ క్రీడామైదానాల్లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్-23బాలుర క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. మంగళవారం మొగిలిచర్ల క్రికెట్ మైదానంలో ఆదిలాబాద్ వర్సెస్ ఖమ్మం జట్ల మధ్య జరిగిన లీగ్ పోరులో ఖమ్మం జట్టు రెండోసారి విజయం సాధించి ముందంజలో దూసుకుపోతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం జట్టు నిర్ణీత 50 ఓవర్లకుగాను 47ఓవర్లను ఎదుర్కొని 227భారీ పరుగులు సాధించగా ఖమ్మం జట్టులోని బ్యాట్స్‌మెన్ డివిన్ రెండో రోజు సైతం అర్ధ సెంచరీ చేయగా నారాయణతేజ 44పరుగులతో రాణించాడు. 228 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆదిలాబాద్ జట్టులోని బ్యాట్స్‌మన్ జీఎస్‌కే రెడ్డి ఒక్కడే 92 పరుగులతో ఒంటరి పోరాటం చేసినప్పటికీ 42.3 ఓవర్లకే 183పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. దీంతో ఖమ్మం జట్టు 44పరుగుల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై విజయం సాధించడంతో వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. పూల్‌బీలోని వరంగల్, మహబూబ్‌నగర్ జట్ల మధ్య జరిగిన లీగ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50ఓవర్లకు గాను 22.3 ఓవర్లలోనే కేవలం 81స్వల్ప పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. 82 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వరంగల్ జట్టు కేవలం 26.3 ఓవర్లలోనే 72 పరుగులతో ఆలౌట్ కావడంతో 9పరుగుల తేడాతో మహబూబ్‌నగర్ జట్టు వరంగల్ జట్టుపై విజయకేతనం ఎగురవేసింది. విజేతలుగా నిలిచిన జట్లను నిర్వాహకులు అభినందించారు.

ఇండియా జట్టు కెప్టెన్ ప్రశాంత్‌కు ప్రశంస



ప్రశాంత్‌ను అభినందిస్తున్న చైతన్య విశ్వ విద్యాలయ వీసీ డాక్టర్ వి.పురుషోత్తంరెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 2నుంచి 5వరకు కంబోడియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ పారా త్రోబాల్ క్రీడల్లో పాల్గొనే ఇండియా జట్టు కెప్టెన్‌గా గాడిపల్లి ప్రశాంత్ ఎంపికైనట్లు చైతన్య విశ్వ విద్యాలయ చాన్స్‌లర్ సీహెచ్.వి. పురుషోత్తంరెడ్డి తెలిపారు. హనుమకొండ నయీంనగర్‌లోని చైతన్య డీమ్డ్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చదువుతున్న ప్రశాంత్‌ను మంగళవారం చాన్స్‌లర్‌తో పాటు ప్రొఫెసర్లు సన్మానించారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. జార్ఖండ్ రాష్ట్రంలో గత నెల 21నుంచి 23వరకు నిర్వహించిన జాతీయస్థాయి పారా త్రోబాల్ క్రీడలో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించడమే కాకుండా అత్యుత్తమ ప్రతిభ చూపి ఇండియా జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన ప్రశాంత్ దివ్యాంగ క్రీడాకారుడిగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ మొక్కవోని దీక్షతో ఈ స్థాయికి చేరుకోవడం సంతోషకరమన్నారు. భారత్ తరుపున అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించి విశ్వ విద్యాలయానికి, రాష్ట్రానికి మరింత గౌరవం తీసుకురావాలని ప్రశాంత్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు గర్రపు దామోదర్, అనురాధ, ఓఎస్‌డీ వీర వెంకటయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదే రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణనలో బీసీలంతా పాల్గొనాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్



వడ్డెపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 6 నుంచి 21 వరకు నిర్వహిస్తున్న సమగ్ర కుల గణనలో బీసీలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లపై ప్రత్యేక కమిషన్‌ను నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీసీల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు తమ కులం, ఉప కులం వివరాలను కచ్చితంగా తెలియజేయాలని కోరారు. కుల గణన సర్వే పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, రాష్ట్ర, జిల్లా నాయకులు దాడి మల్లయ్య, బచ్చు ఆనందం, బీమగాని యాదగిరిగౌడ్, తాళ్ల సంపత్‌కుమార్, మాదం పద్మజాదేవి, మాడిశెట్టి అరుంధతి, కాసగాని అశోక్‌గౌడ్, పంజాల మధు, దాడి రమేష్, కాశెట్టి రాజేష్, గూడూరు బాలాజీ పాల్గొన్నారు.

సర్వేలో ఆరె అని రాయించండి..

కుల గణన సర్వేలో ఆరె కులస్తులంతా ఆరె అని రాయించాలని తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం హనుమకొండ ఇందిరా నగర్‌లోని తన నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరె సంఘం ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ కులగణన ఈ నెల 6 నుంచి 21 వరకు జరుగుతుందని, ఆరె కులస్తులంతా తమ కులాన్ని సర్వే అధికారులకు చెప్పి ఆరె అని రాయించుకోవాలని కోరారు. సమావేశంలో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు మోర్తాల చందర్‌రావు, నాగుర్ల శంకర్‌రావు, వలిగె సాంబారావు, గుండెకారి రంగారావు, జగన్మోహన్‌రావు, సుధాకర్, చిరంజీవి పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 7న (గురువారం) జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మాళవిక డెవలపర్స్‌లో ఖాళీగా ఉన్న 50 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య గల టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు గురువారం ములుగురోడ్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉదయం11 గంటలకు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 7893394393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



అంతర్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన జిల్లా స్విమ్మర్లతో నిర్వాహకులు

స్విమ్మింగ్ పోటీల్లో వరంగల్ తృతీయ స్థానం

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ)ఆధ్వర్యంలో ఈనెల 1నుంచి 3వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సరూర్‌నగర్‌లో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో వరంగల్ జిల్లాకు చెందిన స్విమ్మర్లు సత్తాచాటి ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా తృతీయ స్థానంలో నిలిచారు. అంతర్ జిల్లాల అండర్-19 బాలబాలికల విభాగంలో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో వివిధ విభాగాల్లో జిల్లా స్విమ్మర్లు పలు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను కొల్లగొట్టారు. స్నేవిల్సా (స్వర్ణం, రజతం, కాంస్య), ఆర్య చంద్రాకర్‌రావు (కాంస్య), రాజేష్ (కాంస్యం) పతకాలతో రాణించారు. ఈ మేరకు ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానంలో నిలిచిన జిల్లా స్విమ్మర్లను హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో అశోక్‌కుమార్, డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ రాయబారపు నవీన్, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం కాలయాపన



ధర్నాలో మాట్లాడుతున్న పులి సరోత్తంరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ సెల్ ఛైర్మన్ పులి సరోత్తం రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద ఉపాధ్యాయ, విద్యారంగం సమస్యల పరిష్కారం కోసం వరంగల్, హనుమకొండ జిల్లాల టీపీయూఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సరోత్తమం రెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు, డీఏలు, పీఆర్సీలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతో పోరాడుతున్న టీపీయూఎస్‌కు తన పూర్తి మద్దతు ఎప్పుడు ఉంటుందన్నారు. అనంతరం టీపీయూఎస్ హనుమకొండ జిల్లాల అధ్యక్షులు బత్తిని వెంటకరమణ గౌడ్, వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పుల సతీష్ మాట్లాడుతూ.. నవంబరు 23న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహిస్తున్న ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షలు సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కాగా ఈ ధర్నారకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వీరస్వామి, మునుకుంట్ల, శ్రీనివాస్, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తిని కులంగా మార్చేందుకు సర్కారు కుట్ర

- విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

వడ్డెపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుల గణన పేరుతో వృత్తిని కులంగా మార్చేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి దుయ్యబట్టారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ సమ్మయ్యనగర్‌లో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఈ నెల 6 నుంచి తలపెట్టిన కుల గణన సర్వేలో విశ్వబ్రాహ్మణ, విశ్వ కర్మలను ఒకే కులస్తులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గెజిట్‌లో విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ)లను కులంగా మాత్రమే పేర్కొంటూ బీసీ - బీలో చేర్చారని అన్నారు. కులగణన సర్వేలో కమ్మరి, వడ్రంగి, స్వర్ణకార, ఇత్తడి, శిల్పి వృత్తులను సంప్రదాయ వృత్తులుగా చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని ఎర్రోజు భిక్షపతి హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రోజు మణింద్రనాథ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కురిమిళ్ల రమేష్, కార్పెంటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలోజీ భద్రయ్య, జిల్లా నాయకులు జక్కన్నచారి, చెట్లపల్లి బ్రహ్మచారి, బాలోజీ సాంబయ్య, ఏటూరి పరమేశ్వర్, బాలోజీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద ఆర్యవైశ్యుల వివాహాలకు చేయూత

- పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా ప్రకాష్‌రావు



మంగళ సూత్రాలు, మట్టెలు, నగదు అందజేస్తున్న గుండా ప్రకాష్‌రావు

మట్టెవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నిరుపేద ఆర్యవైశ్యుల కుమార్తెల వివాహాలకు కల్యాణమస్తు పథకం ద్వారా చేయూత అందిస్తున్నామని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా ప్రకాష్‌రావు అన్నారు. వరంగల్ చౌరస్తాలోని వైశ్య భవన్ కాంప్లెక్స్‌లో మంగళవారం కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన తోట లక్ష్మి-రాజుల కుమార్తె తోట చందన వివాహం సందర్భంగా మంగళసూత్రాలు, మట్టెలు, రూ.2,516నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో అజయ్‌కుమార్, రమాదేవి, లావణ్య, పూజ, ప్రియాంక, మౌనిక, మంజుల, రమ తదితరులు పాల్గొన్నారు.



ఉర్సు నాగమయ్య గుడిలోని పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



మెట్టుగుట్టపై పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



శాలినినగర్ పంచముఖ నాగవీరేశ్వరాలయంలో..

వైభవంగా నాగుల చవితి

ఉర్సు నాగమయ్య గుడిలో బారులు తీరిన భక్తులు ● పాలు పోసి మొక్కులు చెల్లించుకున్న మహిళలు

శంభునిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి)కార్తీక మాసం నాగుల చవితి సందర్భంగా నగరంలోని 41వ డివిజన్ ఉర్సు నాగమయ్య ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన పూజారులు జాగర్లపూడి శ్రీరామశర్మ, హరీష్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచే అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అంతకు ముందే ఆలయంలోని వల్లీసమేత సుబ్రహ్మణ్యేశ్వర నాగేశ్వర స్వామిలను అలంకరించారు. నాగేంద్రుడిని దర్శించుకోవటానికి తెల్లవారు జామున 3 గంటల నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. పుట్టలో పాలు పోసి చల్లగా కాపాడాలంటూ వేడుకున్నారు. ఈ వేడుకల్లో ఈవో ప్రసాద్, ఆలయ ఫౌండర్ ట్రస్టు ఛైర్మన్ తోట నర్సయ్యలింగం, కార్పొరేటర్‌లు పోశాల పద్మస్వామి, గుండు చందనపూర్ణచందర్, చాడా స్వాతిరెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు కర్నె రవీందర్, నాగమయ్య కుటీరం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇబ్బందులు పడ్డ భక్తులు..

నాగుల చవితి సందర్భంగా నాగేశ్వరాలయానికి ఉయదం నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దర్శనం కోసం ఐదారు గంటలు క్యూలైన్‌లలో నిలుచున్నారు. వారికి సౌకర్యాలు కల్పించడంలో దేవాదాయ శాఖ సిబ్బంది విఫలమయ్యారని పలువురు ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలోనే అత్యంత వైభవంగా నాగుల చవితి వేడుకలు జరిగే ఆలయంలో ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు సైతం నిర్లక్ష్యం చేశారని అసహనం వ్యక్తం చేశారు. అలాగే రంగశాయిపేట మహంకాళీ ఆలయంలో నాగుల చవితి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగేశ్వరస్వామిని పాలతో అభిషేకించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: మండల కేంద్రంలోని నాగమయ్య ఆలయంలో మంగళవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ఛైర్మన్ వీసం పాపిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నాగదేవతకు అభిషేకం చేశారు. నాగుల చవితి వేడుకల సందర్భంగా బొత్తలకుంట నాగమయ్య ఆలయానికి భక్తుల తాకిడి పెరగడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పుట్టకు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, ఆత్మ మాజీ ఛైర్మన్ కందుకూరి చంద్రమోహన్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● మడికొండ: మడికొండలోని మెట్టుగుట్టపై మంగళవారం నాగుల చవితిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సన్నిధిలో గల పుట్ట వద్ద మహిళలు కొబ్బరి కాయలు కొట్టి పసుపు, కుంకుమలు దూప దీప నైవేద్యాలతో పూజ చేశారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పుట్టలో పాలు పోశారు. అలాగే మెట్టురామలింగేశ్వర స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, సీతారామచంద్రస్వామి వారికి విశేష అర్చనలు చేశారు, సాయంత్రం ఆకాశ దీపం వెలిగించారు. దేవస్థాన ఈవో శేష భారతి, ఛైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని జవహర్‌కాలనీలో గల నాగమయ్య గుడిలో నాగుల చవితి వేడుకలను జవహర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బైరి సోమయ్య, ప్రధాన కార్యదర్శి యతిరాజుల సునిల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి నాగమయ్య గుడి వద్ద గల పుట్టలో పాలు పోసి నాగేంద్రుడిని భక్తి ప్రపత్తులతో కొలిచారు. కార్యక్రమంలో జవహర్ కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతిని ధులు బండి హరీష్ ముదిరాజ్, అమర్‌నాథ్, మట్టపల్లి రణధీర్, పులి రాజేష్, మట్టపల్లి సాంబయ్య, సత్తయ్య ఐలయ్య, సునిత, రమ తదితరులు నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

● ఖిలావరంగల్ : కార్తీకమాసం, నాగుల చవితి సందర్భంగా వరంగల్ నగరంలోని నాగేం ద్రస్వామి దేవాలయాలలో మంగళవారం మహిళలు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. 18వ డివిజన్ శాలినినగర్‌లోని పంచముఖ నాగవీరేంద్రస్వామి దేవాలయంలో అర్చకుడు శివశ్రీ భోగేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు చేశారు. 37,38 డివిజన్ పడమర, తూర్పు కోటలోని మాలఅగర్తల, నాగేంద్రస్వామి దేవాలయాలలో పూజలు చేశారు. 34వ, డివిజన్ శివనగర్‌లోని శ్రీ సీతారామాలయంలో మొక్కులు చెల్లించారు.

బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలి

- ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్



ఖిలావరంగల్ శాఖను ప్రారంభిస్తున్న సీజీఎం రాజేష్‌కుమార్

ఖిలావరంగల్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఖమ్మంరోడ్ వద్ద ఖిలావరంగల్ ఎస్‌బీఐ బ్రాంచిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ శాఖలో అన్ని రకాల రుణాలను అందిస్తున్నామని, డిజిటల్ బ్యాంకింగ్ వివరాలు ప్లాట్‌ఫామ్(యోనో), తదితర బ్యాంకింగ్ ఉత్పత్తుల సేవలను అందిస్తున్నామని అన్నారు.

ఆర్థిక మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే సైబర్‌క్రైమ్ హెల్ప్ లైన్ 1930 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం-2 ప్రకాశ్ చంద్ర బరోర్, జీఎంసీఏవో సంజయ్ కుమార్, డీజీఎంసీఎస్ అండ్ ఆప్స్ సునిల్‌కుమార్‌గోయల్, డీజీఎంబీ అండ్ ఓ ఘనశ్యామ్ సోలంకీ, ఆర్ఎం వరంగల్ విష్ణువ ర్ధన్, 38వ, డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, అబ్దుల్ రహీమ్‌షేక్, శంకర్, ఆంజనేయప్రసాద్, వై.ప్రవీణ్, సంతోష్‌కుమార్, జన్ను మహేందర్, పి.రామన్న, ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర పురోగతిలో ఎస్‌బీఐ మమేకం

గిర్మాజిపేట: భారతీయ స్టేట్ బ్యాంక్ తన సేవల ద్వారా రాష్ట్ర అభివృద్ధిలో మమేకమై ఉందని హైదరాబాద్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ అన్నారు. వివిధ వర్గాల అవసరాలు, ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా భారతీయ స్టేట్ బ్యాంక్ నూతన శాఖలను ప్రారంభిస్తున్నదని తెలిపారు. మంగళవారం వరంగల్ నగరంలోని జేపీఎన్ రోడ్డులో ఉన్న భారతీయ స్టేట్ బ్యాంక్ పరిపాలనా కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. ముద్ర రుణాలు, విశ్వకర్మ రుణాలను తమ బ్యాంకు ఇస్తున్నదని వివరించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వ్యవసాయ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు. బ్యాంకింగ్ సేవలతో పాటు సామాజిక కార్యకలాపాల్లోనూ ఎస్‌బీఐ ముందుంటుందని అన్నారు.

ఇటీవల వైద్య సీటు పొందిన విద్యార్థినికి ఆర్థిక సహాయం చేశామని గుర్తు చేశారు. జిల్లా ప్రజలు తమ సేవలకు సహకరిం చాలని కోరారు. ఈ సమావేశంలో ప్రకాశ చంద్రబరోర్ (జనరల్ మేనేజర్-2), సంజయ్ కుమార్ జా (డీజీఎం) తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత

వరంగల్ మెడికల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ హనుమకొండ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద వివిధ క్యాడర్లలో భర్తీకి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ 4, స్టాఫ్ నర్సులు 15, టీబీ వైద్య అధికారి 1, ల్యాబ్ టెక్నిషియన్ 5, పీపీఎం కో ఆర్డినేటర్ 1, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ 1, ఫార్మసిస్టు 1 పోస్టులను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీలత, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌతమ్ చౌహాన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి రాజేష్ కుమార్, సూపరింటెండెంట్ వేణు, సీనియర్ అసిస్టెంట్లు ఫాతిమా, మల్లారెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై రైతులకు శిక్షణ

వరంగల్ వ్యవసాయం, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మంగళవారం ఇన్‌చార్జి శాస్త్రవేత్త ఎం.మంధు అధ్యక్షతన కంది పంటలో డ్రోన్ వినియోగంపై రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూలీల కొరత ఉన్న నేపథ్యంలో కంది పంటలో చీడపీడల నివారణ కోసం డ్రోన్ సహాయంతో రసాయన మందులు ఎలా పిచికారీ చేయాలో ప్రత్యక్షంగా రైతులకు చూపించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఆర్ ఉమారెడ్డి మాట్లాడుతూ.. కందిలో సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చన్నారు. కంది పంటలో డ్రోన్‌ను వినియోగించి పురుగుమందులను సులభంగా వినియోగించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అపరాల విభాగం శాస్త్రవేత్త ఎస్.సంధ్యాకిషోర్, ఎస్.ఓంప్రకాష్, జి.పద్మజ, డి.వీరన్న ఉమ్మడి జిల్లాకు చెందిన 60 మంది రైతులు పాల్గొన్నారు.

'యోగా క్రీడాకారుల ప్రతిభను గుర్తిస్తాం'

శంభునిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగా క్రీడాకారుల ప్రతిభను గుర్తిస్తామని వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు శేర్ల అనిల్‌కుమార్ అన్నారు. నగరంలోని రంగశాయిపేటలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ గురువారం రంగశాయిపేట లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి ఈ నెల 9, 10 తేదీలలో హైదరాబాద్‌లో జరుగనున్న 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీలు బాలబాలికల జూనియర్, సబ్‌జూనియర్ స్థాయిల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని యోగా క్రీడాకారులు అసోసియేషన్ బాధ్యులను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9912355708, 939010112 నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా అసోసియేషన్ కార్యదర్శి చిట్యాల సోమరాజ్, కోశాధికారి వొగిళిశెట్టి యుగేందర్, ఆల్ ఇండియా జూడో ఫెడరేషన్ కోశాధికారి బైరబోయిన కైలాష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'కత్తెర పురుగు ఉధృతిని నివారించాలి'

శంభునిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటలో పెరుగుతున్న కత్తెర పురుగు ఉధృతిని నివారించాలని కేవీకే సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రాజు రైతులకు సూచించారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం మంగళవారం కేవీకే దత్తత గ్రామాలైన తిమ్మాపూర్, అల్లీపూర్ గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును గుర్తించారు. పురుగు నివారణ కోసం రైతులు ఎకరానికి 5 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని సూచించారు. పంట తొలి దశలోనే పురుగు గుడ్ల సముదాయాన్ని ఏరి నాశనం చేయాలన్నారు. అలాగే వేప నూనె పిచికారి చేయాలని, పురుగు ఉధృతి ఎక్కువ అయితే ఏమమెక్టిన్ బాంజోయేట్, స్పినోటారమ్, రసాయనాలను తగిన మోతాదుల్లో పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

వరంగల్ చౌరస్తా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారు పైడిపల్లి నుంచి మునియాల భరత్, ఈసంపల్లి బాలు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ నెల 3న వారు బైక్‌పై వరంగల్‌కు వస్తుండగా దేశాయిపేట సమీపంలోని సాయిబాబా దేవాలయం వద్ద ఆటో ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాలుకు కుడికాలు విరగడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బంధువులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతెజార్‌గంజ్ సీఐ షుకూర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్సిటీలో నాణ్యమైన పరిశోధనకు పెద్దపీట



జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో నాణ్యమైన పరిశోధనకు పెద్దపీట వేస్తామని కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో హిస్టరీ, టూరిజం విభాగం నేతృత్వంలో వెలువరించిన కాకతీయ జర్నల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ 18వ వాల్యూమ్‌ను వీసీ ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్సిటీలో మంచి అకడమిక్ వాతావరణాన్ని సృష్టిద్దామని పిలుపునిచ్చారు. యూజీసీ కేర్ లిస్టులో కేయూ హిస్టరీ జర్నల్‌కు గుర్తింపు లభించిందని చెప్పారు. అధ్యాపకులకు, పరిశోధకులకు జర్నల్ పరిశోధనపరంగా బాగా ఉపకరిస్తుందని చెప్పారు. వర్సిటీలో మరిన్ని అకడమిక్ యాక్టివిటీస్ జరగాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, రిటైర్డు ప్రొఫెసర్ కె. విజయబాబు, డాక్టర్ ఎం.బ్రహ్మయ్య, డాక్టర్ కేవీఎస్ నరేందర్, డాక్టర్ ఎంకే సుమంత్, డాక్టర్ కె.నాగేశ్వర్‌రావు, డాక్టర్ ఎ. కుమారస్వామి, డాక్టర్ బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నవంబరు 8, 9 తేదీల్లో హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఏబీవీపీ నేతృత్వంలో రెండు రోజుల పాటు నిర్వహించే జోనల్ రీసెర్చ్ స్కాలర్స్ కాంక్లేవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేయూ పరిపాలన భవనం ఎదుట మంగళవారం ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు నేతృత్వంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. 'రీసెర్చ్ ఫర్ ఎ రేడియంట్ భారత్' అనే అనే థీమ్‌తో జరిగే సదస్సులో యూజీసీ ఛైర్మన్, షార్ డైరెక్టర్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై మాట్లాడుతారని రాంబాబు చెప్పారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నవంబరు 7వ తేదీ రాత్రి వరకు ఆసక్తి కల్గిన విద్యార్థులందరూ తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. స్కాలర్స్‌కు ఆహార, వసతి సదుపాయాలు కల్పిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ యూనివర్సిటీ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, రాష్ట్ర నాయకులు అంబాల కిరణ్, చట్ల సతీశ్, గట్టు ప్రశాంత్, వంశీ, సాయి, మహేశ్, శ్రీకాంత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదు

ఖిలావరంగల్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ ఓటును ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు ఇ.రవిందర్ సూచించారు. మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖిలావరంగల్ మధ్యకోటలోని ప్రభుత్వ సహాయక ఆర్య బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ విధానంలో కౌన్సె లింగ్, మహిళా ఉపాధ్యాయులకు పెన్షన్, కారుణ్య నియామకాలు, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించడంలో పీఆర్‌టీయూ కీలక పాత్ర పోషించిందన్నారు. పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డికి మొదటిప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కటకం రఘు, అన్న మహేందర్, ఖిలావరంగల్ మండల అధ్యక్షురాలు మేచినేని సరిత, ప్రధాన కార్యదర్శి బి.పూర్ణచందర్, సంగెం మండల అధ్యక్షుడు జి. విజయ్‌కుమార్, ఉడుత రాజేందర్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

వీర జవాన్‌కు ఘనస్వాగతం

మడికొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశం కోసం రెండు దశాబ్దాలకు పైగా సేవ చేసి ఇంటికి చేరుకున్న వీర జవాన్ స్థానికులు ఘనస్వాగతం పలికారు. మడికొండ అంబేద్కర్ కాలనీకి చెందిన కట్ట హరిక్రిష్ణ భారత సైన్యంలో సేవలందించి ఉద్యోగ విరమణ పొందారు. మంగళవారం స్వగ్రామం మడికొండకు చేరుకున్నారు. ఈసందర్భంగా 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి, మెట్టుగుట్ట ఛైర్మన్ పైడిపాల రఘుచందర్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కాంగ్రెస్ నాయకులు హరిక్రిష్ణకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు.



హరికృష్ణకు స్వాగతం పలుకుతున్న అంబేద్కర్ సంఘం నేతలు



చెన్నూరి ఆంజనేయరెడ్డిని కలిసిన అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు

బౌద్ధ సంస్కృతిని విస్తరించాలి

బుద్ధవనం ప్రాజెక్ట్ మెంటర్, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆంజనేయరెడ్డి

కరీమాబాద్, నవంబరు5, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బౌద్ధ సంస్కృతిని విస్తరించాలని బుద్ధవనం ప్రాజెక్ట్ మెంటర్, విశ్రాంత ఐపీఎస్ అధికారి చెన్నూరి ఆంజనేయరెడ్డి అన్నారు. మంగళవారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరాల సందీప్, రాష్ట్ర అధ్యక్షుడు కడారం వినయ్, జట్టి విక్రమ్‌రాజ్‌పాల్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం అంతటా బౌద్ధ విగ్రహాలు ఏర్పాటు చేసి, బౌద్ధ సంస్కృతిని విస్తరింపచేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి బౌద్ధ సంస్కృతిని పెంపొందించే దిశగా కృషి చేస్తానని అన్నారు. ఇందుకు యువకులు స్వచ్ఛందంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం నాయకులకు పుస్తకాన్ని బహూకరించారు.

భద్రకాళి ప్రసాదం భేష్

ధ్రువీకరించిన భారత ప్రభుత్వ ఆహార పరిరక్షణ సంస్థ



హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న ఈవో శేష భారతి

వరంగల్ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని చారిత్రక భద్రకాళి దేవాలయంలో భక్తులకు అందించే ప్రసాదాల తయారీ, నాణ్యత, ముడి సరుకులను పరిశీలించిన భారత ప్రభుత్వ ఆహార పరిరక్షణ ప్రమాణాల అధికారిక సంస్థ సర్టిఫికెట్‌ను జారీ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ హెల్త్ సంస్థలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శేష భారతి సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

'జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ తప్పనిసరి'

వరంగల్ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ జర్నలిస్టు తప్పనిసరిగా ఇన్సూరెన్స్‌ను చేయించుకోవాలని వరంగల్ జర్నలిస్టు పరపతి సంఘం అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్ అన్నారు. మంగళవారం వరంగల్ జర్నలిస్టు పరపతి సంఘం కార్యాలయంలో సంఘం ప్రధాన కార్యదర్శి బండి రవి అధ్యక్షతన సంఘం సభ్యులకు పోస్టల్ ఇన్సూరెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. జర్నలిస్టు పరపతి సంఘం సభ్యులందరికీ రూ.750తో ఏడాది కాలానికి రూ.15 లక్షల విలువైన పోస్టల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి వడిచర్ల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'పెన్షనర్లకు నగదురహిత చికిత్స అందించాలి'

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈహెచ్‌ఎస్ హెల్త్‌కార్డులపై పెన్షనర్లకు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో గరిష్ట పరిమితి లేని నగదురహిత చికిత్స అందించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సముద్రాల లక్ష్మినారాయణ అన్నారు. మంగళవారం వరంగల్ బల్దియా కార్యాలయంలోని ఆవరణలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యలపై ఈ నెల 19న వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని, ఈ కార్యక్రమానికి పెన్షనర్లు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కూరపాటి యాదగిరి, నాయకులు రాయిశెట్టి విద్యాసాగర్, ఎమ్డీ ఇమామ్, మంత్రి ఈశ్వర్, ఇజ్జగిరి మల్లయ్య, బి.ప్రభాకర్, సుధాకర్, జె.కనుకయ్య, కె.కళ, జవ్వాజి శారద పాల్గొన్నారు.

'మానవ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలి'

పోచమ్మమైదాన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని (ఏహెచ్‌టీయూ) ఇన్‌స్పెక్టర్ పి.వెంకన్న అన్నారు. వరంగల్ నగరంలోని నాగార్జున పాఠశాలలో మంగళవారం మానవ అక్రమ రవాణా విభాగం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, చైల్డ్ లేబర్, సైబర్ క్రైం తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యుడు డాక్టర్ ఆకులపల్లి మధు, శిరీష, రాజేష్, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువ

సంగీతం.. సాహిత్యం..

» సంగీత దర్శకుడిగా ట్రెండింగ్‌లో కార్తీక్ » గేయ రచయితగా దూసుకుపోతున్న పూర్ణాచారి
» పల్లె జీవనం, జానపదాలే వారికి ప్రేరణ » వీరిద్దరిదీ ములుగు జిల్లాయే..


సినీ గేయ రచయిత పరిపూర్ణాచారి


సంగీత దర్శకుడు కార్తీక్

ములుగు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒకరికి సంగీతమంటే ప్రాణం.. మరొకరికి సాహిత్యమే ఊపిరి.. అందమైన పదాలను కూర్చగా అల్లడంలో ఒకరు దిట్టయితే.. ఆపదాలకు వినసొంపైన బాణీలు సమకూర్చడంలో మరొకరు దిట్ట.. ఒకే పాఠశాలలో విద్యాభ్యాసం.. పక్కపక్క ఊళ్లు.. మధ్యతరగతి కుటుంబాలు.. కష్టజీవుల వెతలు.. రోజూ వినే జానపదాలు.. వీధినాటకాలు.. పల్లె జీవన చిత్రమే ప్రేరణగా ఆ ఇద్దరు తాము ఎంచుకున్న మార్గంలో దూసుకుపోతున్నారు. క్షణక్షణం అప్‌గ్రేడ్ అవుతున్న రంగుల ప్రపంచంలో తమ టాలెంట్‌కు పదును పెట్టుకుంటూ సుస్థిర స్థానం సంపాదించుకునేందుకు కష్టపడుతున్నారు. వారే యువ సంగీత దర్శకుడు కార్తీక్ కొడకండ్ల, సినీ గేయ రచయిత చల్లూరి పరిపూర్ణాచారి.

ములుగు మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన చల్లూరి లక్ష్మి, రాజమౌళి దంపతుల కుమారుడైన పరిపూర్ణాచారి కాకతీయ విశ్వ విద్యాలయంలో బీఫార్మసీ పట్టా పొందారు. జానపద కళాకారులకు పెట్టింది పేరైన బండారుపల్లిలో పండుగలు, ఉత్సవాల సందర్భంగా స్థానిక యువకులు వీధినాటకాలు ప్రదర్శించేవారు. రామప్ప పరివాహకంలో ఏడాది పొడవునా పంటలు సాగవుతుండగా శ్రమను మర్చిపోయేందుకు కూలి తల్లుల నోట నిత్యం ఉయ్యాల పాటలు, జానపదాలు పొలిమేరలను పరవశింపజేస్తూనే ఉంటాయి. వీటి నుంచి ప్రేరణ పొందిన పరిపూర్ణాచారి ద్రౌపది వస్త్రాపహరణం, సింహబలుడు నాటకంలో పాత్రలు పోషించి పద్యాలను గొంతెత్తి పాడేవాడు. కొన్ని సినీ, జానపదాలకు పేరడీలు రాసేవారు. ఉన్నత విద్యను అభ్యసించే క్రమంలో కొన్ని స్టేజీలపై పేరడీ పాటలను పాడిన ఆయన ఆతర్వాత తన సొంత కవిత్వంపై దృష్టి సారించారు. హైదరాబాద్‌కు పయమైన ఆయన 2014లో తొలిసారి తెలుగు సినిమాకు పాట రాసే అవకాశం దక్కించుకొని వెండితెరపై తన పేరును చూసుకొని మురిసిపోయారు. 2016లో వి

పేరడీ నుంచి సింగిల్ కార్డు దాకా..


పరిపూర్ణాచారిని అభినందిస్తున్న బాలకృష్ణ

డు దలైన ప్రేమమ్ సినిమా పాటతో అందరి మన్ననలు అందుకున్న ఆయన ఆ తర్వాత పూర్ణాచారిగా ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటివరకు 160సినిమాలకు 538కిపైగా పాటలు రాశారు. ఇటీవల విడుదలై విమర్శకుల చేత శభాష్ అనిపించుకున్న శివంభజే సినిమాతో పాటు మొత్తం 36సినిమాలకు సింగిల్ కార్డు గేయ రచయితగా మారారు. దాస్ కా దమ్కీ సినిమాలోని ఆల్‌మోస్ట్ పడిపోయానే పిల్లా పాటతోపాటు సవారి సినిమాలోని ఉండిపోవ నువ్విలా.. అంటూ సాగే ఇంకో పాట చారి కలం నుంచి జాలు వారినవే. తాజాగా టాలీవుడ్ ప్రతిష్టాత్మక మిర్చీ మూవీ, సినారే వంశీ ఫిల్మ్ అవార్డులను గెల్చుకున్న పూర్ణాచారి ప్రస్తుతం మ్యాడ్ స్క్వేర్, కోర్టు సినిమాలతోపాటు రవితేజ, బెల్లకొండ శ్రీనివాస్ లాంటి హీరోలు నటిస్తున్న పలు సినిమాలకు పాటలు రాస్తున్నారు.

కంప్యూటర్ వదిలి కీబోర్డు పట్టుకొని..

అందరు యువకుల్లాగే కొడకండ్ల కార్తీక్ ఇంజనీరింగ్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరారు. తల్లి పద్మ అంగన్‌వాడీ టీచర్ కాగా, తండ్రి వెంకటాచలం ప్రైవేటు ఉద్యోగిగా పడి కష్టాన్ని చూసిన కార్తీక్ తాను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ నెలజీతంతో వారికి ఆసరగా నిలిచాడు. కానీ తాను అనుకున్నది కాలేకపోయానన్న వేదన మాత్రం ఆయనలో విగిలేఉంది. ఈ క్రమంలో ఆ తల్లిదండ్రులు తమ కుమారుడి ఆశయానికి అండగా నిలిచారు.. ప్రోత్సహించారు. ఫలితంగా తెలుగు సంగీతంలో తొలి బ్రీత్‌లెస్ సాంగ్‌కు అంకురం పడింది. ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న కలం నుంచి జాలువారిన బంధూక్ సినిమాలోని 'పూసిన పున్నమి వెన్నెల మేన తెలంగాణ వీణ'.. పాటకు బాణీలు సమకూర్చింది మన కార్తీకే. వెంకటాపూర్(రామప్ప) మండలం కేశవాపూర్‌కు చెందిన కార్తీక్ ఎంటెక్ పూర్తిచేసి ఇన్ఫోసిస్‌లో మంచి ప్యాకేజీతో ఉద్యోగంలో చేరాడు. మ్యూజిక్‌పై మక్కువతో కొన్నేళ్లకే ఉద్యోగాన్ని వదిలిపెట్టాడు. శాస్త్రీయ సంగీతంలో మెళకువలు నేర్చుకున్నాడు. 2015లో సినీ రంగంలోకి ప్రవేశించిన ఆయన ఇప్పటివరకు 15సినిమాలకు సంగీతం అందించారు. చిత్రీకరణ జరుపుకొంటున్న డొక్కా సీతమ్మ బయోపిక్‌తో పాటు ఉద్వేగం లాంటి రాబోయే పలు సినిమాలకు బాణీలు సమకూర్చుతున్నారు.


దర్శక దిగ్గజం రాఘవేందర్‌రావుతో కార్తీక్

మెగాస్టార్ చిరంజీవి పద్మభూషణ్ అవార్డు పొందిన సందర్భంగా శిల్పకళావేదికలో 15మంది తెలుగు గాయకులతో సంగీత విభావరి నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. 2016, 2019, 2023లో ఆయన సంగీతం సమకూర్చిన బతుకమ్మ పాటలు ఇప్పటికీ యూట్యూబ్, ఇన్‌స్టాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు కూడా కార్తీక్ సంగీతం అందించారు. ఇటీవల ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రచార పాటలకు కూడా ఆయన మ్యూజిక్ ఇచ్చి చంద్రబాబు నాయుడు నుంచి ప్రశంసలు అనిపించుకున్నారు. జెట్టి సినిమాలోని దూరం కరిగినా..మౌనం కరుగునా.. పాట కార్తీక్‌కు మంచిపేరు తెచ్చింది.

వరంగల్‌కు చెందిన సినీ దర్శకుడు తరుణ్‌భాస్కర్‌తో కలిసి అనుకోకుండా.. అనే ఓషార్ట్ ఫిల్మ్‌ను కూడా తీశారు. ప్రముఖ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, కేఎస్.చిత్ర, సుశీల, బాంబే జయశ్రీతోపాటు పలువురు తెలుగు వర్ధమాన గాయకులతో కలిసి పనిచేశారు.

హైదరాబాద్‌లో సొంతంగా కేకే స్టూడియోను నడుపుతున్న ఆయన 600కు పైగా పాటలకు బాణీలు అందించారు. తానా, నాటా సంస్థల ఆహ్వానం మేరకు అమెరికాకు వెళ్లి అంతర్జాతీయ వేదికలపై మెరిశారు. ఆయన సంగీతం సమకూర్చిన 'సింగారి' అనే పాటల ఆల్బమ్ ఇటలీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైంది.

మా పూజలందుకో నాగన్న..

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

» నాగేంద్రుడికి మహిళల నీరాజనం
» పుట్టల వద్దకు పెద్ద ఎత్తున మహిళలు
» భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


రుద్రేశ్వరుడి ఆలయంలో సీపీ దంపతులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాస వేళ మంగళవారం భక్తిశ్రద్ధలతో నాగుల చవితిని జరుపుకున్నారు. ఉదయం నుంచే మహిళలు నాగేంద్రుడి పుట్టలున్న ప్రాంతాలకు బారులుతీరి పయనమయ్యారు. కార్తీక మాసంలో వచ్చే ఈ నాగుల చవితికి ప్రత్యేక విశిష్టత ఉంది. ఈ మాసంలో కన్యలు స్వామివారిని ప్రార్థించి అభిషేకించి మొక్కులు చెల్లిస్తే కల్యాణం జరుగుతుందని, సంతానం లేని వారు నాగేంద్రస్వామి ఆలయంలో చెట్టుకు ఉయ్యాల కడితే సంతానం కలిగి ఇంట్లో తొట్టె ఊగుతుందని భక్తుల విశ్వాసం. అంతేగాకుండా స్వామి వారికి క్షీరాభిషేకం చేసి గోత్రనామాలతో అర్చన చేయిస్తే సర్పదోషం తొలిగిపోతుందని నమ్ముతారు.

రుద్రేశ్వరాలయంలో..

హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరుడికి ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, నవరసాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున ఉన్న పుట్టల వద్దకు తెల్లవారుజామునుంచే మహిళలు బారులు తీరి నాగేంద్రుడికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో రుద్రేశ్వరుడిని దర్శించుకొని అక్కడ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయమే సీపీ అంబర్ కిశోర్ ఝా దంపతులు ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.

హనుమకొండలో..


రుద్రేశ్వర ఆలయంలో నాగేంద్రుడికి పూజలు చేస్తున్న భక్తులు

హనుమకొండ బ్రాహ్మణవాడలోని నాగుల వీధిలో మహిళలు తరలి నాగేంద్రుడిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీరామోజు సోమేశ్వర్‌రావు, చీకటి రాజు, చందుపట్ల ధన్‌రాజ్ తదితరులు భక్తులకు సహకరించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్‌లోని పుట్టల వద్దకు, ఎక్సైజ్ కాలనీ లోని శ్రీవేంకటేశ్వరాలయం, రెవెన్యూ కాలనీలోని శ్రీరామాలయం, తదితర ప్రాంతాల్లోనూ ఉన్న పుట్టల వద్దకు మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకొని నాగేంద్రుడికి మొక్కులు చెల్లించుకున్నారు.

నగరంలో ఎక్కడ చూసినా మహిళలు కోలాహలంగా పుట్టల వద్దకు చేరుకునే విషయాలు ఆవిష్కృతమయ్యాయి. నాగేంద్రుడి పుట్టల వద్ద నున్న మట్టిని బంగారంగా కొలుస్తూ భక్తిశ్రద్ధలతో వేడు కలను నిర్వహించారు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. నర్సంపేటలోని శివాలయంలో, వర్ధన్నపేటలోని రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో, గీసుగొండ మండలంలోని ఊకల్ గ్రామంలో శ్రీబాలనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో వేడుకలు వైభవంగా జరిపించారు. వరంగల్ నగరంలోని ఉర్సు శంభునిపేట ప్రాంతంలో గల ప్రసిద్ధ నాగమయ్య దేవాలయం, ఎల్లంబజార్‌లోని శ్రీనాగేంద్రస్వామి దేవాలయం, శ్రీభద్రకాళి దేవాలయం, ఓసిటీలోని ఆంజనేయస్వామి దేవాలయం, కాశిబుగ్గలోని శివాలయం, వెంకట్రామ జంక్షన్‌లోని శ్రీకనకదుర్గా దేవాలయం, బట్టల బజార్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం, రంగంపేటలోని భవాని శంకర ఆలయం, కుంటిభద్రయ్య గుడి, మల్లికార్జున స్వామి ఆలయం, జేపీఎన్‌రోడ్డు శ్రీదాసాంజనేయ స్వామి దేవాలయంలోని నాగేంద్రస్వాములకు ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. పుట్టలో పాలు పోసి పసుపు కుంకుమలను చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయాల్లో దీపాలు వెలిగించి ఆకాశ దీపాన్ని దర్శించుకొని ఉపవాస దీక్ష విరమించారు.

ఉపాయం చేశారు.. ఉపాధి పొందుతున్నారు

» ప్లాస్టిక్ మోకులతో నెలకు రూ.50 వేల సంపాదన
» తెలుగు రాష్ట్రాల్లో అబ్బయ్య 'గీత మోకుల'కు ప్రత్యేక గుర్తింపు

స్వయంకృషి


మోకుల తయారికి ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ పొట్టెలను చూపుతున్న అబ్బయ్య


ప్లాస్టిక్ మోకుల తయారీకి పొట్టెలను పురిపెడుతున్న అబ్బయ్య దంపతులు

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికంగా ఎన్నో మార్పులు, ఆవిష్కరణలు జరుగుతున్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా అనేక యంత్రాలు వస్తున్నాయి. కానీ గీత కార్మికులకు అవసరమైన యంత్రాలు మాత్రం రాలేదు. వారు నేటికీ సంప్రదాయ విధానాలనే అవలంబిస్తున్నారు. ఈ క్రమంలో గీత కార్మికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వృత్తిని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్ పేరుతో కొన్ని వస్తువులను అందజేసింది. 20 ఏళ్లకంటే ముందు గీతకార్మికులు తాటిచెట్లు ఎక్కడానికి మోకులను సొంతంగా తయారు చేసుకునేవారు. తాటి మట్టకు రెండు వైపుల ఉండే గర్లు, తాటిపొట్టెలను తీసి వాటిని పురిపెట్టి బలమైన తాడును తయారు చేసుకునేవారు. అలా తయారు చేసిన మోకులు ఒకటి, రెండేళ్ల పాటు పనిచేసేవి. ఆ తర్వాత అవి దెబ్బతినేవి. కానీ అది అర్థం కాక చెట్లపైకి ఎక్కిన తరువాత మోకులు తెగి కార్మికులు కింద పడి మృత్యువాత పడేవారు. అలాగే అంగవైకల్యానికి గురి అయ్యేవారు. నాడు ఆపరిస్థితులను చూసిన జనగామ జిల్లా చిలుపూరు మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన గీత కార్మికులు పూజరి రామస్వామి, పూజరి మోగిళి, ఘన్‌పూర్‌కు చెందిన దూసరి అబ్బయ్యతో కలిసి వివిధ షాపుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ తాళ్ల (పొట్టెలు) సేకరించారు. కొన్ని పొట్టెలను చీరి వాటిని కట్టలుగా కట్టి పురిపెడుతూ బలమైన ఎంటును రూపొందించి దాని ద్వారా మోకును తయారుచేశారు. తదనంతరం ఇద్దరు కార్మికులు మోకుల తయారి నుంచి నిష్క్రమించగా నాటి నుంచి నేటి వరకు అబ్బయ్య ప్లాస్టిక్ మోకులను తాయరు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఈ ప్లాస్టిక్ మోకులు ఆరేళ్ల వరకు మన్నికగా ఉంటాయి. సుమారు 25ఏళ్లగా అబ్బయ్య తన భార్య భాగ్యలక్ష్మి, కుమార్తె సుమలత, కోడలు విజయ, మనువళ్లు అరవింద్, సిద్దులతో కలిసి మోకులు తయారు చేస్తున్నారు. వయసు రీత్యా రెండేళ్లుగా గీత వృత్తిని మానుకున్న అబ్బయ్య మోకుల తయారీపైనే దృష్టి పెట్టారు.

పలు జిల్లాల నుంచి కొనుగోలుదారుల రాక

అబ్బయ్య తయారు చేసిన మోకులను కొనుగోలు చేయడానికి గాను రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గీత కార్మికులు వస్తుంటారు. కరీంనగర్, నల్లగొండ. జనగామ, సిద్దిపేట, అదిలాబాద్, ఖమ్మం, మెదక్, మానకొండూరు, సిరిసిల్ల, మహబూబాబాద్, హన్మకొండ, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లో అబ్బయ్య మోకులంటే మంచి గుర్తింపు ఉంది. సగటున ఒక మోకును రూ.800కు విక్రయిస్తుండగా.. అన్ని ఖర్చులుపోను తమకు రూ.600వరకు లాభం ఉంటుందని, రోజుకు గిరాకీ బట్టి 4 నుంచి 5 మోకులు తయారు చేస్తామని అబ్బయ్య చెబుతున్నారు. నెలంతా కష్టపడితే తమకు రూ.50వేల వరకు ఆదాయం ఉంటోందని, ఇదే తమ కుటుంబానికి ఆదాయ వనరుగా మారిందని చెబుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి కార్మికులు వచ్చి మోకులు కొనుగోలు చేయడం సంతృప్తినిస్తోందంటున్నారు.

ప్లాస్టిక్ మోకుతో ధైర్యంగా ఉంది..

పూజరి రాజ్‌మోహన్, గీత కార్మికుడు, చిన్నపెండ్యాల



ప్లాస్టిక్ మోకుతో తాటిచెట్టు ఎక్కడం ధైర్యంగా ఉంటుంది. అబ్బయ్య వద్ద మూడేళ్ల క్రితం ఒక మోకును కొనుగోలు చేశా. ఈ మోకులను పటిష్ఠంగా తయారుచేయడంలో అబ్బయ్య దిట్ట అని, నాలాంటి అనేక మంది కార్మికులకు ఉపయోగపడేలా నైపుణ్యంతో మోకులు తయారు చేస్తున్న అబ్బయ్యను ప్రభుత్వం గుర్తించి తగిన ప్రోత్సాహకం అందించాలి.

నాణ్యతకు మారుపేరుగా మోకుల తయారి

పాలకుర్తి నాగరాజు, గీత కార్మికుడు, తాటికొండ



అబ్బయ్య తయారు చేస్తున్న మోకులు ఎంతో పటిష్ఠంగా, నాణ్యంగా ఉంటాయి, బరువు కూడా తక్కువ ఉండేలా మోకులను తయారు చేయడంలో అబ్బయ్యది అందెవేసిన చేయి. వివిధ ప్రాంతాల్లో యంత్రాలపై మోకులను తయారు చేస్తుంటారు. అవి అంత నాణ్యతగా ఉండవు. కానీ చేతితో చేసే అబ్బయ్య మోకులు బలంగా ఉంటాయి. అందుకే 12 ఏళ్లగా అబ్బయ్య వద్దే మోకులు కొనుగోలు చేస్తున్నా.

సర్వే సరే.. పాఠాలు మరి!

» నెల రోజుల పాటు ప్రాథమిక విద్యకు విఘాతం
» ప్రక్రియ పూర్తయ్యే వరకు ఒంటిపూట బడులు
» ఉపాధ్యాయ వర్గాల నుంచి అభ్యంతరాలు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి కులగణన చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ సర్వేతో రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో సుమారు నెల రోజుల పాటు విద్యాబోధనకు విఘాతం ఏర్ప డుతోంది. దీంతో విద్యార్థులు చదువులో వెనుకబడే ప్రమాదం కనిపిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మూడు వారాల పాటు కుల గణన సర్వేను నిర్వహించనుండటం, అం దుకు ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను నియమించడమే ఇందుకు కారణమవుతోంది. అయితే ఉదయం మాత్రమే పాఠశాలలను నిర్వహించి.. మధ్యాహ్నం నుంచి ఉపాధ్యాయులంతా సర్వేకు వెళ్లాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ నుంచి మొత్తం 6,210 మంది కుల గణన సర్వేలో పాల్గొంటుండగా అందులో సుమారు 6 వేల మంది ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులే ఉండటం గమనార్హం. ఈ క్రమంలో ప్రభుత్వం చెప్పింది ఒకటి, చేస్తుంది ఒకటని ఉపాధ్యాయ వర్గాలు మండిపడుతున్నాయి. పూర్తిగా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులనే కాకుండా ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలలల్లో ఉన్న ఉపాధ్యాయులను కుల గణన సర్వేలో పాల్గొనే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే అరకొర వసతులతో అత్తె సరు విద్య అందుతున్న ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల చదువులకు కుల గణన సర్వే గండి కొడుతుందన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. విద్యా సంవత్సరం మధ్యలో నెల రోజుల పాటు ఒంటి పూట బడులు నిర్వహించడం వల్ల వారి పఠనా సామర్థ్యాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఉపాధ్యాయ వర్గాల అసహనం

కుల గణన విషయంలో ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలపై ఉపాధ్యాయ వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధ్యాయ సంఘాల నేతలతో ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశంలో చర్చకొచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి మిగులు ఉపాధ్యాయులను సర్వేకు తీసుకోవాలని, అలాగే ప్రాథమిక పాఠశాలల నుంచి కూడా సగం మంది ఉపాధ్యాయులను మాత్రమే సర్వేలో వినియోగించుకోవాలని సూచించామని కానీ ప్రభుత్వం కేవలం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మాత్రమే సర్వే చేయాలని ఉత్తర్వులు ఇవ్వడాన్ని తప్పుపడుతున్నారు. అలాగే ఉదయం పాఠశాలల్లో పాఠ్యాంశాలు బోధించి మధ్యాహ్నం సర్వే చేయడంపై ఉపాధ్యాయ వర్గాలు నిరాసక్తత కనబరుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కోసం వివిధ పనుల నిమిత్తం ఉదయమే బయటికి వెళతారని, మధ్యాహ్నం ఇళ్లలో ఎవరూ ఉండరని, అలాంటప్పుడు సర్వే ఎలా చేయాలని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. సెలవు రోజుల్లో సర్వే నిర్వహించేలా చర్యలు చేపట్టి వారికి అదనపు సెలవులు మంజూరు చేస్తే సరిపోతుందని కొంత మంది ఉపాధ్యాయ సంఘాల నేతలు సూచిస్తున్నారు.

జిల్లాల వారీగా సర్వేలో పాల్గొనేవారు

జిల్లా	ఉపాధ్యాయులు/సిబ్బంది
వరంగల్	1269
హనుమకొండ	844
జనగామ	960
మహబూబాబాద్	1710
జయశంకర్ భూపాలపల్లి	784
ములుగు	644

సర్వే వల్ల ఒంటిపూట నడువనున్న బడులు

జిల్లా	ప్రాథమిక పాఠశాలల సంఖ్య
వరంగల్	450
హనుమకొండ	314
జనగామ	348
మహబూబాబాద్	676
జయశంకర్ భూపాలపల్లి	365
ములుగు	372

సర్వేలో ఏం చెప్పాలి ?

నేటినుంచి కుటుంబ వివరాల సమగ్ర సేకరణ

ప్రశ్నలు, సమాధానాలపై ప్రజల్లో అనుమానాలు

ఏ వివరాలు ఇవ్వాలన్నదానిపై చర్చ

వర్ధన్నపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల, తెగలు, వెనుబడిన తరగతులు, ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి కోసం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టింది. గత ప్రభుత్వం 2014 ఆగస్టు 19న ఒక్క రోజులో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కుటుంబ సభ్యులంతా తమతమ ప్రాంతాలకు చేరుకోగా పండుగ వాతావరణం కనిపించింది. ఇక తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే బుధవారం బుధవారం నుంచి 10రోజులపాటు కొనసాగనుండగా.. తొలి మూడు రోజులు స్టిక్కరింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమటరేటర్, 10మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. అయితే ఈ సర్వేలో కుటుంబ సభ్యులందరూ ఉండాల్సి అవసరం లేదు. కుటుంబానికి సంబంధించిన ఎవరో ఒకరు చెబితే చాలు ఎన్యుమరేటర్లు నమోదు చేసుకుంటారు. సర్వే చేసే ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినపుడు ఏమి అడుగుతారో ? ఏమి సమాధానం చెప్పాలి ? ఏయే పత్రాలు దగ్గర పెట్టుకోవాలని ? అందరిలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆస్తులు, అప్పులు చెప్పాలి

గత ఐదేళ్లలో తీసుకున్న రుణాలు, ఎందుకు తీసుకున్నారు. ఎక్కడ నుంచి పొందారు. ఏదైనా వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో పాల్గొంటే ఆ వివరాలు తీసుకుంటారు. పశు సంపద సంఖ్య సేకరిస్తారు. స్థిరాస్థి, చరాస్థితోపాటు నివాస గృహం చదరపు గజాల్లో నివాస గదుల సంఖ్య, తాగునీటి వనరు విద్యుత్ సదుపాయం, మరుగుదొడ్డి, వంటకోసం వినియోగించే ఇందనం లాంటి వివరాలు సేకరిస్తారు.

పాస్‌బుక్ నెంబర్, భూమి వివరాలు చెప్పాల్సిందే..

భూమి వివరాల కోసం ధరణి పట్టాదార్ పాసు పుస్తకం, నెంబర్ భూముల రకం, ఎకరాల సమా చారం చెప్పాల్సి ఉంటుంది. నీటిపారుదల వనరు, కౌలు భూమి సాగుచేస్తే సాగు విస్తీర్ణ వివరాలు నమోదు చేస్తారు.

రాజకీయ నేపథ్యం ఉంటే..

ప్రజా ప్రతినిధిగా సభ్యత్వం కింద ప్రస్తుతం పూర్వం ఏ పదవిలో ఉన్నారు. పదవీకాలం? నామినేటెడ్ వివరాలు నమోదు చేస్తారు. ఈ ప్రశ్నావళి ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన వారికి వర్తిస్తుంది.

రిజర్వేషన్ ఫలాలు పొందితే..

విద్య, ఉద్యోగ పరంగా రిజర్వేషన్ విధానంతో ప్రయోజనం పొందిన, గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన పథకాల వివరాలను సర్వేలో నమోదుచేస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఈడబ్ల్యూఎస్ ధృవపత్రాలు పొందిరా ? డీ నోటిపై చేయబడిన పాక్షి సంచార తెగక సమాచారాన్ని అవును, కాదనే వివరాలను నమోదుచేస్తారు.

ఏమేం తెలుసుకుంటారంటే ?

సాధారణ వివరాల కింద కుటుంబ యజమాని, సభ్యుల పేరు, సంబంధం మతం, సామాజిక వర్గం, మతం, వయసు, ఆధార్‌కార్డు నెంబరు (ఇస్తే ఇవ్వవచ్చు), మొబైల్ నెంబర్, దివ్యాంగులైతే వైకల్యం, వైవాహిత స్థితి గురించి ఆరా తీస్తారు. విద్యా వివరాల కింద పాఠశాల్లో చేరిన నాటి వయసు, ఏ మాధ్యమంలో చదివారు. బడి మానేస్తే. వివరాలు చెప్పాల్సిందే. ఉద్యోగ, ఉపాధి వివరాలకు సంబంధించి ప్రస్తుతం చేసే వృత్తి, ఉద్యోగ సమాచారం, వార్షిక ఆదాయం, ఒక వేళ వ్యాపారులైతే వార్షిక ఆదాయం చెప్పాలి. ప్రధాన కుల వృత్తులైతే. ప్రస్తుతం కొనసాగుతున్నారా? వృత్తి పరంగా వ్యాధి (ఉంటేనే), ఆదాయం పన్ను చెల్లింపుదారుల వివరాలు, బ్యాంకు ఖాతా ఉంది / లేదు. వంటి వివరాలను చెప్పాల్సిందే.


ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ఎన్యుమరేటర్

వలసలకు కారణం..

కుటుంబీకుల్లో ఎవరైనా ఇతర దేశాలు, రాష్ట్రాలకు వలస వెళితే ఆ వివరాలను కూడా నమోదు చేస్తారు. వలస వెళ్లడానికి కారణం కూడా ఆరాతీస్తారు.

ఫొటో తీయరు.. పత్రాలు తీసుకోరు ?

సర్వే సందర్భంగా కుటుంబీకుల ఫొటోలు తీయరు. ఎలాంటి పత్రాలు తీసుకోరు. అందరూ ఉండాల్సిన అవసరంలేదు. కుటుంబ యజమాని ఉండి వివరాలను చెబితే సరిపోతుంది. ఇచ్చిన సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారు.

56 ప్రధాన, 19 అనుబంధ ప్రశ్నలు..

సర్వేను ప్రశ్నావళి రూపంలో నిర్వహిస్తారు. ఇందు కోసం 56 పదాల ప్రశ్నలు, మరో 19 అనుబంధ ప్రశ్నలు కలిపి మొత్తం 75 ప్రశ్నలకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. పార్టు 1, 2, కింద 8 పేజీల్లో సమాచారం పూరిస్తారు. ఇందులో పార్టు -1లో కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తి వివరాల కింద సాధారణ, విద్య ఉద్యోగ, ఉపాధి, భూములు, రిజర్వేషన్ ప్రయోజ నాలు, రాజకీయ, వలసల సమాచారం అడుగుతారు. పార్టు -బీ కింది కుటుంబ వివరాలను సేకరిస్తారు. ఇందులో 17 ప్రశ్నల్లో 7 ప్రధాన, మిగిలిన అనుబంధ ప్రశ్నలు ఉంటాయి.

ఫ్యాషన్



అందంగా.. హుందాగా..

ఈ మధ్యకాలంలో పెళ్లి వేడుకల్లో చీరలతో పాటుగా లెహంగాలు మెరవాల్సిందే! చీరలు సంప్రదాయాలకు ప్రతీక అయితే.. లెహంగాలు ఆధునికతకు చిహ్నాలు. అంతే కాదు. లెహంగాలలో చీరల్లో ఉన్న అందం.. హుందాతనం కూడా ఉంది!

- లెహంగాను ఎంచుకొనేటపుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లెహంగా ధరించినప్పుడు కొందరు సన్నగా కనిపిస్తారు. కొందరు బొద్దుగా కనిపిస్తారు. అందువల్ల శరీరాకృతి ఆధారంగా ఎలాంటి లెహంగా సరిపోతుందనే విషయాన్ని నిర్ణయించుకోవాలి. షిఫాన్, జార్జెట్, క్రేప్, రా సిల్క్ లెహంగాలు ధరించినప్పుడు సన్నగా కనిపిస్తారు. ఆర్గంజా, బ్రోకేడ్ ఫ్యాబ్రిక్‌లను ఎంచుకుంటే బొద్దుగా కనిపిస్తారు.
- నీలం, ఎరుపు, గులాబీ, ఆకుపచ్చ వంటి ముదురు రంగుల లెహంగాలు ఆకర్షణీయంగా ఉంటాయి. వీటికి ఎంబ్రాయిడరీ వర్క్‌లు చేయిస్తే మరింత ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ ఏడాది మస్టర్డ్ ఎల్లో (ఆవ పూల రంగు), ముదురు పింక్, బీజ్ వంటి రంగులు ట్రెండింగ్‌లో ఉన్నాయి.
- లెహంగాపై ధరించే చోళీ సరైన కొలతలతో ఫిట్‌గా ఉండేలా చూసుకోవాలి. చోళీ సరిగా కుదరకపోతే లెహంగా అందం మొత్తం పోతుంది. శరీరాకృతికి తగ్గట్టు హై నెక్ లేదా వీ నెక్ ఎంచుకోవాలి. చోళీకి పొడవైన చేతులు పెట్టించుకున్నా బాగుంటుంది.
- లెహంగాపై దుపట్టా వేసుకునే తీరు కూడా ఆకర్షణీయంగా ఉండేలా చూసుకోవాలి. భుజం మీద ఒక వైపు వేసుకోవటం ఇప్పుడు ఫ్యాషన్.
- లెహంగాకు తగినట్టుగా హెయిర్ స్టయిల్ ఉండాలి. జుట్టును వదిలేస్తే ఒక అందం. చిన్న పోనీటెయిల్స్ కూడా ఈ మధ్యకాలంలో ట్రెండింగ్‌లో ఉన్నాయి.
- హైహీల్స్ వేసుకుంటే మంచిది. దీని వల్ల పొడవుగా కనిపిస్తారు.

ప్యూర్ సిల్క్, రా సిల్క్, బెనారస్ సిల్క్ ఫ్యాబ్రిక్‌లకు మెరిసే పూసలు, జరీ దారాల ఎంబ్రాయిడరీ వర్క్‌ను జోడించి రూపొందిస్తున్న లెహంగాలకు మంచి డిమాండ్ ఉంది. షిఫాన్ లెహంగాలపై ఈ మధ్య కాలంలో జర్దోసీ వర్క్, సీక్వెన్స్ వర్క్ వంటి అదనపు హంగులను చేరుస్తున్నారు.



మేం ఎవరికీ తీసిపోం

ఆమెది పుట్టుకతో వెంట తెచ్చుకున్న అంధత్వం కాదు. బడి ఈడు వరకూ మెరుగ్గా ఉన్న కంటిచూపు క్రమేపీ తగ్గుతూ, అంతిమంగా అంధత్వానికి దారి తీసింది. కానీ ఆ పరిస్థితికి కుంగిపోకుండా గాయనిగా ఎదుగుతూనే, సివిల్ సర్వెంట్‌గా ప్రజలకు సేవలందించాలనే లక్ష్యాన్ని ఏర్పరుచుకుంది హైదరాబాద్‌కు చెందిన 23 ఏళ్ల పొరాల మౌనిక. ఆమె 'నవ్య'తో పంచుకున్న ఆసక్తికరమైన విశేషాలు...



"భగవంతుడు మన దగ్గరి నుంచి దేన్నైనా తీసేస్తే, అంతకు మించిన ఉత్తమమైనదేదో తిరిగిస్తాడని అర్థం. కాబట్టి ఆ బెస్ట్ కోసమే మనం ప్రయత్నించాలి. దాన్నే మన లక్ష్యం చేసుకోవాలి. పుట్టుకతోనే అంధత్వాన్ని వెంటబెట్టుకు రావడం వేరు. క్రమేపీ చూపు కోల్పోయి అంధత్వానికి చేరుకోవడం వేరు. నా విషయంలో అదే జరిగింది. అయినా నేనెప్పుడూ కుంగిపోలేదు. మరింత మెరుగ్గా, చూపున్న పిల్లల కంటే సమర్థంగా, ఉన్నతంగా ఎదగడం కోసం నాలోని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకోవడం చిన్నప్పటి నుంచే మొదలుపెట్టాను. పుట్టుకతో నా కంటి చూపు అందరు పిల్లల్లాగే మెరుగ్గానే ఉండేది. బడికి కూడా వెళ్తూ ఉండేదాన్ని. కానీ క్రమేపీ చూపు తగ్గుతూ ఉండడంతో, అమ్మా నాన్నా నన్ను స్థానికంగా కంటి వైద్యులకు చూపించారు. ఎల్వీ ప్రసాద్, సరోజినీ దేవి కంటి ఆస్పత్రులకు కూడా తీసుకువెళ్లారు. చూపు మెరుగు కోసం చేసిన మొదటి సర్జరీ విఫలమైపోయింది. విదేశీ వైద్యులు చేసిన రెండో సర్జరీ ఫలితాన్నిచ్చి పదో తరగతి వరకూ కొంతమేరకు చూడగలుగుతూ, నా పనులు నేను చేసుకోగలిగేదాన్ని. అలాగని నేను సాధారణ బడుల్లో చదువుకోలేదు. యుకెజి వరకూ సాధారణ బడిలో చదివినా, పుస్తకాలు చదవడం వల్ల, కంటిచూపు ఇంకా వేగంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని వైద్యులు చెప్పడంతో ఒకటో తరగతి నుంచి బ్రెయిలీలో చదువు కొనసాగించాను. పదో తరగతి నుంచి చూపు మరింత దిగజారుతూ, అంతిమంగా అంధత్వానికి దారి తీసింది. నాకున్నది గ్లాకోమా సమస్య కాబట్టి పెరిగే వయసుతో పాటు చూపు తగ్గి అంతిమంగా అంధత్వం వచ్చేస్తుందనే విషయాన్ని నేను అర్థం చేసుకుని మానసికంగా సిద్ధపడిపోయాను. అలా ఇంటర్ వరకూ బ్రెయిలీలోనే చదివి, డిగ్రీలో అడుగు పెట్టిన తర్వాత ఉస్మానియా వెబ్‌సైట్ ఆధారంగా చదువును కొనసాగించాను. ప్రస్తుతం ఎమ్‌బిఎ సెకండ్ ఇయర్ చదువుతున్నాను.

అమ్మానాన్నల ప్రోత్సాహంతో...

ఒకటో తరగతిలో మొదటిసారిగా బ్లైండ్ స్కూల్‌కు వెళ్తున్నప్పుడు, అమ్మ నన్ను చూసి విపరీతంగా ఏడ్చింది. అప్పటివరకూ సాధారణ బడికి వెళ్లిన నేను అంధులైన పిల్లలతో కలిసి అంధ పాఠశాలకు వెళ్లడం అమ్మ తట్టుకోలేకపోయింది. నేను కూడా అంధ పిల్లల్లా ఉన్న చోటికే పరిమితమైపోతానేమోనని అమ్మ భయపడింది.

పాటలు పాడే అభిరుచి చిన్నతనంలోనే ఏర్పడింది. నా ఆసక్తిని గ్రహించిన అమ్మ నన్ను వెంటబెట్టుకుని మ్యూజిక్ క్లాస్‌లకు తీసుకువెళ్తూ ఉండేది. ప్రతిమ శశిధర్, కొమండూరి రామాచారి గారి దగ్గర సంగీతం నేర్చుకున్నాను. 2022లో తెలుగు ఇండియన్ ఐడిల్ సీజన్ వన్‌లో పాల్గొని, థియేటర్ లెవల్ వరకూ చేరుకోగలిగాను. ప్రస్తుతం ప్రతి రోజూ సంగీతం సాధన చేస్తూ ఉంటాను. పాటలు వింటూ, పాడుతూ వేర్వేరు జోనర్స్ ప్రయత్నిస్తూ ఉంటాను.



కానీ ఎదుగుతున్నకొద్దీ అవన్నీ అర్థం లేని భయాలని ఆమె గ్రహించింది. ఒకవేళ ఎప్పుడైనా కాస్త వెనకబడినట్టు కనిపిస్తే, 'సాధారణ పిల్లల్లాగే నువ్వు కూడా అన్నీ చేయగలుగుతావు' అంటూ అమ్మానాన్నలు నన్ను ప్రోత్సహిస్తూ ఉండేవారు. వాళ్లు నన్నెప్పుడూ ఒక అంధురాలిగా పరిగణించలేదు.

యువతకు చదువుతో పాటు వినోదం కూడా తప్పనిసరి. అయితే ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం వినోదాన్ని ఎంచుకున్నా, దానికీ పరిమితి ఉండాలి. ఎంత చదివినా, ఎంత ఎదిగినా వినోదం పరిమితంగానే ఉండాలి. అప్పుడే అనుకున్నది సాధించగలుగుతాం!

క్రికెటర్‌గా, కబడ్డీ ప్లేయర్‌గా...

అంధత్వం ఉంది కాబట్టి నేను నా బాల్యాన్ని ఎంజాయ్ చేయలేకపోయానని అనుకుంటే పొరపాటు. నేను అంధులైన పిల్లలతోనే కలిసి పెరిగాను. మేమందరం సాధారణ పిల్లలతో సమానంగా చురుగ్గా అన్ని క్రీడల్లో పాల్గొనేవాళ్లం. ప్రత్యేకించి నేను క్రికెట్ బాగా ఆడేదాన్ని. తెలంగాణా బ్లైండ్ విమెన్ టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా ఉండేదాన్ని. నేను జాతీయ కబడ్డీ ప్లేయర్‌ను కూడా! అంధులమైనంత మాత్రాన మేం సాధారణ పిల్లలకు ఏమాత్రం తీసిపోము. నిజానికి వాళ్లకంటే ఇంకాస్త మెరుగ్గా ఆడతామనే అనుకోవచ్చు. ఎందుకంటే చూపున్న వాళ్లు చెవులను అంతగా ఉపయోగించరు. అంధులు విషయాలను త్వరగా గ్రహిస్తారు అని అంటూ ఉంటారు. కానీ నిజానికి ఐక్యు అందరికీ సమానంగానే ఉంటుంది. అయితే మాకు కళ్లు కనిపించవు కాబట్టి వినికిడి శక్తి మీద ఎక్కువగా ఆధారపడతాం. వినికిడి పూర్తి సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకుంటాం! వినికిడి శక్తితో పరిసరాలు, పనులు, నైపుణ్యాల మీద పట్టు పెంచుకోగలుగుతాం!"

> "మాది ఖమ్మం. నా చదువు కోసం చిన్నప్పుడే హైదరాబాద్ వచ్చేసి, ఇక్కడే స్థిరపడిపోయాం. నాన్న కొండలరావు, కారు నడుపుతారు. అమ్మ మాధవి, గృహిణి. సంగీతంలో అమ్మ నన్ను ప్రోత్సహిస్తే, నాన్న నన్ను చదువులో ప్రోత్సహించారు. నా కాళ్ల మీద నేను నిలబడి, ఎవరి మీదా ఆధారపడకుండా స్వతంత్రంగా బతకాలన్నది అమ్మానాన్నల ఆకాంక్ష. ఎదుటివాళ్లకు సహాయపడేలా ఎదగాలనీ, చేయి చాపే పరిస్థితి ఉండకూడదనీ నాన్న అంటూ ఉంటారు. ప్రస్తుతం నేను సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాను. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎదగాలన్నది నా లక్ష్యం."

• గోగుమళ్ల కవిత

సౌందర్యం

చలికాలంలో పెదాలు పొడిగామారి పగిలి రక్తమోడుతూ ఇబ్బంది పెడుతుంటాయి. ఒక్కోసారి లిప్‌బామ్ కూడా పని చేయదు. ఇలా కాకుండా ఇంట్లో ఉండేవాటితోనే పెదాలను మృదువుగా ఆరోగ్యంగా ఎలా ఉంచుకోవాలో తెలుసుకుందాం.

పెదాలు పగులుతున్నాయా..!

- చలికాలంలో దాహమనిపించదు కాబట్టి నీళ్లు తక్కువగా తాగుతారు. దీనివల్ల శరీరంలో నీటిశాతం తగ్గి పెదాలకు తేమ అందదు. అందుకే పెదాల మీద చర్మం నల్లగా పెళుసుగామారి పగులుతుంది. దాహంగా లేకపోయినా రెండు గంటలకోసారి కనీసం గ్లాసు నీళ్లు తప్పకుండా తాగాలి. తరచూ పేరిన నెయ్యి, వెన్న, కొబ్బరినూనె రాస్తుంటే పొడిబారకుండా ఉంటాయి.
- ఒక గిన్నెలో చెంచా చొప్పున పంచదార, తేనె, బాదం నూనె వేసి, బాగా కలిపి ఆ మిశ్రమాన్ని పెదాలపై మృదువుగా రుద్దాలి. పెదాలపై మృత కణాలన్నీ తొలగిపోయి రక్త ప్రసరణ జరిగి పగుళ్లు పోతాయి.
- పొడిబారిన పెదాలను నాలుకతో మాటిమాటికి తడపకూడదు. దీనివల్ల సమస్య మరింత పెరుగుతుంది. గులాబీ రేకులను పాలలో నానబెట్టి, మెత్తగా నూరి, ఆ మిశ్రమాన్ని పెదాలకు పట్టిస్తే వాటికి తగినంత తేమ లభిస్తుంది.
- చలికాలంలో రసాయనాలతో కూడిన లిప్‌స్టిక్‌లను వాడకూడదు. తప్పనిసరిగా వాడాల్సివస్తే ముందుగా పెదాలపై వేసలిన్ లేదా కొబ్బరినూనె రాసి ఆ తరవాతనే లిప్‌స్టిక్ వేసుకోవాలి. తరచూ కొత్తిమీర రసం లేదా బీట్‌రూట్ రసం రాస్తుంటే పెదాలు సహజసిద్ధంగానే ఎరుపు రంగులోకి మారతాయి.



- ఒక బౌల్‌లో రెండు చెంచాల తేనె, ఒక చెంచా దానిమ్మ రసం కలిపి ఫ్రిజ్‌లో అరగంట ఉంచాలి. తరవాత ఆ మిశ్రమాన్ని పెదాలమీద మెల్లగా రుద్దాలి. అరగంట తరవాత మంచి నీళ్లతో కడగాలి. ఇలా తరచూ చేస్తుంటే పెదాలు మృదువుగా మారతాయి.
- పెదాలు పగిలి నల్లగా మారినపుడు గ్లిజరిన్ మంచి మందులా పని చేస్తుంది. అయిదు చెంచాల నిమ్మ రసానికి ఒక చెంచా గ్లిజరిన్ కలిపి దాన్ని రాత్రి పడుకునే ముందు పెదాలకు రాయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లతో కడగాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తే పెదాలు ఆరోగ్యంగా ఉంటాయి.

గృహాలంకరణ

ఇల్లు విలాసవంతంగా

ఇంటిని అందంగా ఆకర్షణీయంగా అలంకరించుకోవాలని అందరికీ ఉంటుంది. కానీ ఇది కాస్త ఖర్చుతో కూడుకున్నది. అలా కాకుండా మన బడ్జెట్‌లోనే కొన్ని మార్పులు, చేర్పులు చేస్తూ ఇంటిని విలాసవంతంగా ఎలా మార్చుకోవాలో తెలుసుకుందాం!



సీటింగ్: లివింగ్ రూమ్ లేదా హాల్‌లోనే కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కలుస్తుంటారు. ఇక్కడ పొడవైన లేదంటే అర్ధచంద్రాకారపు సోఫా అమర్చుకుంటే అందరూ కూర్చొని మాట్లాడుకోవడానికి బాగుంటుంది. సోఫా ముందు చిన్న టీపాయ్, అక్కడక్కడ చిన్న కుర్చీలు వేసి ఓ ప్రక్కగా అందమైన అక్వేరియం ఏర్పాటు చేస్తే అద్భుతంగా ఉంటుంది. సోఫాలో చిన్న మెత్తలను నిలబెడితే అందంగా కనిపిస్తుంది. హాల్ మొత్తం గాలి, వెలుతురు ప్రసరించేలా చూసుకుంటే అహ్లాదకరంగా అనిపిస్తుంది.

లైటింగ్: ఇంటి అందాన్ని పెంచడంలో లైటింగ్‌దే ప్రధాన పాత్ర. హాల్, బెడ్‌రూమ్, కిచెన్, ఇతర గదుల్లో షాండిలియర్స్, హ్యాంగింగ్ లైట్లు అలంకరించండి. లాకెట్ లైట్లు, స్ట్రింగ్ లైట్లు కూడా రిచ్‌గా కనిపిస్తాయి. ఇంటి ముందు స్టార్రీ లైట్లు, హెడ్లులు ఏర్పాటు చేస్తే కనువిందుగా ఉంటుంది. చెట్లకు స్ట్రింగ్ లైట్లు అలంకరిస్తే శోభాయమానంగా కనిపిస్తుంది.



పోషకాహారం

గుడ్లు తింటున్నారా...

కోడి గుడ్డు మంచి మంచి పోషకాహారం. రోజుకు ఒకటైనా తినాలని నిపుణులు చెబుతున్నారు. దీనిలోని విటమిన్లు, మినరల్స్ శరీరాన్ని దృఢంగా ఉంచుతాయి. ఉదయం అల్పాహారంలో ఉడికించిన గుడ్లను చేర్చుకోవడం వల్ల రోజంతా అలసట లేకుండా ఉంటుంది. ఆర్నెల్ల పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ గుడ్లను ఆహారంగా తీసుకోవచ్చు.

- గుడ్డు తెల్లసొనలో అత్యధికంగా ప్రోటీన్లు ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన తొమ్మిది రకాల అమినో యాసిడ్లను అందిస్తాయి. పచ్చసొనలో ఎ, డి, ఇ, బి 6, బి 12 విటమిన్లతోపాటు ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, అయోడిన్, కెరోటిన్లు ఉంటాయి. ఇవి శరీరానికి పోషణనివ్వడంతోపాటు వ్యాధులు రాకుండా కాపాడతాయి.
- ఉదయాన్నే గుడ్లు తింటే వాటిలోని పిండిపదార్థాలు కడుపు నిండిన భావనను కల్గిస్తాయి. తొందరగా ఆకలి అనిపించదు. దీనివల్ల మనం తీసుకునే క్యాలరీలు తగ్గి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. రాత్రిపూట తింటే హార్మోన్లు సక్రమంగా పనిచేస్తాయి.
- గుడ్లను తినడం వల్ల బీటైన్, కోలిన్ అనే అరుదైన పోషకాలు లభిస్తాయి. ఇవి గర్భిణులకు, బాలింతలకు అత్యవసరం. మెదడు పనితీరుని మెరుగుపరచి జ్ఞాపక శక్తిని పెంచుతాయి. గుండె వ్యాధులు, పక్షవాతం, థైరాయిడ్ రాకుండా చేస్తాయి.
- మధుమేహం, బీపీ, కాలేయ సమస్యలు, కిడ్నీ వ్యాధులు, అనారోగ్యంతో మంచాన ఉన్నవారు ఉడికించిన గుడ్లను మితంగా తీసుకోవచ్చు. గుడ్లు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ రోజుకి మూడు కంటే ఎక్కువ తినకూడదు.

స్ఫూర్తి

అవమానాల బరువు తగ్గిస్తున్నారు

అనారోగ్యం, అధిక బరువుతో ఎదురైన అవమానాలు తట్టుకొని... ఫిట్‌నెస్ శిక్షకురాలుగా వేలాదిమందిని ప్రభావితం చేసే స్థాయికి ఎదిగారు సుష్మా పచౌరీ. "మార్పును కోరుకున్నప్పుడు పోరాటం తప్పదు. పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ఏదీ అసాధ్యం కాదు" అంటున్న 45 ఏళ్ల సుష్మ కథ ఆమె మాటల్లోనే...



"మాది ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్. చదువులో, ఆటపాటల్లో చిన్నప్పటి నుంచీ చురుగ్గా ఉండేదాన్ని. డాక్టర్ కావాలనేది నా ఆశయం. కానీ మెడిసిన్‌లో సీటు రాలేదు. 'బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ' (బిహెచ్ఎంఎస్) చేసి, ఆ కోరిక తీర్చుకోగలిగాను. వివాహం అయ్యాక రాయపూర్‌లోనే క్లినిక్ ప్రారంభించాను. ఎంతో హాయిగా సాగిపోతున్న నా జీవితం అనారోగ్యంతో అల్లకల్లోలమైపోయింది. నెలసరి సక్రమంగా రాకపోవడం, బరువు విపరీతంగా పెరగడం లాంటి సమస్యలు తలెత్తడంతో... వైద్య పరీక్షలు చేయించుకున్నాను. నాకు 'పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్' (పీసీఓఎస్) ఉన్నట్టు తేలింది. ఇది హార్మోన్లలో సమతుల్యత దెబ్బతినడం వల్ల వస్తుంది. మహిళల ప్రత్యుత్పత్తి వ్యవస్థను దెబ్బతీస్తుంది. ఈ సంగతి తెలియగానే నేను కుంగిపోయాను. పీసీఓఎస్ నా ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం చూపించింది. చికిత్స తీసుకుంటున్నా బరువు పెరగడం ఆగలేదు. మానసికమైన ఆందోళన తగ్గలేదు. నాలుగుసార్లు గర్భస్రావం అయింది. అయిదో ప్రయత్నంలో ఒక బిడ్డకు జన్మ ఇవ్వగలిగాను. మందులు ఎక్కువగా తీసుకోవాల్సి రావడంతో... కేవలం రెండేళ్లలోనే నా బరువు 52 కిలోల నుంచి 90 కిలోలకు పెరిగిపోయింది. పది అడుగులు నడవడం కూడా కష్టంగా ఉండేది. ఆ దశలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాను. కొందరు పేషెంట్లు కూడా ఎగతాళిగా మాట్లాడేవారు. ఇది తట్టుకోలేక క్లినిక్ మూసేశాను. దేనిమీదా ఆసక్తి ఉండేది కాదు. అలాంటి పరిస్థితిలో మా పెద్దన్నయ్య మాటలు నన్ను కొత్త దారిలో నడిపించాయి.

కష్టమైనా వెనక్కి తగ్గలేదు...

ఒక రోజు నన్ను చూడడానికి మా అన్నయ్య వచ్చాడు. "సుష్మా! ఇప్పుడు నువ్వు నాకు అక్కయ్యలా అనిపిస్తున్నావు" అన్నాడు. అతని మాటల్లో వెటకారం కన్నా ఆవేదనే ఎక్కువగా కనిపించింది. అన్నయ్య వెళ్లిపోయాక... అద్దం ముందు నిలబడ్డాను. నాకు నేనే అసహ్యంగా కనిపించాను. 'ఎంతో నాజూకుగా ఉండే నేను ఎందుకిలా తయారయ్యాను? ఎప్పుడూ చురుగ్గా తిరిగే నేను ఇంట్లోనే కదల్లేని దుస్థితిని ఎలా భరిస్తున్నాను? కొన్నాళ్ళు పోతే మిగిలిన బతుకంతా మంచానికే పరిమితం కావాల్సి వస్తుంది. అలా జరగకూడదు' అనుకున్నాను. బరువు తగ్గడానికి వ్యాయామమే ఉత్తమమైన మార్గమని వైద్యురాలినైన నాకు తెలుసు. అందుకే మర్నాడే జిమ్‌లో చేరాను. మొదట్లో వ్యాయామాలు కష్టంగా అనిపించేవి. కానీ వెనక్కి తగ్గలేదు. ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకున్నాను. మూడు నెలల్లోనే తొమ్మిది కిలోలు తగ్గాను. ఇది నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఏడాది తిరిగేసరికి 90 కిలోల నుంచి 59 కిలోలకు తగ్గాను. మళ్ళీ నా క్లినిక్ తెరిచాను. అక్కడికి వచ్చినవాళ్ళందరూ "అంత బరువు ఎలా తగ్గారు?" అని అడిగేవారు. ఒకప్పుడు బరువుగా, లావుగా ఉండడం వల్ల నాలో నెలకొన్న న్యూనత, నిస్పృహ వారిలో నేను గమనించాను. నా వంతుగా వారికి సాయం చెయ్యాలనుకున్నాను.. ఫిట్‌నెస్ ట్రైనింగ్ కోర్సు చేశాను. ఒక జిమ్‌లో మహిళలకు బేసిక్ ఫిట్‌నెస్ కోచ్‌గా చేరాను.

> ఒక రోజు నన్ను చూడడానికి మా అన్నయ్య వచ్చాడు. 'సుష్మా! ఇప్పుడు నువ్వు నాకు అక్కయ్యలా అనిపిస్తున్నావు' అన్నాడు. తన మాటల్లో వెటకారం కన్నా ఆవేదనే ఎక్కువగా కనిపించింది.

ఆ మాటలు అవమానంగా అనిపించాయి...

ఇంటి పనులతో, క్లినిక్, జిమ్ బాధ్యతలతో తీరిక లేకుండా ఉండడంతో... రోజూ చేసే వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేశాను. క్రమంగా ఆ దుష్ప్రభావం కనిపించింది. కొన్ని నెలల్లోనే మళ్ళీ పది కిలోలకు పైగా పెరిగిపోయాను. నా దారుఢ్యం కూడా తగ్గుతూ వచ్చింది. మా జిమ్ యజమాని ఇది గమనించారు. "మీరే ఫిట్‌గా ఉండకపోతే... మీ దగ్గరకు వచ్చేవారు ఫిట్‌గా ఉండడానికి ఎలా సాయపడతారు? ఏడాదిలో దాదాపు నలభై కిలోలు తగ్గి ఎందరికో స్ఫూర్తినిచ్చారు. ఇప్పుడు మీకేమయింది?" అని ప్రశ్నించారు. ఆ మాటలు చాలా అవమానంగా అనిపించాయి. ఇంటికి వచ్చి, నా భర్తతో ఈ సంగతి చెబుతూ ఏడ్చాను. "ఆ మాటల్లో తప్పేముంది? ఎంతో కష్టపడి బరువు తగ్గావు. ఇప్పుడు పెరుగుతున్నావు. నియంత్రణ నీ చెయ్యి దాటిపోతే... మళ్ళీ డిప్రెషన్‌లోకి వెళ్ళే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. మర్నాడు పొద్దున్నే జిమ్‌కు వెళ్ళి, వ్యాయామం చేశాను. నిపుణుల సలహాతో...



బాడీబిల్డింగ్ అభ్యాసం ప్రారంభించాను. ఫలితాలు తొందరగానే కనిపించాయి. కానీ ఈసారి అలసత్వాన్ని దగ్గరకు రానివ్వలేదు. గట్టి లక్ష్యాలను నిర్దేశించుకున్నాను. 2022లో మొదటిసారిగా బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని గెలిచాను. ఆ తరువాత పోటీల్లో బహుమతులు సాధించడం మామూలైపోయింది. ఇది నా జీవితంలో అతి ప్రధానమైన మైలురాయిగా భావిస్తున్నాను.

దానివల్లే సాధ్యమయింది...

ఇప్పుడు నేను ఫుల్‌టైమ్ ప్రీమియర్ కేటగిరీ ఫిట్‌నెస్ కోచ్‌గా ఎందరో మహిళలకు శిక్షణ ఇస్తున్నాను. రాయపూర్‌లోని అనేక ఫిట్‌నెస్, వెల్‌నెస్ సంస్థలకు నా సేవలు అందిస్తున్నాను. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు పెద్దలు. దాన్ని కాపాడుకోవాలంటే దారుఢ్యం ఎంతో అవసరం. అందుకే ఫిట్‌నెస్ ప్రాధాన్యాన్ని వివరిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. కొన్నేళ్ళ క్రితం అద్దంలో నా రూపం చూసి నేనే అసహ్యించుకున్న రోజుల నుంచి... ఇప్పుడు ఇతరులకు ప్రేరణగా నిలవడం ఎంతో సంతోషంగా ఉంది. ఇదంతా నాలోని సానుకూల దృక్పథంతోనే సాధ్యమయింది."



కెనడాలో హిందువుల భారీ ర్యాలీ

న్యూఢిల్లీ, నవంబరు 5: హిందూ ఆలయాలపై పదేపదే జరుగుతున్న దాడులకు నిరసనగా కెనడాలోని బ్రాంప్టన్ నగరంలోని హిందూ సభా మందిర్ దగ్గర వేలాది మంది హిందువులు సోమవారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ఖలిస్థానీ మద్దతుదారులు హిందూ సభ మందిర్‌పై, అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న హిందువులపై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే హిందువులు భారీ ర్యాలీ నిర్వహించారు. కెనడా ప్రజా ప్రతినిధులు, దర్యాప్తు సంస్థలు ఖలిస్థానీలకు మద్దతు ఇవ్వవద్దని కోరారు. ఇదిలా ఉండగా, కెనడాలో హిందూ ఆలయంపై దాడికి నిరసనగా ఢిల్లీలో యునైటెడ్ హిందూ ఫ్రంట్, రాష్ట్రవాదీ శివసేన మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించాయి. కెనడాలో హిందూ దేవాలయాలపై ఇటీవల జరిగిన దాడులపై విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ దేశ రాజకీయాల్లో అతివాద శక్తులకు స్థానం ఇస్తున్నారనడానికి ఈ ఘటనలే నిదర్శనమన్నారు. ఇదిలా ఉండగా, భారత్‌లో ఉగ్రవాదాన్ని పెంచి పోషించడానికి భారీ కుట్ర జరుగుతోందని ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ కుట్రలో పాక్ ఐఎస్ఐతో పాటు కెనడాకూ భాగం ఉందని ఆరోపిస్తున్నాయి.

సల్మాన్‌ఖాన్‌కు మళ్లీ బెదిరింపులు

ముంబై, నవంబరు 5: బాలీవుడ్ ప్రముఖ నటుడు సల్మాన్‌ఖాన్‌కు తాజాగా మరో బెదిరింపు సందేశం వచ్చింది. సోమవారం అర్ధరాత్రి ముంబై వోర్లి ప్రాంతంలోని ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు ఈ సందేశం వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌కి సోదరుడినంటూ అందులో పేర్కొన్న దుండగుడు... సల్మాన్ రూ. 5 కోట్లు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసినట్లు చెప్పారు. కృష్ణజింకను వేటాడినందుకు గాను తమ దేవాలయా(బిష్ణోయ్‌లా ఆరాధ్యదైవం)నికి వెళ్లి క్షమాపణలు చెప్పాలని లేదంటే రూ. 5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. లేకపోతే సల్మాన్‌ను హతమారుస్తామని బెదిరించినట్లు పేర్కొన్నారు.

రష్యా రాకెట్‌లో ఇరాన్ శాటిలైట్లు

మాస్కో, నవంబరు 5: రష్యా అంతరిక్ష సంస్థ రోస్కోస్మోస్ వోస్టోచ్నీ కాస్మోడ్రోమ్ నుంచి సోయుజ్ రాకేట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. ఈ ప్రయోగం ద్వారా రష్యా, 53 ఇరాన్ శాటిలైట్లను కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఇరాన్‌కు చెందిన కౌసర్ హోడోడ్ సహా చిన్న ఉపగ్రహాలను కూడా రష్యా ప్రయోగించింది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య బంధం బలపడే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ఉపగ్రహాలు ఐనోస్పియర్‌ను పర్యవేక్షించడంతో కీలకపాత్ర పోషించనున్నాయి. నాసా ప్రకారం... అంతరిక్ష వాతావరణం సూచనలను తెలుసుకోవడానికి ఐనోస్పియర్‌ను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

ఆదివాసీల కోటలో హోరాహోరీ!



ఈ నెల 13, 20 తేదీల్లో ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు

- గెలుపు కోసం తీవ్రంగా తలపడుతున్న జేఎంఎం, బీజేపీ కూటములు
- ఆదివాసీ ఓటుబ్యాంకుపై సోరేన్ గురి

న్యూఢిల్లీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13, 20 తేదీల్లో.. రెండు దశల్లో జరగనున్న ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆదివాసీ, మహిళా ఓటర్లే ఫలితాల్ని నిర్ణయించనున్నారు. ఝార్ఖండ్ జనాభాలో 26.21% మంది ఆదివాసీలు కాగా రాష్ట్రంలోని మొత్తం 81 సీట్లలో 28 సీట్లు ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. ఝార్ఖండ్‌లో ఇప్పటి వరకు 13 మంది ముఖ్యమంత్రులు సీఎం పదవిని చేపట్టగా, వారిలో బీజేపీ నేత రఘుబర్‌దాస్ తప్ప మిగతా వారందరూ ఆదివాసీలే కావడం విశేషం. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 28 ఎస్టీ స్థానాల్లో బీజేపీకి రెండు సీట్లే దక్కగా, జేఎంఎం, కాంగ్రెస్ కలిసి 25 సీట్లు గెలుచుకున్నాయి. ఒక స్థానాన్ని బాబులాల్ మరాండీ నేతృత్వంలోని జేవీఎం దక్కించుకుంది. అనంతర రాజకీయ పరిణామాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, జేఎంఎం అధినేత హేమంత్ సోరేన్‌ను ఈడీ అరెస్టు చేయడంతో ఆదివాసీ ప్రాంతాల్లో ఆయన పట్ల సానుభూతి పెరిగింది. ఫలితంగా ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎస్టీలకు రిజర్వు అయిన మొత్తం 5 స్థానాల్లో జేఎంఎం, కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. మొత్తమ్మీద ఆదివాసీ ప్రాంతాల్లో జేఎంఎం కూటమి, ఆదివాసీయేతర ప్రాంతాల్లో బీజేపీ కూటమి పట్టు పెంచుకున్నట్లు కనపడుతోంది. ఇది ఝార్ఖండ్‌లో ఆదివాసీ, ఆదివాసీయేతర విభజనకు దారితీసిందని భావిస్తున్నారు.

ఆదివాసీల మద్దతుతో మరోసారి!

ఝార్ఖండ్ రాష్ట్రం కోసం ఉద్యమించి, దానిని సాకారం చేసిన షిబు సోరెన్ వారసుడిగా ఆదివాసీల్లో హేమంత్ సోరెన్‌కు గట్టి పట్టుంది. ప్రస్తుత ఎన్నికలను మూలవాసీయులకూ బయటి వారికీ మధ్య పోటీగా హేమంత్ సోరెన్ అభివర్ణిస్తున్నారు. సీఎంగా తాను చేపట్టిన పలు పథకాలను, తీసుకున్న నిర్ణయాలను ఆయన ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. విద్యుత్ బకాయిల రద్దు, ఉచిత విద్యుత్ పంపిణీ, వ్యవసాయ రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను గుర్తు చేస్తున్నారు. మరోవైపు, ప్రకృతిని ఆరాధించే ఆదివాసీలమైన తాము హిందూ మతంలో భాగం కాదని, తాము ఆచరించే సర్నా మతాన్ని ప్రత్యేకంగా గుర్తించాలని హేమంత్ కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైనులకు వ్యక్తిగత చట్టాలు (పర్సనల్ లా) ఉన్నట్లుగా ఆదివాసీలకు ప్రత్యేకంగా సర్నా కోడ్‌ను తీసుకురావాలని పేర్కొంటున్నారు. ఆదివాసీలకు కూడా ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసి తమ సంస్కృతి, సంప్రదాయాలను కాలరాచే ప్రయత్నం బీజేపీ చేస్తోందని హేమంత్ సోరేన్ ఆరోపిస్తున్నారు. ఈ విధంగా ఆదివాసీ ఓటుబ్యాంకును మరింత సంఘటితం చేసే ప్రయత్నాల్లో హేమంత్ ఉన్నారు. మరోవైపు, తమ కూటమిలోకి ఈసారి సీపీఐ(ఎంఎల్)ను కూడా తీసుకొచ్చి కూటవిని మరింత బలోపేతం చేశారు. కూటమిలో జేఎంఎం 42, కాంగ్రెస్ 29, ఆర్జేడీ 4, సీపీఐ (ఎంఎల్) 4 సీట్లలో పోటీ చేస్తున్నాయి.

ఓట్ల చీలికకు బీజేపీ యత్నాలు

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఆదివాసీ ఓటర్లను తన వైపునకు తిప్పుకొనేందుకు బీజేపీ అన్ని రకాలుగా పావులు కదుపుతోంది. బంగ్లాదేశ్ నుంచి వస్తున్న చొరబాటుదారుల సమస్యను ప్రధానంగా ప్రస్తావిస్తూ.. ఆదివాసీలకు దక్కాల్సిన ప్రయోజనాలను ముస్లింలు ఎక్కువగా పొందుతున్నారని ఉధృతంగా ప్రచారం చేస్తోంది. మరోవైపు, రాష్ట్రంలో ఇప్పటికే నాలుగైదుసార్లు పర్యటించిన ప్రధాని మోదీ.. ఆదివాసీలకోసం రూ.79,150 కోట్ల పథకాన్ని ప్రారంభించారు. కాగా, ఆదివాసీలను తమవైపునకు తిప్పుకొనేందుకు వీలుగా.. ఉమ్మడి పౌరస్మృతి ఆదివాసీలకు వర్తించదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రచారం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఝార్ఖండ్‌లోని మొత్తం 81 సీట్లకుగాను 32 సీట్లలో మహిళా ఓటర్లు పురుషుల కన్నా అధికంగా ఉండటం విశేషం.

బెయిల్‌పై వచ్చి భార్య, ముగ్గురు బిడ్డల్ని చంపి ఆత్మహత్య!

న్యూఢిల్లీ, నవంబరు 5: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి జిల్లాలో దారుణం జరిగింది. బెయిల్‌పై బయటకు వచ్చిన ఓ వ్యక్తి తన భార్య, ముగ్గురు బిడ్డల్ని కాల్చి చంపి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వారణాసిలో భైదానీ ప్రాంతానికి చెందిన రాజేంద్రగుప్తా(45) అనే వ్యక్తి 1997 నాటి ఓ హత్య కేసులో నిందితుడు. అతడు ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న భార్య నీతూ గుప్తా(43), కుమారులు నవనేంద్ర(25), సుబేంద్ర(15), కూతురు గౌరంగి(16)లను రాజేంద్ర గుప్తా కాల్చి చంపేసి అక్కడి నుంచి పరారయ్యాడు. పట్టణంలోనే మరో ప్రాంతంలో రాజేంద్రగుప్తా కూడా బుల్లెట్ గాయంతో చనిపోయి పడి ఉన్నాడు. రాజేంద్ర భార్యాబిడ్డల్ని చంపి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో అంచనా వేశారు.

తాజ్‌మహల్ సమీపంలోని పార్కు ఓ రైతు స్వాధీనంలోకి!

- 40 ఏళ్ల న్యాయ పోరాటంలో గెలిచానని వెల్లడి..చుట్టూ కంచె ఏర్పాటు

ఆగ్రా, నవంబరు 5: ఆగ్రాలో మెహతాబ్ బాగ్ సమీపంలోని గ్యారహ్ సీదీ పార్క్ నుంచి తాజ్‌మహల్ అందాలను చూస్తుంటే కనుల విందుగా ఉంటుంది. అదే సూర్యాస్తమయం సమయంలో అయితే వాహ్ తాజ్! అనేలా సీన్ ఉంటుంది. దీంతో ఆ ప్రాంతం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. అయితే యమునా నది ఒడ్డున ఉండే ఈ గ్యారహ్ సీదీ పార్క్ విషయంలో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ పార్కులోని కొంత భూమి తనదని, తన పూర్వీకుల ఆస్తి అని, 40 ఏళ్ల పాటు సాగిన న్యాయ పోరాటంలో తాను గెలిచానని పేర్కొంటూ మున్నాలాల్ అనే స్థానిక రైతు.. ఆ పార్కులోకి పర్యాటకులు రాకుండా నిషేధించాడు. తనదని చెబుతున్న 6 బిగాల (దాదాపు 2.4 ఎకరాలు) భూమిని తన నియంత్రణలోకి తీసుకొని, చుట్టూ కంచె వేసేశాడు. ఈ భూమిపై కొన్ని తరాల నుంచి తమకు హక్కు ఉందని, తన తండ్రి, బాబాయిలు ఇందులో సాగు కూడా చేశారని కచ్‌పురాకు చెందిన మున్నాలాల్ చెబుతున్నాడు. వాళ్ల పేర్లు భూ పత్రాల్లో కూడా ఉన్నాయని పేర్కొన్నాడు. అయితే తాజా వివాదంపై ఆగ్రా డివిజనల్ కమిషనర్ రితూ మహేశ్వరి స్పందిస్తూ.. వివాదంలోని భూమి ఆగ్రా డెవలప్‌మెంట్ అథారిటీ(ఏడీఏ) పరిధిలోకి వస్తుందని చెప్పారు. తాజా పరిణామాలపై విచారణ కొనసాగుతోందని చెప్పారు.


రాజకీయాలకు పవార్ గుడ్‌బై!

- బారామతిలో 'రిటైర్మెంట్' సంకేతాలు
- ఇక ఏ ఎన్నికల్లో పోటీచేయను.. రాజ్యసభకు వెళ్లడంపైనా పునరాలోచిస్తానని వ్యాఖ్యలు



బారామతి, నవంబరు 5: ఆరు దశాబ్దాలకు పైగా మహారాష్ట్రలో, జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న మరాఠా యోధుడు, ఎన్‌సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ (84) పార్లమెంటరీ రాజకీయాలకు గుడ్‌బై చెప్పనున్నారా..? తిరిగి రాజ్యసభకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారా..? గత కొద్ది రోజులుగా ఆయన ప్రసంగాలు విన్న వారంతా ఇదే చర్చించుకుంటున్నారు. మంగళవారం బారామతిలో ప్రచారం సందర్భంగా స్వయంగా రిటైర్మెంట్ సంకేతాలు ఇచ్చారు. తన రాజకీయ జీవితానికి ఎక్కడో ఒక చోట ముగింపు పలకాల్సిందేనని వ్యాఖ్యానించారు. మరో ఏడాదిన్నరలో రాజ్యసభ ఎంపీగా తన పదవీకాలం ముగియనుందని.. ఆ తర్వాత మళ్లీ పెద్దల సభలో అడుగుపెట్టాలా వద్దా అనేదానిపై ఆలోచన చేయాల్సి ఉందని, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక ఆ దిశగా ఆలోచిస్తానని తెలిపారు. 'మీరు (ప్రజలు) నన్ను ఒకసారి కాదు.. రెండు సార్లు కాదు.. నాలుగు సార్లు సీఎంను చేశారు. 1967లో తొలిసారి నన్ను ఎన్నుకున్నారు. 14 సార్లు పోటీచేశాను. మీరు ఏనాడూ నన్ను ఇంటికి పంపించలేదు. ప్రతిసారీ గెలిపించారు. ఇక నేను ఎక్కడో ఒక చోట ఆగిపోవాలి. కొత్త తరాన్ని ముందుకు తీసుకురావాలి. మహారాష్ట్ర కోసం పనిచేయడానికి ముందు బారామతిలో 25 ఏళ్లు ఉన్నాను. తర్వాత స్థానిక అధికారాలన్నీ అజిత్ దాదా(అజిత్ పవార్)కు అప్పగించాను. ఆయన కూడా 25-30 ఏళ్లు ఈ ప్రాంతంలో బాగా పనిచేశారనడంలో సందేహం లేదు. నేనెవరినీ తొక్కివేయలేదు' అని పవార్ అన్నారు.

నవ్య | చిత్రజ్యోతి



లక్నోలో గేమ్‌ఛేంజర్ ఈవెంట్

చెన్నైకు చెందిన ఆదిత్యరామ్ గ్రూపు అధినేత, సినీ నిర్మాత ఆదిత్యరామ్‌తో కలిసి భవిష్యత్‌లో స్ట్రైట్ తమిళ చిత్రాలను నిర్మిస్తానని నిర్మాత దిల్ రాజు ప్రకటించారు. శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'గేమ్ ఛేంజర్' చిత్రం తమిళ వెర్షన్‌ను ఆదిత్యరామ్‌తో కలిసి దిల్ రాజు ఎస్వీసీ ఆదిత్యరామ్ మూవీస్ పతాకంపై నిర్మించారు. ఈ చిత్రం వివరాలను మంగళవారం ఆదిత్యరామ్ స్టూడియోలో జరిగిన విలేకరుల సమావేశంలో నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ.. 'ఈ నెల 9వ తేదీన లక్నో వేదికగా 'గేమ్ ఛేంజర్' టీజర్‌ను రిలీజ్ చేస్తున్నాం. ఆ తర్వాత అమెరికాలోని డల్లాస్, చెన్నై, జనవరి మొదటి వారంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించి, జనవరి 10న చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం. శంకర్ దర్శకత్వంలో వచ్చే సినిమాపై భారీ అంచనాలు ఉంటాయి. 'ఆర్ఆర్ఆర్' మూవీతో రామ్ చరణ్ గ్లోబల్ స్టార్‌గా మారిపోయారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంలో ఒక మంచి సామాజిక అంశంతో పాటు భారీ కమర్షియల్ హంగులు కూడా ఉన్నాయి' అని తెలిపారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

పాట్నాతో ప్రమోషన్స్‌కు శ్రీకారం



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప.. ద రూలర్'. రష్మిక హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా ఐటమ్ సాంగ్ మినహా పూర్తయిన సంగతి విదితమే. 'పుష్ప' పార్ట్ వన్‌లో 'ఊ అంటావా మావ' అనే ఐటమ్ సాంగ్ అందరినీ ఓ ఊపు ఊపేసింది. ఇప్పుడు 'పుష్ప 2' కోసం దానిని మించేలా ఓ సాంగ్ సిద్ధం చేశారు. అల్లు అర్జున్, శ్రీలీలపై బుధవారం నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. గణేశ్ ఆచార్య నృత్య దర్శకుడు. సినిమా ప్రమోషన్స్ ఈ నెల 16 నుంచి పాట్నాతో ప్రారంభిస్తున్నట్లు చిత్ర నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్ చిత్రజ్యోతికి చెప్పారు. కోల్‌కతా, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు కూడా ఆయన చెప్పారు. విడుదలకు ఇంకా నెల రోజుల వ్యవధే ఉండడంతో ప్రచార కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు రవిశంకర్ చెప్పారు. డిసెంబర్ 5న విడుదల కానున్న 'పుష్ప ద రూల్' చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ వై నిర్మిస్తున్నారు.

నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా



తెలుగు ప్రజలను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను.. ప్రతి ఒక్కరి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఉపసంహరించుకుంటున్నట్టు సినీనటి కస్తూరి తెలిపారు. 'ఈ నెల 3న తెలుగు ప్రజలను ఉద్దేశించి నేను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నాను. ఆ రోజున నేను మాట్లాడిన ముఖ్యమైన అంశం ఈ వివాదంతో మరుగునపడిపోయింది. రెండు రోజులుగా నాకు అనేక బెదిరింపులు వస్తున్నాయి. ఇవి సమస్యను మరింత తీవ్రతరం చేసేలా ఉన్నాయి. భిన్నత్వంలో ఏకత్వం ఉన్న మనదేశంలో నేను నిజమైన జాతీయవాదిని. కులమత, ప్రాంతీయభేదాలకు దూరంగా ఉండే నేను తెలుగు ప్రజలతో సత్సంబంధాలను కలిగి ఉన్నాను. ఇది నాకు లభించిన మహాభాగ్యంగా భావిస్తాను. నాయకర్‌లు, కట్టబొమ్మన్‌ల పేరు ప్రఖ్యాతులు, త్యాగరాజ కీర్తనలను వింటూ పెరిగాను. నా తెలుగు సినీ ప్రయాణాన్ని ఎంతగానో గౌరవిస్తాను. తెలుగు ప్రజలు నాకు పేరు ప్రఖ్యాతులతోపాటు మంచి ప్రేమాభిమానాలను కూడా పంచారు' అని మంగళవారం 'ఎక్స్‌'లో ఆమె పేర్కొన్నారు. కాగా, చెన్నై ఎగ్మోర్ పోలీస్‌స్టేషన్‌లో ఆమెపై నాలుగు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)


అందుకే వేడుకలా నిర్వహిస్తున్నాం

- అల్లు అరవింద్



'వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తండేల్ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించడం మాకు ఎంతో ప్రత్యేకమైన విషయం. అందుకే రిలీజ్ ప్రకటించే కార్యక్రమాన్ని ఒక వేడుకలా నిర్వహిస్తున్నాం' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. ఆయన సమర్పణలో చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. బన్నీవాస్ నిర్మాత. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్నారు. మంగళవారం చిత్రబృందం రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ 'సినిమా అంటే ఇలానే తీయాలి అనేలా 'తండేల్' ఉండబోతోంది. ఇది మామూలు సినిమా కాదు. శ్రీకాకుళంలోని కొందరు మత్స్యకారుల జీవితం, వారి కష్టం మొత్తం దేశం దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ చేసినా పండగే అవుతుంది. మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. బన్నీవాస్‌తో మరోసారి పనిచేయడం ఆనందాన్నిచ్చింది. నన్ను తెరపైన బాగా చూపించేందుకు చందు చాలా కష్టపడ్డాడు. సాయిపల్లవి సినిమాలోని అన్ని పాత్రల గురించి ఆలోచించి బాగా సపోర్ట్ చేశారు' అని చెప్పారు. సాయిపల్లవి మాట్లాడుతూ 'అల్లు అరవింద్‌గారు నన్ను సొంత కూతురిలా చూసుకుంటారు. నా సినిమా హిట్టయినా, నాకు ఏదైనా అవార్డు వచ్చినా ఆయన ఎంతో సంతోషిస్తారు. 'తండేల్' కోసం మేమంతా చాలా కష్టపడ్డాం. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది' అన్నారు. 'అక్కినేని అభిమానులందరూ కాలర్ ఎగురవేసే సినిమా ఇది. సాయిపల్లవి క్వీన్ ఆఫ్ ద బాక్సాఫీస్. ఈ చిత్రం తప్పకుండా వంద కోట్ల క్లబ్‌లో చేరుతుంది' అని బన్నీవాస్ చెప్పారు. 'తండేల్' మంచి వసూళ్లను సాధించడంతో పాటు ప్రేక్షక హృదయాలను కొల్లగొడుతుందనే నమ్మకం ఉంద'ని చందు మొండేటి తెలిపారు.

రివాల్వర్‌తో రెడీ



కీర్తిసురేశ్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'రివాల్వర్ రీటా'. జేకే చంద్రు దర్శకత్వంలో సుధన్ సుందరం, జగదీష్ పళనిస్వామి నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. చేతిలో రివాల్వర్ పట్టుకొని సీరియస్‌గా చూస్తున్న లుక్‌లో కీర్తిసురేశ్ కనిపించారు. నిర్మాత రాజేశ్ దండా ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని ఆయన తెలిపారు. రాధికా శరత్‌కుమార్ కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సీన్ రోల్డాన్.

గాయం ఇబ్బంది పెడుతోంది



టాలీవుడ్ హీరోయిన్ చాందిని చౌదరి కొన్ని రోజులుగా గాయంతో బాధపడుతున్నారు. దాంతో కొన్నాళ్లు షూటింగులకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని చాందిని స్వయంగా తన ఇన్‌స్టా అకౌంట్‌లో పోస్ట్ చేశారు. 'కొన్నాళ్ల క్రితం నాకు ఓ గాయమైంది. దాన్ని పెద్దగా పట్టించుకోకుండా షూటింగ్స్‌లో పాల్గొన్నాను. ఇప్పుడు ఆ గాయం తిరగబెట్టింది. షూట్ కోసం వెళ్తుంటే మరింత నొప్పిగా అనిపిస్తోంది. దీంతో అన్నింటికీ కొన్నాళ్లు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను' అని ఆ పోస్టులో చాందిని పేర్కొన్నారు. 'కలర్ ఫొటో' మూవీతో గుర్తింపు తెచ్చుకున్న చాందిని... గామి, మ్యూజిక్ షాప్ మూర్తి, యేవమ్ చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం బాలకృష్ణ కొత్త సినిమాలో నటిస్తున్నారు.

ఈ తరాన్ని మెప్పిస్తుంది



హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్, సోనూఠాకూర్, సుప్వేక్ష, మేఘలేఖ, కుష్బూ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్‌రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్‌కుమార్ బొజ్జం నిర్మించారు. ఈ నెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ 'నేటి తరానికి నచ్చే అంశాలతో ఈ చిత్రం తెరకెక్కింది. కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో యూత్‌ఫుల్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించాం. మా సినిమా నచ్చి అన్ని ఏరియాల డిస్ట్రిబ్యూటర్స్ మంచి రేట్లు ఇచ్చి తీసుకున్నారు' అని చెప్పారు.

సరికొత్త అనుభూతిని ఇస్తుంది

- సంజీవ్ మేగోటి



'ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేలా 'ఆదిపర్వం' చిత్రాన్ని తీర్చిదిద్దాం. ప్రతి పాత్రను తెరపైన సరికొత్త రీతిలో ఆవిష్కరించిన తీరు కట్టిపడేస్తుంది' అని దర్శకుడు సంజీవ్ మేగోటి చెప్పారు. ఆయన దర్శకత్వంలో మంచు లక్ష్మి, ఎస్తేర్, శివ కంఠమనేని ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రమిది. ఈ నెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను సంజీవ్ మేగోటి మీడియాకు వివరించారు.

- కడప దగ్గర్లోని ఎర్రగుడి నేపథ్యంలో కథ సాగుతుంది. 1974-90 మధ్య ఆ ప్రాంతంలో జరిగిన గుప్త నిధుల తవ్వకాల ఆధారంగా కథ రాసుకున్నాను. గ్రాఫిక్స్‌కు ప్రాధాన్యం ఉంటుంది. సీజీ వర్క్‌కు 11 నెలలు పట్టింది. మంచు లక్ష్మి, ఎస్తేర్ నటన సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ధూమ్ ధామ్'. సాయికిశోర్ మచ్చా దర్శకత్వంలో ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మించారు. ఈనెల 8న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల మాట్లాడుతూ 'సినిమా పాటలు చాలా బాగున్నాయి. 'రెడీ' సినిమాలా 'ధూమ్ ధామ్' కూడా బ్లాక్ బస్టర్ ఎంటర్‌టైనర్ కావాలి' అని అన్నారు. నిర్మాత రామ్‌కుమార్ మాట్లాడుతూ 'ధూమ్ ధామ్' సినిమా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, సకుటుంబంగా వచ్చి చూడాల్సిన మూవీ' అని అన్నారు.

ఎవరూ స్పృశించని కథ



ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని అంశాలతో 'రహస్యం ఇదం జగత్' చిత్రాన్ని రూపొందించినట్లు దర్శకుడు కోమల్ ఆర్ భరద్వాజ్ తెలిపారు. ఈ నెల 8న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా భరద్వాజ్ మీడియాతో ముచ్చటించారు.

- తొలి సినిమాను ఓ వైవిధ్యమైన కథతో తీయాలనుకున్నాను. అమెరికాలో శ్రీచక్రం గురించి అన్వేషణ జరిగింది. నేను ఉన్న ప్రాంతంలోనే తవ్వకాలు కూడా జరిగాయి. ఆ సంఘటనే ఈ సినిమా కథకు స్ఫూర్తినిచ్చింది.
- ఈ జగత్తు యావత్తు ఓ పెద్ద రహస్యం. అందుకే 'రహస్యం ఇదం జగత్' అనే టైటిల్ పెట్టాం. మన పూర్వీకులు, పురాణాల గురించి ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. సినిమాలోని పాత్రలు 14 లోకాలకు టైమ్ ట్రావెల్ చేసే క్రమంలో వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను అబ్బురపరుస్తాయి.

సర్కార్ సాయం లేకున్నా అటవీ గ్రామాల్లో జలవనరులు

నీటి నిల్వకు చెక్‌డ్యామ్‌లు, కుంటల నిర్మాణం.. సొంతంగా ఏర్పాటు చేసుకున్న ఆదివాసీలు

- ఎటుచూసినా పచ్చని పంటపొలాలు
- యాసంగి సీజన్‌కూ అందనున్న నీరు



అటవీ గ్రామాల్లో పచ్చగా కళకళలాడుతున్న పొలాలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బోదనెల్లి సమీపంలో నిర్మించిన కుంట



కుర్నపల్లి సమీపంలో రైతులు నిర్మించుకున్న కుంట

చర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవి అటవీ గ్రామాలు. ఆదివాసీలు నిసించే ఆ గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలు లేవు. నీటి నిల్వ కోసం ప్రభుత్వం ఎలాంటి కట్టడాలూ చేపట్టలేదు. 24 గంటల విద్యుత్ సరఫరా లేదు. సర్కారు సాగునీటి సౌకర్యాలు కల్పించకపోయినా.. గిరిజనులే సొంతంగా నీటి వనరులను ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడా ఆ గ్రామాల్లోని పంట పొలాల్లో ఎక్కడ చూసినా నీరే కనిపిస్తోంది. పుష్కలంగా పంటలు పండుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని కొన్ని అటవీ గ్రామాల్లో ఆదివాసీలు మట్టితో నిర్మించిన చెక్ డ్యాంలు, కుంటలు వ్యవసాయానికి జలవనరులుగా ఉపయోగపడుతున్నాయి. నీటి వాలును బట్టి కట్టలు కట్టి కుంటలు ఏర్పాటు చేయడంతో.. చిన్న పాటి వర్షానికే కుంటలు నిండి ప్రాజెక్టులను తలపిస్తున్నాయి. ఏడాది పాటు పంటలకు జీవం పోస్తున్నాయి. అతి తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసిన ఆ కట్టడాలు గిరిజనులను ఎంతగానో ఆదుకుంటున్నాయి. ప్రతీ ఏటా చెన్నాపురం, బత్తినిపల్లి, ఎర్రంపాడు, బక్కచింతలపాడు, కొర్కట్ పాడు, కొండెవాయి, ఎర్రబోరు, క్రాంతిపురం, కందిపాడు, ఉయ్యాల మడుగు, రామచంద్రుని కుంటతోపాటు మరికొన్ని గ్రామాల్లో 9వేల ఎకరాల్లో పత్తి, మిర్చితో పాటు వివిధ రకాల పంటలను సాగు చేస్తారు. గతంలో పంటల కోసం సరైన నీటి వసతుల్లేవు. ఈ క్రమంలో కొంతమంది గిరిజనులు తమ ఆలోచనకు పదును పెట్టి సొంతంగా పట్టా, పోడు భూముల్లో జలవనరులను సృష్టించుకున్నారు.

ఖర్చు తక్కువ.. ఫలితం ఎక్కువ

నీరు ధారాళంగా ప్రవహించే ప్రాతాల్లో మట్టితో ప్రాజెక్టు లాంటి నిర్మాణాలు చేపట్టారు. కుంటలను తవ్వారు. వాటికి నిర్మాణం అడుగు బాగాన పైపులు పెట్టి పంట పొలాలకు నీటిని మళ్లిస్తున్నారు. ఇలా మట్టితో కట్టిన కట్టల నిర్మాణానికి, కుంటలకు ఖర్చు కూడా తక్కువ అవుతుండడంతో ఆయా గ్రామాల్లోని అడవుల్లో ఇలాంటి కట్టడాలు చాలా కనిపిస్తున్నాయి. వీటి నిర్మాణం వల్ల ఈ ఏడాది పంటలు బాగానే పండాయి. ఎక్కడ చూసినా పచ్చని పైర్లు కనిపిస్తున్నాయి. ఒకసారి ఈ కుంటలు నిండితే ఏడాది వరకు పంటలకు నీరు సరిపోతుందని, యాసంగి పంట కూడా సాగు చేయవచ్చని ఆదివాసీ రైతులు చెబుతున్నారు.

బిల్డర్లకు ఏడుపొక్కటే తక్కువ

కుదేలవుతున్న నిర్మాణ రంగం.. అనాలోచిత నిర్ణయాల వల్లే ఈ దుస్థితి.. రియల్టర్ల తరఫున అసెంబ్లీలో ప్రశ్నిస్తాం: కేటీఆర్



తెలంగాణ రియల్టర్ల ఫోరం సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్ సిటీ/కవాడీగూడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): "రియల్ ఎస్టేట్ రంగం గురించి నాకంటే ఎక్కువ ఎవరికి తెలియదని రేవంత్‌రెడ్డి చెప్పిండు.. సీఎం పదవంటే గుంపు మేస్త్రీ పోస్టు అన్నడు.. ఇప్పటివరకు నిర్మాణరంగానికి మేలు జరిగే ఒక్క నిర్ణయం తీసుకోలేదు. పక్కకు తీసుకెళ్లి మాట్లాడితే బిల్డర్లు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు ఏడుపొక్కటే తక్కువ. వాళ్లు అధికారంలోకి వచ్చి 11 నెలలైంది. అభివృద్ధి ఎక్కడ..? రాష్ట్రంలో ఏంజరుగుతోంది..? 24 గంటల విద్యుత్తు సరఫరానూ అందించడంలేదు" అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ రియల్టర్ల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో నిర్వహించిన సమావేశంలో, ఆటో డ్రైవర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. "తెలంగాణ మీద అవగాహన లేని వారి అనాలోచిత చర్యలతో రాష్ట్రంలోని అన్ని రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. హైడ్రా ఒక బ్లాక్‌మెయిల్ దుకాణం. సీఎం కుర్చీ కాపాడుకోవాలంటే.. ఢిల్లీకి పైసలు పంపాలి. పంపకపోతే వాడు ఊరుకోడు. హైడ్రా పేరు చెప్పి బిల్డర్లను పిలుస్తున్నడు. బెదిరిస్తున్నడు. అందుకే మార్కెట్ ఆగమాగం జగన్నాథం. ఎవ్వరి దగ్గరా పైసల్లేవు.. రేవంత్‌రెడ్డి, ఆయన అన్న వద్ద ఉండొచ్చు' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. శక్తికి మించి పెట్టుబడులు పెట్టామని, తమ భూములు అమ్ముడుపోవడం లేదని, పరిస్థితి ఇలానే ఉంటే చిన్న బిల్డర్లు పూర్తిగా చితికిపోతారని, ఇటీవల తనను కలిసిన ఓ బిల్డర్ చెప్పారన్నారు. అనుమతులు తీసుకోవడమూ ఇప్పుడు బిల్డర్లకు కష్టంగా మారిందని, ప్రజల చేతుల్లో డబ్బులు లేకుండాపోయాయని, దీనికి కారణం ప్రభుత్వ తీరే అని విమర్శించారు. రైతుబంధు వేస్తే పన్నుల రూపంలో ఆ డబ్బు ప్రభుత్వానికే వస్తుందని, మార్కెట్లో లావాదేవీలు జరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలిచేది బీఆర్ఎస్ అని రేవంత్ రెడ్డికి తెలుసని, తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతీకార చర్యలంటూ పిచ్చి ఆలోచనలు చేయలేదని, సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టామని చెప్పారు. గతంలో బంగారం, బ్యాంకు డిపాజిట్లు చేసే వర్గాలు భూమి మీద పెట్టుబడి పెట్టడం మొదలుపెట్టాయని, ఇప్పుడు ఆ వర్గాల వాళ్లంతా ఆందోళన చెందుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ఆ పార్టీ నాయకులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, నల్లగొండలో జరిగిన ఓ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముందు కొందరు నాయకులు అసహనం వ్యక్తం చేశారన్నారు. రియల్టర్ల ఇబ్బందులపై అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని చెప్పారు. రెరాను సంప్రదిస్తూ లీగల్ ఒపీనియన్ తీసుకొని రియల్టర్ల ఫోరం మరింత బలపడాలని కేటీఆర్ సూచించారు.

ఆటో డ్రైవర్లకు నెలకు రూ.5 వేలివ్వండి

'అసెంబ్లీ ఎన్నికల ముందు హైదరాబాద్‌కు ప్రచారానికి వచ్చిన రాహుల్‌గాంధీ ఆటోలో అజారుద్దీన్‌తో కలిసి ప్రయాణించి డ్రైవర్లకు రంగుల కలలు చూపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా.. ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చింది' అని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలోని 6.5 లక్షల మంది ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందని, గతంలో ఖర్చులుపోను నిత్యం రూ.800 వరకు మిగలగా.. ఇప్పుడు రూ.200-300 గిట్టుబాటయ్యే పరిస్థితి కూడా లేదన్నారు. శాసనసభలో ఆత్మహత్యలు చేసుకున్న డ్రైవర్ల పేర్లతో సహ చెప్పామని, అయినా ప్రభుత్వం ఆదుకోలేదని మండిపడ్డారు. యేడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీని ఇప్పటికీ నెరవేర్చలేదని, మానవీయ దృక్పథంతో ప్రతి నెలా ఆటో డ్రైవర్లకు రూ.5 వేలు ఇవ్వాలని కోరారు. ఎన్ని కేసులు పెట్టినా.. జైల్లో పెట్టినా.. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడతామని కేటీఆర్ అన్నారు.

మీరూ కంట్రోల్ చేయలేదు.. ఓ డ్రైవర్ ఆందోళన

మహాధర్నాలో కేటీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో ఓ ఆటో డ్రైవర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓలా, ఊబర్ ఇతర సంస్థలు తక్కువ కమీషన్లు ఇస్తున్నాయని, ఆ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ విషయం మీ దృష్టికి తీసుకువచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. మేం మీ కోసం వచ్చాం.. అందరం కలిసి సమస్యలు పరిష్కరించుకుందాం.. మాతో పంచాయతీ పెట్టుకుంటే ఏం వస్తది. ఊరుకో అని సూచించారు. మరోవైపు.. తెలంగాణ రాష్ట్రం పిచ్చోడిచేతిలో రాయిలా మారిందని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. పాలనా దక్షతలోపం.. ఒక విజన్ లేకపోవడం, రియల్‌రంగంపై హైడ్రా వేటు.. ముందుచూపులేని నిర్ణయాలతో రాష్ట్ర ఆదాయానికి పోటు అని పేర్కొన్నారు.

అయ్యా.. నాది ఏ రాష్ట్రం?

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తును ఆన్‌లైన్ స్వీకరించలేదు. దీంతో ఆందోళనకు గురైన పృథ్వీరెడ్డి వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి వెళ్లి సంప్రదించా రు. వైస్ చాన్స్‌లర్ ఈయన సర్టిఫికెట్లను పరిశీలించి.. 12వ తరగతి వరకు విద్యాభ్యాసం ఏపీలో ఉన్నందున జీవో 148 ప్రకారం తెలంగాణ స్థానికత లేదని తెలిపారు. దీనిపై వైద్య ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖలో విచారించగా.. అక్కడా ఇదే విషయం చెప్పారు. తాను తెలంగాణలో పుట్టానని, ప్రాథమిక విద్యను ఇక్కడే చదివానని, ఎంబీబీఎస్ కూడా ఇక్కడే పూర్తి చేశానని, ఏపీలోని సైనిక్ స్కూల్లో చదివింది కూడా ఉమ్మడి రాష్ట్రంలోనేనని, తన తండ్రి తెలంగాణలో పోలీస్ శాఖలో పని చేస్తున్నారని పృథ్వీరెడ్డి చెప్పినా కుదరదన్నారు. తనకు న్యాయం చేయాలంటూ రాష్ట్రఉన్నతాధికారులతోపాటు, వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టియానాను కలిసినా ఫలితం లేకపోయింది. మరోవైపు ఏపీకి వెళితే.. ఎంబీబీఎస్ తెలంగాణలో చదివినందున పీజీకి తమ రాష్ట్ర స్థానికత ఇవ్వలేమని తెలిపారు. రాష్ట్ర విభజన జరిగిన 2014కు ముందు తాను ఏపీలో చదివానని, తనలాంటి వారంతా తెలంగాణ స్థానికత కోల్పోవాల్సిందేనా అని ప్రశ్నిస్తున్నారు. కౌన్సెలింగ్‌కు మరోరోజు మాత్రమే గడువు ఉన్నందున ప్రభుత్వమే తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

557 రోజుల్లో 50,788 ఫోన్ల రికవరీ

- డీజీపీ జితేందర్

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చోరీ అయిన లేదా పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని డీజీపీ జితేందర్ తెలిపారు. రాష్ట్రస్థాయి నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని ఆయన ఇతర అధికారులతో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా... టెలికమ్యూనికేషన్స్ విభాగం అభివృద్ధి చేసిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రర్(సీఈఐఆర్) పోర్టల్ టెక్నాలజీని మొత్తం 780 పోలీస్‌స్టేషన్లలో ఉపయోగిస్తున్నామని, దీని సాయంతో 557 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 50,788 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించామని ఆయన వివరించారు.

మహిళపై ముగ్గురి అత్యాచారం

- బట్టలు ఉతకాలని గదికి తీసుకెళ్లి దారుణం

యూసుఫ్‌గూడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బట్టలు ఉతికే పని ఉందని ఓ మహిళను నమ్మించిన ముగ్గురు యువకులు ఆమెను వారు ఉండే గదికి తీసుకెళ్లారు. ఆపై ఆమె నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ ప్రాంతానికి చెందిన 50 ఏళ్ల మహిళ హైటెక్ సిటీ ప్రాంతంలో హౌస్ కీపింగ్ పని చేస్తుంటుంది. సోమవారం సాయంత్రం పని అయిపోయాక ఇంటికి వెళ్లేందుకు ఆమె బస్ స్టాప్ వద్ద వేచి ఉంది. ఆ సమయంలో ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు తమ ఇంట్లో బట్టలు ఉతికేందుకు రావాలని, డబ్బులు ఇస్తామని ఆమెను నమ్మించారు. కార్మికనగర్ ఓంనగర్‌లో వారు ఉండే గదికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెను పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించారు. ఆమె ప్రతిఘటించటంతో దాడి చేసి, నోట్లో గుడ్డలు కుక్కారు. ఆపై ముగ్గురూ ఆమెపై అత్యాచారం చేశారు. గదిలో పెనుగులాడుతున్న శబ్దాలు విని పక్కన నివసించే ఓ మహిళ వచ్చి తలుపుకొట్టగా.. అది తెరచుకుంది. దీంతో తప్పించుకున్న బాధితురాలు నగ్నంగా బయటకు పరిగెత్తింది. వెంటనే మరో మహిళ ఆమెకు బట్టలు ఇచ్చి పోలీసులకు సమాచారం అందించింది. కాగా, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రఫీక్, చోటూ, చందూ ఇటీవల ఓంనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని పెయింటింగ్ పనులు చేస్తున్నారని పోలీసులు తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు.

రెసిడెన్షియల్ స్కూళ్లను పట్టించుకోండి

- వసతుల కల్పనలో సర్కారు విఫలం: హరీశ్
- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులకు పరామర్శ

సనత్‌నగర్/హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రెసిడెన్షియల్ స్కూళ్లలో వసతుల కల్పనలో ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను, వారి కుటుంబ సభ్యులను మంగళవారం హరీశ్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చికిత్స పొందుతున్న విద్యార్థినులు మహాలక్ష్మి, జ్యోతి, శైలజకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. కొద్దికాలంగా ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో 36 మంది విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారని చెప్పారు. ఈ మరణాలన్నీ ప్రభుత్వం చేసిన హత్యలే అనడంలో తప్పులేదన్నారు. సరాసరిగా నెలకు ముగ్గురు ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యార్థులు మరణిస్తున్నారని, ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి పెట్టాలని కోరారు. దాదాపు 600 మంది విద్యార్థులు ఈ ఏడు నెలల్లో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు శాపాలుగా మారుతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు కుటుంబ సర్వే పేరుతో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయొద్దన్నారు.ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న నమ్మకం దిగజార్చకండి అంటూ సీఎం రేవంత్‌కి బహిరంగ లేఖరాశారు. సమగ్ర కుటుంబ సర్వేకోసం ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సేవలను వినియోగించాలన్న నిర్ణయం విద్యాహక్కు చట్టం ఉల్లంఘన అవుతుందన్నారు. సర్వే విధుల నుంచి వారికి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరారు.

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- భద్రాద్రి జిల్లా రేగళ్ల పంచాయతీలో ఘటన



పంచాయతీ కార్యదర్శి కె. పుల్లయ్య

లక్ష్మీదేవిపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి విద్యుత్ కనెక్షన్ తీసుకొనేందుకు నిరభ్యంతర పత్రం ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన ఓ పంచాయతీ కార్యదర్శి ఏసీబీకి పట్టుపడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పంచాయతీలో భూక్యా లక్ష్మా అనే వ్యక్తి ఇంటికి విద్యుత్ కనెక్షన్ తీసుకోనేందుకు నిరభ్యంతర పత్రం కావాలని పంచాయతీ కార్యదర్శి కాంపాటి పుల్లయ్యను కోరాడు. అందుకు రూ.20 వేలు లంచం ఇవ్వాలని అతడు డిమాండ్ చేశాడు. లక్ష్మా రూ.18 వేలు ఇచ్చేందుకు అంగీకరించి, ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పుల్లయ్యను అదుపులోకి తీసుకున్నారు. విచారించి లంచం డిమాండ్ చేసినట్లు ఆధారాలతో నిర్ధారించుకొని అరెస్టు చేశారు.

అమ్మో... పులి!

- మంచిర్యాల డివిజన్‌లో పెద్దపులి సంచారం
- ఆవుల మందపై దాడి... మూడు ఆవుల మృతి

కాసిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెద్దపులి దాడిలో మూడు ఆవులు మృతిచెందిన ఘటన మంచిర్యాల పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఆదివారం సాయంత్రం ముత్యంపల్లి సెక్షన్ మామిడిగూడలోని గోండుగూడ ప్రాంతంలోని గిరిజన రైతుకి చెందిన ఆవుల మందపై దాడి చేసి మూడు ఆవులను చంపినట్లు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు. ఇక్కడ సంచరిస్తున్నది ఎస్12 మగ పులిగా భావిస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన పులి... కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టీ అడవుల నుంచి కవ్వాల్ టైగర్ జోన్‌లోని ఖానాపూర్, పెంబి, హాజీపూర్ అటవీ ప్రాంతానికి వచ్చినట్లు పేర్కొన్నారు. సమీప గ్రామాల ప్రజలు, పశువుల కాపర్లు అడవిలోకి వెళ్లవద్దని సూచించారు.

కాళోజీ హెల్త్‌వర్సిటీకి కొత్త వీసీ..?

- వారం రోజుల్లో కొత్త వీసీని నియమించే అవకాశం!

వరంగల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్(వీసీ) పోస్టు భర్తీపై వైద్యశాఖలో కదిలిక వచ్చింది. హెల్త్ వర్సిటీ ఏర్పడినప్పటి నుంచి ఒకే వీసీని కొనసాగించటం వివాదస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో కొత్త వీసీ నియామకం కోసం జూన్ నెలలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా.. 35 మంది అర్హులైన వైద్య ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను సెర్చ్ కమిటీ పరిశీలించాల్సి ఉండగా, మెడికల్ అడ్మిషన్ల నేపథ్యంలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు రెండు రోజుల క్రితం సెర్చ్ కమిటీ దరఖాస్తు జాబితాను వడ పోసింది. అర్హులైన ముగ్గురిని గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. వీరిలో ఒకరిని ఎంపిక చేసి గవర్నర్ ఆమోదం కోసం ప్రతిపాదన పంపించాల్సి ఉంది. గవర్నర్ ఆమోదం లభిస్తే కాళోజీ హెల్త్ వర్సిటీకి కొత్త వీసీ నియామకం పూర్తి కానుంది. వారం రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తి చేసి అవకాశం ఉందని వర్సిటీ ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు. కాగా, కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో పదేళ్లుగా ఒక్కరే వీసీగా కొనసాగుతున్నారు. 26 సెప్టెంబరు 2015లో డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డి ఆ బాధ్యతలు చేపట్టగా 2019 డిసెంబరు 31 నాటికి ఆయన పదవీకాలం ముగిసింది. వర్సిటీ నిబంధనల ప్రకారం కొత్త వీసీని నియమించే లోపు ఆరు నెలల వరకు మాత్రమే పాత వీసీకి పదవీలో కొనసాగే అవకాశం ఉంటుంది. కానీ కరుణాకర్‌రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్దల సహకారంలో సుదీర్ఘకాలంగా వీసీ కుర్చీలో సెటిల్ అయ్యారనే ప్రచారం ఉంది. ఈ క్రమంలో ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం హెల్త్ వర్సిటీ వీసీ నియామకంపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. మెడికల్ అడ్మిషన్లు పూర్తి కావస్తుండటంతో కొత్త వీసీ నియామక ప్రక్రియ వేగవంతమయింది.


డీజీపీ అఫిడవిట్‌ను పరిశీలిస్తాం

- వట్టె జానయ్య కేసులో సుప్రీంకోర్టు వెల్లడి
- తదుపరి విచారణ 3 నెలలకు వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట డీసీఎంఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మాజీ నేత వట్టె జానయ్యపై నమోదైన కేసులకు సంబంధించి డీజీపీ దాఖలు చేసిన అఫిడవిట్‌లోని అంశాలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం తనను వేధింపులకు గురిచేసిందని, అక్రమాస్తులు, నేరపూరిత బెదిరింపులు, దొంగతనం, దోపిడీలకు సంబంధించి పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసిందని వట్టె జానయ్య నిరుడు సెప్టెంబరు 20న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆరు స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై చివరగా అక్టోబరు 4న విచారణ జరిగింది. మంగళవారం మరోసారి ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ పోలీస్ తరఫు సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జానయ్యపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, తీసుకున్న చర్యల గురించి సవివరంగా అఫిడవిట్ దాఖలు చేసినట్టు తెలిపారు. వీటిని పరిశీలించి, అందులో పేర్కొన్న అంశాల అమలు తీరును పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను మూడు నెలలకు వాయిదా వేస్తున్నట్టు తెలిపింది. కాగా, గత విచారణ సందర్భంగా డీజీపీ వర్చువల్‌గా హాజరయ్యారు. అయితే, చార్జిషీట్ దాఖలు చేసిన తేదీల గురించి కూడా ప్రభుత్వ న్యాయవాదులు స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ప్రభుత్వ న్యాయవాది వాదనలలో తప్పులకు ఎవరు బాధ్యత వహిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. అధికారుల పొరపాటు వల్ల చార్జిషీట్లలో తేదీలను పేర్కొనలేదని, ఇకపై పునరావృతం కానివ్వబోమని, సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని డీజీపీ తెలిపారు. ఈ సమాధానంతో సంతృప్తి చెందని ధర్మాసనం.. స్పష్టమైన వివరాలతో నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు జానయ్య కేసులపై డీజీపీ అఫిడవిట్ దాఖలు చేశారు.

ప్రజావాణితో ఫలించిన 46 ఏళ్ల నిరీక్షణ

- పాసుపుస్తకం కోసం 1978 నుంచి ఎదురుచూపు
- ప్రజావాణి ద్వారా 100 రోజుల్లోనే తీరిన రైతు కష్టం



రైతు పిచ్చయ్యకు పాసుబుక్‌ను అందజేస్తున్న డా. చిన్నారెడ్డి, దివ్య

బేగంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తనకున్న ఒక ఎకరం సాగు భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం కోసం నలభై ఆరేళ్లగా ఎదురుచూస్తున్న ఓ రైతు నిరీక్షణ ఎట్టకేలకు ప్రజావాణి ద్వారా ఫలించింది. నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన పిచ్చయ్య అనే రైతుకు స్వగ్రామంలోని సర్వే నం.215/3లో ఒక ఎకరం భూమి ఉంది. దాని పట్టాదారు పాసుపుస్తకం కోసం 1978 నుంచి రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకుని అప్పటి నుంచి తిరుగుతున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏర్పాటు చేసిన ప్రజావాణి గురించి తెలుసుకున్న పిచ్చయ్య గత జూలైలో ప్రజావాణిలో పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే దరఖాస్తు చేసుకున్న వంద రోజుల్లోనే పాసుపుస్తకం పిచ్చయ్య చేతికి అందింది. మంగళవారం మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన పిచ్చయ్య.. తనకు వచ్చిన పట్టాదారు పాసుపుస్తకాన్ని ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యలకు చూపించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ.. ప్రజావాణి వల్ల అనతి కాలంలోనే తన కష్టం తీరిపోయిందన్నారు. కాగా, ప్రజావాణిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం మంగళవారం 1031 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

కలుషితాహార ఘటనపై విచారణ

- నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం
- మంత్రి పొన్నంతో కలిసి నిమ్స్‌లో వాంకిడి
- గిరిజన గురుకుల విద్యార్థినులకు పరామర్శ



నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ

హైదరాబాద్ సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కలుషితాహారం తినడంతో అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన గురుకుల విద్యార్థినులు మహాలక్ష్మి, జ్యోతి, శైలజను మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి.. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ విద్యార్థినులు ఇంటి నుంచి తెచ్చుకున్న తినుబండారాలు తినడం వల్లే అస్వస్థతకు గురయ్యే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారన్నారు. హాస్టల్‌లో అదే ఆహారాన్ని తిన్న సిబ్బంది ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నారని చెప్పారన్నారు. ఆహార పదార్థాలను పరీక్షకు పంపారని, ఆ నివేదిక వచ్చిన తర్వాత ఈ ఘటనకు బాధ్యులు అధికారులని తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పా రు. విద్యార్థినులను పరామర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు ఏదో సాకు దొరికింది కదా అని ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని సురేఖ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక హాస్టళ్ల నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్నామన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిమ్స్ డైరెక్టర్‌కు ఫోన్ చేసి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మహాలక్ష్మి, జ్యోతి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, శైలజకు వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందిస్తున్నామని నిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

వాంకిడిపై రాజకీయం చేయొద్దు: సీతక్క

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ ఘటనను రాజకీయం చేయటం తగదని, ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవటం ఆపాలని మంత్రి సీతక్క అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన విమర్శలను ఆమె ఖండించారు. బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

ఆహార నాణ్యతపై ఫిర్యాదులకు..

కలెక్టరేట్లలో ప్రత్యేక విభాగం

- నిబంధనలు పాటించని హోటళ్లపై కఠిన చర్యలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- భద్రకాళి ఆలయానికి భోగ్ సర్టిఫికెట్ అందజేత



హోటల్ నిర్వాహకులకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న మంత్రి దామోదర

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆహార నాణ్యతకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం కలెక్టరేట్లలోనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. మంగళవారం వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో రాష్ట్ర ఆహార భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీధుల్లో చిరుతిళ్లు అమ్మే వ్యాపారులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో దామోదర మాట్లాడారు. ప్రతి హోటల్, రెస్టారెంట్, ఫుడ్ స్టాల్, హాస్టల్, హాస్పిటల్, ఆఫీసులలో ఉండే క్యాంటీన్లను అధికారులు తనిఖీలు చేస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయన్నారు. హోటళ్లు, జనాభా సంఖ్యకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల సంఖ్యను పెంచబోతున్నామని వెల్లడించారు. నాచారం ఫుడ్ సేఫ్టీ ల్యాబ్‌ను ఆధునీకరిస్తున్నామని, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో కొత్తగా మూడు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇవిగాక మరో 5 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్‌ను తీసుకొస్తున్నామన్నారు. సంవత్సరానికి కనీసం 24 వేల ఆహార పదార్థాల నమూనాలను పరీక్షించేలా ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కాగా, వరంగల్‌లోని భద్రకాళి దేవస్థానానికి, హైదరాబాద్‌లోని శ్రీ జయలక్ష్మి మాతా యోగా సెంటర్ ట్రస్టుకు మంత్రి దామోదర రాజనర్సింహ భోగ్ సర్టిఫికెట్‌ను అందజేశారు. అత్యంత శుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని తయారు చేసే దేవస్థానాలు, మందిరాలకు ఈ సర్టిఫికెట్ ఇస్తారు.


సుహాస్


రాజా కృష్ణమూర్తి


ప్రమీల


రో ఖన్నా

అమెరికా ఎన్నికల బరిలో 'భారతపౌరులు'

9 మంది భారతీయ అమెరికన్లు పోటీ

వాషింగ్టన్, నవంబరు 5: అమెరికా ప్రతినిధులసభ ఎన్నికల్లో భారత సంతతి పౌరులు తమ సత్తా చాటుతున్నారు. మొత్తం 9 మంది భారతీయ అమెరికన్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీరిలో ఐదుగురు సీనియర్ నాయకులు మరోసారి బరిలో నిలిచారు.

సుహాస్ సుబ్రమణ్యన్(38): డెమొక్రాటిక్ అభ్యర్థిగా వర్జీనియా(10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి బరిలో ఉన్నారు. ప్రస్తుతం వర్జీనియా రాష్ట్ర సెనేటర్‌గా వ్యవహరిస్తున్నారు. డెమొక్రాట్లకు బలమైన రాష్ట్రంగా పేరున్న వర్జీనియా నుంచి విజయం దక్కించుకుంటే ఇక్కడి నుంచి గెలిచిన తొలి ఇండియన్ అమెరికన్‌గా సుబ్రమణ్యన్ రికార్డు సృష్టిస్తారు. గతంలో అధ్యక్షుడు ఒబామాకు వైట్ హౌస్ సలహాదారుగా కూడా సుహాస్ ఉన్నారు.

డాక్టర్ అమిబెరా(59): వైద్య వృత్తిలో ఉన్న అమిబెరా సీనియర్ మోస్ట్ ఇండియన్ అమెరికన్ చట్టసభ సభ్యుడు. కాలిఫోర్నియా(6వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి ఆయన పోటీ చేస్తున్నారు. 2013 నుంచి ఆయన విజయం సాధిస్తున్నారు. ఈసారి డెమొక్రాట్లు ప్రతినిధుల సభలో మెజారిటీ దక్కించుకుంటే డాక్టర్ బెరాకు కీలక పదవి దక్కనుంది.

ప్రమీలా జయపాల్(59): డెమొక్రాటిక్ పార్టీలో బలమైన నాయకురాలు. వాషింగ్టన్(7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి మరోసారి ఆమె అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆమె విజయం ఖాయమనే చర్చసాగుతోంది.

రాజా కృష్ణమూర్తి(51): డెమొక్రాటిక్ పార్టీకి చెందిన బలమైన నాయకుడు. 2017 నుంచి ఆయన చట్టసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇల్లినాయిస్(8వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి మరోసారి పోటీ చేస్తున్నారు.

రో ఖన్నా(48): 2017 నుంచి కాలిఫోర్నియా(17వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పుడు కూడా ఇక్కడే బరిలో ఉన్నారు.

శ్రీథానేదార్(69): మిచిగాన్(13వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి పోటీ చేస్తున్నారు. ఈయన 2023 నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా, ఈ ఆరుగురి గెలుపు ఖాయమని, వారి విజయం నల్లేరుపైనడకేనని పరిశీలకులు చెబుతున్నారు. మరోవైపు, అరిజోనా రాష్ట్ర అసెంబ్లీకి వరుసగా మూడు సార్లు(2018, 2020, 2022) ఎన్నికైన డాక్టర్ అమిష్ షా ప్రస్తుతం అరిజోనా(1వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి ప్రతినిధుల సభకు డెమొక్రాటిక్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు. ఇక్కడ నుంచి వరుసగా ఏడుసార్లు విజయం దక్కించుకున్న రిపబ్లికన్ అభ్యర్థి డేవిడ్ స్క్వైకెర్ట్‌తో అమిష్ తలపడుతుండడం గమనార్హం. రిపబ్లికన్ పార్టీకి చెందిన డాక్టర్ ప్రశాంత్ రెడ్డి కాన్సాస్(3వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి బరిలో ఉన్నారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన డాక్టర్ రాకేశ్ మోహన్ న్యూజెర్సీ(3వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి బరిలో నిలిచారు. కాగా, డాక్టర్ ప్రశాంత్ రెడ్డి, డాక్టర్ రాకేశ్ మోహన్‌లకు గెలుపు అవకాశాలు స్వల్పంగా ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

స్థానిక సంస్థల్లోనూ భారత సంతతి!

అమెరికాలోని స్థానిక సంస్థలు, రాష్ట్రాల చట్టసభల ఎన్నికల్లోనూ భారత సంతతి పౌరులు తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. దాదాపు 36 మందికిపైగా ఈ ఎన్నికల్లో తలపడుతున్నారు. అమెరికాల్లో అత్యంత స్వల్పంగా ఉన్న భారత సంతతి పౌరులు ఇలా కీలక ఎన్నికల్లో తలపడుతున్న పరిస్థితి.. వారికి అగ్రరాజ్యం ఎన్నికలపై ఉన్న ఆసక్తిని చాటి చెబుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. కాలిఫోర్నియా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎక్కువ మంది భారత సంతతి పౌరులు పోటీ పడుతున్నారని తెలిపారు. కాలిఫోర్నియాలో దాదాపు 9 లక్షల మంది భారతీయ అమెరికన్లు నివసిస్తున్నారు.

కమల గెలిస్తే చరిత్రే!

(మొదటి పేజీ తరువాయి)




చార్లెట్‌లో ఓ పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తున్న అమెరికా పౌరులు

పూర్తవ్వగానే కౌంటింగ్ ప్రారంభమవుతుంది. అయితే.. ముందెన్నడూ లేనివిధంగా సర్వేల అంచనాల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కంటే.. డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హ్యారిస్ మధ్య 'నువ్వా-నేనా' అన్నట్లుగా పోటీ కొనసాగింది. తుది సర్వేల్లో మాత్రం కమల స్వల్పంగా ముందంజలో ఉన్నారు. అమెరికా ఎన్నికల్లో అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించే స్వింగ్ రాష్ట్రాల్లో గత నెలాఖరు వరకు కమల వైపు.. ఆ తర్వాత ట్రంప్ వైపు ఓటర్లు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్న సర్వేలు.. ఆదివారం అర్ధరాత్రి విడుదల చేసిన తాజా నివేదికల్లో కమల స్వల్ప ఆధిక్యాన్ని సాధిస్తారని తేల్చేశాయి. ఇక అమెరికా ఎన్నికల విషయంలో అభినవ నాస్ట్రడమస్‌గా పేరున్న అలన్ లిచ్‌మన్ కూడా.. ఈ సారి కమలాహ్యారిస్ విజయం తథ్యమని జోస్యం చెప్పారు. 1984 నుంచి ఆయన అంచనాలు 100% నిజమవుతూ వస్తుండడం గమనార్హం..!

తొలి మహిళగా..

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమల ఘనవిజయం సాధించి.. వైట్‌హౌస్‌కు వెళ్తే.. అదో చరిత్ర అని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా చరిత్రలోనే తొలి మహిళా అధ్యక్షురాలిగా ఆమె నిలిచిపోతారంటున్నారు. అంతేకాదు.. ఆఫ్రికా-ఆసియా సంతతికి చెందిన తొలి మహిళా అధ్యక్షురాలు కూడా ఆమేనని వివరిస్తున్నారు. గత నెలాఖరు వరకు సింహభాగం సర్వేలు కమల వైపే ఉండగా.. ఈనెల 1-3 తేదీల్లో మాత్రం స్వింగ్ రాష్ట్రాల్లో ట్రంప్ గాలి వీస్తోందని వెల్లడించాయి. సోమవారం అర్ధరాత్రి విడుదలైన తాజా సర్వేల్లో కమల అనూహ్యంగా పుంజుకున్నారు. పోలింగ్ గురు నేట్ సిల్వర్‌కు చెందిన ఫైవ్‌థర్టీఎయిట్ తుది సర్వే ఫలితాల్లో స్వింగ్ రాష్ట్రాల్లో కమల పుంజుకున్నారని, అయితే.. అంచనాలు క్లిష్టంగా ఉన్నాయని వెల్లడైంది. అయితే.. కమల విజయావకాశాలు 50.015శాతంగా ఉన్నట్లు ఈ సర్వే స్పష్టం చేసింది. అదే సమయంలో ట్రంప్ విజయావకాశాలు 49.985శాతానికి దిగజారాయని.. పోటీ మాత్రం హోరాహోరీగా ఉందని పేర్కొంది. తటస్థ ఓటర్లే విజేతల నిర్ణేతలని అభిప్రాయపడింది. పీబీఎస్ న్యూస్-ఎన్‌పీఆర్-మారిస్ట్ సర్వే కూడా కమల 51% విజయావకాశాలతో ముందంజలో ఉన్నట్లు తెలిపింది. ది హ్యారిస్ ఎక్స్-ఫోర్బ్స్ నిర్వహించిన సర్వేలో కమల ముందంజలో ఉన్నట్లు తేలింది. ఆమెకు 49%, ట్రంప్‌నకు 48% మంది మద్దతు తెలిపినట్లు వివరించింది. యాహూ న్యూస్-యూగావ్ కూడా ఇరువురికి చెరో 47% చొప్పున విజయావకాశాలివ్వగా.. మార్నింగ్ కన్సల్ట్, ఎకానమిస్ట్-యూగావ్ సర్వేలు కమలకు 49%, ట్రంప్‌నకు 46% మంది మద్దతున్నట్లు వెల్లడించాయి. రియల్‌క్లియర్ పోలింగ్ సర్వే మాత్రం ట్రంప్ 219 స్థానాల్లో.. కమల 211 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారని పేర్కొంది.

ట్రంప్ న్యాయపోరాటానికి.. 5 వేల మంది లాయర్లు

2020 మాదిరిగా ఫలితాలు తనకు ప్రతికూలంగా వస్తే.. న్యాయపోరాటం చేయాలని ట్రంప్ నిర్ణయించారు. అప్పట్లో ఆయన బైడెన్ ఎన్నిక చెల్లదని, తాను అధికార పీఠం నుంచి దిగేది లేదని భీష్మించుకున్నారు. అయితే.. న్యాయస్థానంలో సరైన ఆధారాలు లేనందున.. జడ్జి ఆయన వ్యాజ్యాన్ని కొట్టివేశారు. ఈసారి అలా జరగకుండా ఉండేందుకు 5 వేల మంది న్యాయవాదులను ట్రంప్ నియమించుకున్నారు.


తెల్లవారుజామునే పోలింగ్ షురూ

అమెరికా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ మంగళవారం ఆయా రాష్ట్రాల నైసర్గిక స్వరూపం, ఆరు కాలమానాల ఆధారంగా వేర్వేరు సమయాల్లో ప్రారంభమైంది. అమెరికాలో హవాయి, అలస్కా, పసిఫిక్, మౌంటైన్, సెంట్రల్, ఈస్టర్న్ అనే ఆరు కాలమానాలున్నాయి. వీటిల్లో హవాయి-ఈస్టర్న్ కాలమానాల మధ్య వ్యత్యాసం 5 గంటలు. కొన్ని రాష్ట్రాల్లో తెల్లవారుజామున 5 గంటలకు పోలింగ్ ప్రారంభమవ్వగా.. అక్కడి ఓటర్లు 4 గంటల నుంచే క్యూలైన్లలో నిలబడ్డారు. మరికొన్ని రాష్ట్రాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల మధ్యలో పోలింగ్ మొదలైంది. ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొనగా.. పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.


ఫలితాలు ఎప్పుడు?

అమెరికాలో పోలింగ్ సమయం పూర్తయిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. భారత్ మాదిరిగా అమెరికాలో ఏకకేంద్ర ఎన్నికల కమిషన్ ఉండదు. రాష్ట్రాల వారీగా వేర్వేరుగా ఎన్నికల ఏజెన్సీలుంటాయి. దీంతో.. లెక్కింపులో కొన్ని చోట్ల ఆలస్యం జరగడం సాధారణమే. మంగళవారం అర్ధరాత్రికి సింహభాగం రాష్ట్రాల్లో ఫలితాలు తేలిపోతాయి. అయితే.. కొన్ని రాష్ట్రాల ఫలితాలకు బుధవారం మధ్యాహ్నం వరకు సమయం పడుతుందని అంచనా. అంతేకాదు.. బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక.. మెయిల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఆ తర్వాతే మిలటరీ బ్యాలెట్ల లెక్కింపు ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఈ ప్రక్రియలో ఆలస్యం జరిగే అవకాశాలున్నాయి. దాంతో.. ఈ నెల 7 వరకు ఫలితాల కోసం ఉత్కంఠ కొనసాగవచ్చనే అంచనాలున్నాయి. అమెరికాలో 24.5 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. ముందస్తు ఓటింగ్‌లో 8.2 కోట్ల మంది వినియోగించుకున్నారు.

కమలా హ్యారిస్ గెలుపుకోసం తమిళనాట పూజలు



చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కమలాహ్యారిస్ ఘనవిజయం సాధించాలని కోరుకుంటూ ఆమె పూర్వీకుల స్వస్థలమైన తమిళనాడులోని తిరువారూరు జిల్లా తులసేంద్రపురం ఆలయంలో స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరిలోని వారందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. కమలాహ్యారిస్ ఫోటోలు ముద్రించిన పోస్టర్లను ఊరంతా అతికించి సందడి చేశారు. కమల తల్లి వైపు తాతముత్తాతలంతా తులసేంద్రపురానికి చెందినవారు. ఈ కారణంగానే అక్కడి ధర్మశాస్తా ఆలయంలో గత రెండు రోజులుగా కమలా హ్యారిస్ అమెరికా అధ్యక్షపీఠాన్ని అధిరోహించాలని కోరుకుంటూ గ్రామస్థులు ప్రత్యేక ప్రార్థనలు కూడా జరిపారు. మదురై జిల్లాలోని పలు ప్రాంతాల్లో కమల గెలుపును కాంక్షిస్తూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తొలి ఫలితం 50:50

కేవలం ఆరుగురు ఓటర్లున్న న్యూహ్యాంప్‌షైర్ రాష్ట్రంలోని డిక్స్‌విల్లే నాచ్‌లో మంగళవారం ఉదయమే ఫలితం విడుదలైంది. అమెరికా-కెనడా సరిహద్దుల్లోని ఈ ప్రాంతంలో.. అర్ధరాత్రి దాటగానే పోలింగ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ ఓటర్లలో ముగ్గురు కమలకు.. మరో ముగ్గురు ట్రంప్‌నకు జైకొట్టారు. 2020లో మాత్రం వీరంతా డెమొక్రటిక్ అభ్యర్థి జోబైడెన్‌కు ఓటేశారు. నిజానికి ఈ ప్రాంతంలో ఉన్న ఆరుగురు ఓటర్లలో నలుగురు రిపబ్లికన్ పార్టీ మద్దతుదారులుగా నమోదు చేసుకున్నారు. మరో ఇద్దరు ఏ పార్టీ తరఫున లేనట్లు చెప్పారు. అయితే.. ట్రంప్ మద్దతున్న నలుగురిలో ఒకరు క్రాస్ ఓటింగ్ వేసినట్లు ఇక్కడి ఫలితాలను బట్టి అర్థమవుతోంది. ఇలా చివరి నిమిషంలో మనసు మార్చుకునే ఓటర్ల వల్ల తమకే లబ్ధి చెందుతుందని కమల మద్దతుదారులు భావిస్తున్నారు.

మంగళవారమే ఎందుకు?

అమెరికా అధ్యక్ష ఎన్నికలు గడిచిన 170 సంవత్సరాలుగా మంగళవారాల్లోనే జరుగుతుంటాయి. ఇందుకు కారణాలున్నాయి. 1845కు ముందు వరకు కూడా రాష్ట్రాలు వేర్వేరుగా.. వేర్వేరు రోజుల్లో ఎన్నికలను నిర్వహించేవి. దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతుండడంతో.. 1845 నుంచి నవంబరు నెలలో మొదటి మంగళవారం(ఒకటో తేదీ అయ్యి ఉండకూడదు. ఒకవేళ ఒకటో తేదీ మంగళవారం అయితే.. మొదటి సోమవారం తర్వాతి రోజు నిర్వహిస్తారు) దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం 1792 నాటి ఫెడరల్ చట్టాన్ని సవరించారు. 1845లో చట్టసవరణ జరిగిన నాటికి అమెరికా ఓ వ్యవసాయ దేశం. నవంబరు కల్లా పంటచేతికి వచ్చి, రైతులు ఖాళీగా ఉండే సమయం కావడంతో.. ఈ నెలలో పోలింగ్‌ను నిర్వహించాలనే సంప్రదాయాన్ని పరిచయం చేశారు. అయితే.. ఇటీవలి కాలంలో మంగళవారాల్లో కాకుండా.. వారాంతాల్లో ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ పెరుగుతోంది.

అన్నీ కుదరదు

(మొదటి పేజీ తరువాయి)

సభ్యుడైన జస్టిస్ వీఆర్ కృష్ణ అయ్యర్ మాత్రం వ్యతిరేక తీర్పు ఇచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులన్నింటినీ ప్రజల సంక్షేమం, ప్రయోజనాల కోసం స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని చెప్పారు. అయితే 1982, 1997ల్లో సంజీవ్ కోక్, మఫత్‌లాల్ ఇండస్ట్రీస్ కేసులను విచారించిన సుప్రీం రాజ్యాంగ ధర్మాసనాలు జస్టిస్ అయ్యర్ అభిప్రాయాలపై ఆధారపడి తీర్పులు ఇచ్చాయి. ఈ నేపథ్యంలో అన్ని ప్రైవేటు ఆస్తులను ఉమ్మడి ప్రయోజనాల కోసం స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంటుందా? అనే అంశంపై 9 మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. తాజా ధర్మాసనంలో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు న్యాయమూర్తులు హృషికేశ్‌రాయ్, బీవీ నాగరత్న, సుధాన్షు ధులియా, జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రా, రాజేశ్ బిందాల్, సతీశ్‌చంద్ర శర్మ, ఏజీ మాసీహ్‌లు ఉన్నారు. జస్టిస్ సుధాన్షు ధులియా మాత్రం ఈ తీర్పును వ్యతిరేకించారు. జస్టిస్ బీవీ నాగరత్న మెజారిటీ సభ్యుల తీర్పును పాక్షికంగా వ్యతిరేకించారు. అదేసమయంలో జస్టిస్ కృష్ణ అయ్యర్‌పై సీజేఐ చేసిన వ్యాఖ్యల పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. జస్టిస్ ధులియా కూడా సీజేఐ వ్యాఖ్యలు సరికాదని చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 39(బి) ప్రకారం.. ప్రైవేటు వ్యక్తుల ఆస్తులను సమాజ వనరులుగా పరిగణించవచ్చా? అన్న కీలక కేసుపై కొద్ది నెలల క్రితం సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ఏ ప్రైవేటు ఆస్తి సమాజ వనరు కాదు. అన్ని ప్రైవేటు ఆస్తులూ సమాజ వనరులే.. ఈ రెండూ విధానాలూ పరస్పరం భిన్నమైనవి. వీటిపై ప్రస్తుత పరిస్థితులు, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమకాలీన వ్యాఖ్యానం చేయాల్సిన అవసరం ఉంది" అని అభిప్రాయపడింది. "1950ల్లో భారతదేశాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు వ్యాఖ్యానం చేయకూడదు. అప్పుడు ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటు జరుగుతోంది. ఇప్పుడు ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరిస్తున్నారు. ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా న్యాయస్థానం వ్యాఖ్యలు ఉండాలి. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలి" అని ధర్మాసనం పేర్కొంది. తాజాగా ఈ వ్యాఖ్యలను పునరుద్ఘాటిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసు ఆర్టికల్ 31(సి)కి సంబంధించినదని.. ప్రభుత్వ విధానాల అమలు కోసం చేసే చట్టాలకు ఇది రక్షణ కల్పిస్తుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆర్టికల్ 31(సి) రక్షణ పరిధిలోకి ఆర్టికల్ 39(బి) కూడా వస్తుందని తెలిపింది. సామాజిక ఆస్తులను ఉమ్మడి ప్రయోజనాల కోసం అత్యుత్తమ రీతిలో వినియోగించేలా ప్రభుత్వం తన విధానాలను రూపకల్పన చేయాలని ఆర్టికల్ 39(బి) నిర్దేశిస్తోంది. అయితే ఆర్టికల్ 39(బి)లో పేర్కొన్నట్లుగా సామాజిక ఆస్తులంటే ప్రైవేటు యాజమాన్యంలోనివి కూడానా? అంటే.. సిద్ధాంతపరంగా అవుననే సమాధానమే వస్తుందని సీజేఐ పేర్కొన్నారు. కానీ, ఈ విషయాన్ని వివరించడంలో జస్టిస్ అయ్యర్ విఫలమయ్యారన్నారు. ప్రైవేటు ఆస్తులపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని చెప్పే మొండి ఆర్థిక సిద్ధాంతమే రాజ్యాంగబద్ధ ప్రభుత్వానికి ఆధారమని జస్టిస్ కృష్ణ అయ్యర్ పేర్కొనడం సరికాదని జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. ఆయన సిద్ధాంతం రాజ్యాంగ విశాల స్ఫూర్తికి విరుద్ధం, హానికరమని వ్యాఖ్యానించారు. వ్యక్తులకు చెందిన ప్రతి ఆస్తినీ సామాజిక ఆస్తిగా పరిగణించకూడదని.. ప్రజాప్రయోజనాలకు అవసరమైన దాన్ని మాత్రమే సేకరించాలని స్పష్టం చేశారు. ఆర్టికల్ 39(బి)ని పరిస్థితులకు అనుగుణంగా వినియోగించుకోవాలన్నారు. తమ ఆస్తులు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని సవాలు చేస్తూ మహారాష్ట్రకు చెందిన ప్రాపర్టీస్ ఓనర్స్ అసోసియేషన్(పీవోఏ) 1992లో పిటిషన్ దాఖలు చేసింది.

సీజేఐ వ్యాఖ్యలు అవాంఛనీయం

ప్రైవేటు ఆస్తుల విషయంలో సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం తీర్పుతో జస్టిస్ బీవీ నాగరత్న పాక్షికంగా విభేదించారు. అయితే జస్టిస్ అయ్యర్‌పై సీజేఐ వ్యాఖ్యలు సరికాదన్నారు. ఈ మేరకు ఆమె విడిగా రాసిన 130 పేజీల తీర్పులో పలు వ్యాఖ్యలు చేశారు. నాటి(1977లో) పరిస్థితులకు అనుగుణంగా జస్టిస్ అయ్యర్ ప్రభుత్వ విధానాలకు విస్తృత ప్రాధాన్యమిచ్చి, ప్రైవేటు ఆస్తుల సేకరణపై ప్రభుత్వానికి హక్కు ఉంటుందని తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. ఆయన మానవతావాది అని, క్రిమినల్ జస్టిస్‌లో చేపట్టిన సంస్కరణలు ఎనలేనివని తెలిపారు. 'బెయిల్ అనేది నిబంధన.. జైలు అనేది మినహాయింపు' అనేది జస్టిస్ అయ్యర్ చేసిన వ్యాఖ్య అని.. దాన్ని ఇప్పటికీ సుప్రీంకోర్టు జడ్జిలు అనుసరిస్తున్నారని గుర్తుచేశారు. ఆయన ఆర్థిక సిద్ధాంతం రాజ్యాంగ విశాల స్ఫూర్తికి హానికరమన్న సీజేఐ వ్యాఖ్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలు 1991 నుంచి మారినంత మాత్రాన అంతకుముందున్న సుప్రీం జడ్జిలు రాజ్యాంగ స్ఫూర్తికి హాని కలిగించారని నిందించడం సరికాదని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.



మదర్సాలకు ఊరట

యూపీ మదర్సా చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, నవంబరు 5: మదర్సాల్లో నాణ్యమైన విద్యను బోధించేలా, అర్హులైన ఉపాధ్యాయులను నియమించేలా, పరీక్షలు నిర్వహించేలా చూసేందుకు యూపీ సర్కారు 2004లో రూపొందించిన 'ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్ 2004' రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. రాజ్యాంగంలోని 14, 21ఏ అధికరణలకు, లౌకిక సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ గతంలో అలహాబాద్ హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టేస్తూ ఇచ్చిన తీర్పును తోసిపుచ్చింది. విద్య నాణ్యతను నియంత్రించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని.. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాతో కూడిన ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ చట్టం రాష్ట్రప్రభుత్వ శాసనాధికార పరిధిలోనే ఉందని స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఉమ్మడి జాబితాలోని అంశాల్లో 25వది విద్య అని గుర్తుచేసింది. అయితే.. మదర్సాల్లో ఉన్నతవిద్యకు సంబంధించి ఇచ్చే 'ఫాజిల్(డిగ్రీతో సమానం)', 'కామిల్ (పీజీతో సమానం)' మాత్రం యూజీసీ చట్టానికి, కేంద్ర జాబితాలోని 66వ అంశానికి విరుద్ధమని, కాబట్టి వాటిని రాజ్యాంగ విరుద్ధంగా పరిగణించవచ్చని వ్యాఖ్యానించింది. 2004లో యూపీ సర్కారు చేసిన ఈ చట్టం కింద.. ఉత్తరప్రదేశ్‌లోని ఒక మదర్సాలో పార్ట్‌టైమ్ అసిస్టెంట్ టీచర్‌గా చేరిన మహ్మద్ జావేద్ అనే వ్యక్తి.. తన సర్వీసును క్రమబద్ధీకరించాలంటూ 2019లో అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాడు. అతడి పిటిషన్‌ను విచారించిన సింగిల్ జడ్జి.. లౌకిక రాజ్యాంగాన్ని అనుసరిస్తున్న దేశంలో, విద్య కోసం ఏర్పాటు చేసిన బోర్డులో ఒక నిర్దీత మతానికి చెందిన వ్యక్తులను మాత్రమే నియమించడమేమిటనే ప్రశ్న లేవనెత్తి, ఈ పిటిషన్‌ను విస్తృత ధర్మాసనానికి రిఫర్ చేశారు. దీనిపై అలహాబాద్ హైకోర్టు సీజే ఇద్దరు సభ్యుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలోనే.. అసలు ఈ మదర్సా చట్టమే రాజ్యాంగ విరుద్ధమంటూ అన్షుమాన్ సింగ్ రాథోడ్ అనే అడ్వొకేట్ హైకోర్టులో ఒక పిటిషన్ వేశారు. ఆ పిటిషన్లన్నింటినీ కలిపి విచారించిన ద్విసభ్య ధర్మాసనం.. మదర్సా చట్టం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ దాన్ని కొట్టేసింది. "మతపరమైన విద్య కోసం (లేదా) ఒక ప్రత్యేకమైన మతం/విధానానికి సంబంధించిన పాఠశాల విద్య కోసం బోర్డును ఏర్పాటు చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదు" అని తీర్పులో పేర్కొంది. రాష్ట్రంలోని 16 వేలకు పైగా మదర్సాల్లో విద్యాభ్యాసం చేస్తున్న 17 లక్షల మంది విద్యార్థులను సాధారణ పాఠశాలల్లో చేర్చాలని సూచించింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ పలువురు వ్యక్తులు, పలు సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. కాగా.. మదర్సా చట్టాన్ని వ్యతిరేకిస్తూ 'జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్సీపీసీఆర్)' కూడా ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యింది. నాణ్యమైన విద్యను మదర్సా ఎడ్యుకేషన్ తిరస్కరిస్తోందని వాదించింది. మతపరమైన విద్యను అభ్యసించే హక్కు ఎవరికైనా ఉందని.. కానీ, ఆ విద్యను ప్రధాన స్రవంతి విద్యకు ప్రత్యామ్నాయంగా మాత్రం అంగీకరించకూడదని పేర్కొంది. ఇక.. సుప్రీం తీర్పును ముస్లిం మత సంస్థలకు చెందిన పెద్దలు, బీఎస్పీ అధినేత్రి మాయావతి, సమాజ్‌వాదీ పార్టీ నేతలు స్వాగతించారు.

25 నుంచి పార్లమెంటు సమావేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబరు 25 నుంచి డిసెంబరు 20 వరకు జరగనున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ సమావేశాల్లో భాగంగా రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. సంవిధాన్ సదన్(పార్లమెంట్ పాత భవనం) సెంట్రల్ హాల్ ఇందుకు వేదిక కానుందని వెల్లడించారు. 18వ లోక్‌సభ ఏర్పడిన తర్వాత ఇవి మొదటి శీతాకాల సమావేశాలు. జూలై 22 నుంచి ఆగస్టు 9 వరకు మొదటి వర్షాకాల సమావేశాలు జరిగాయి. ప్రస్తుతం.. మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. 20న పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఆ తర్వాతే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే కేంద్రం ఒకే దేశం-ఒకే ఎన్నిక, వక్ఫ్ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు తెలిసింది. గత సమావేశాల్లోనే కేంద్రం వక్ఫ్ బిల్లును తీసుకువచ్చింది. అయితే.. భాగస్వామ్య పక్షాలు, విపక్ష పార్టీల డిమాండ్ల మేరకు సమగ్ర చర్చకుగాను బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి పంపేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. కాగా, ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయాలని, దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహించాలని ఈ సమావేశాల్లో ప్రతిపక్షాలు డిమాండ్ చేసే అవకాశం ఉంది.

మళ్లీ 'భారత్' బ్రాండ్ అమ్మకాలు

» గోధుమ పిండి కేజీ రూ.30, బియ్యం కేజీ రూ.34

న్యూఢిల్లీ, నవంబరు 5: భారత్ బ్రాండ్ కింద రెండో దశ సరుకుల విక్రయాలను కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రారంభించింది. ఇందులో భాగంగా నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్, ఈ కామర్స్ సంస్థల ద్వారా గోధుమ పిండిని, బియ్యాన్ని సబ్సిడీ ధరలకు ప్రజలకు అందిస్తారు. కేజీ గోధుమ పిండి రూ.30లు, కేజీ బియ్యం రూ.34ల చొప్పున 5 కేజీలు, 10 కేజీల ప్యాకెట్ల రూపంలో వాటిని విక్రయిస్తారు. రెండో దశ విక్రయాల కోసం 3,69,000 టన్నుల గోధుమలను, 2,91,000 టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐ సేకరించిందని, అవసరమైతే సరుకులను మళ్లీ సేకరిస్తామని కేంద్ర ఆహార మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. కాగా, రెండో దశలో భారత్ బ్రాండ్ సరుకుల ధరలు స్వల్పంగా పెరిగాయి. మొదటి దశలో గోధుమ పిండిని రూ.27.5లకు, బియ్యాన్ని రూ.29లకు విక్రయించారు.

మీడియా భేటీలపై కార్యదర్శులకు కేంద్రం కొత్త రూల్స్

న్యూఢిల్లీ, నవంబరు 5: ప్రసార మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, సమాచారాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం కొత్త నిబంధనలు రూపొందించనుంది. ఈ బాధ్యతను సమాచార ప్రసార శాఖకు అప్పగించింది. ఇటీవల పలువురు కేంద్ర కార్యదర్శులతో నిర్వహించిన సమావేశం అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే మీడియాకు సమాచారం ఇచ్చే విషయంలో కార్యదర్శులు ఏం చేయాలి, ఏం చేయకూడదో నిర్దేశిస్తూ కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి వారికి లేఖ రాశారు. కేంద్రం నిర్ణయాలపై మీడియాలో చర్చలకు కార్యదర్శులు దూరంగా ఉండాలని ఆ లేఖలో స్పష్టం చేశారు. ప్రతిపాదన దశలో ఉన్న ప్రణాళికల వివరాలను మీడియాకు ఇవ్వొద్దని నిర్దేశించారు. ప్రభుత్వ నిర్ణయాలను సొంత గొప్పలు చెప్పుకోవడానికి వాడుకోవద్దని సూచించారు. మీడియా ప్రాయోజిత కార్యక్రమాల్లో పాల్గొనవద్దని, ఒకవేళ వెళ్లాలనుకుంటే సమాచార శాఖ అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు సంబంధిత మంత్రి అనుమతి ఉంటే సరిపోయేది.

మహారాష్ట్ర నూతన డీజీపీగా సంజయ్ వర్మ



ముంబయి, నవంబరు 5: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తొలగించిన మహారాష్ట్ర డీజీపీ రశ్మి శుక్లా స్థానంలో సంజయ్ కుమార్ వర్మను నూతన డీజీపీగా మంగళవారం నియమించారు. వర్మ 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. మహారాష్ట్ర ప్రతిపక్ష పార్టీలు పలు ఫిర్యాదులు చేయడంతో రశ్మి శుక్లాను తొలగిస్తూ ఎన్నికల సంఘం సోమవారం నిర్ణయం తీసుకుంది. కాగా శుక్లా మహారాష్ట్ర తొలి మహిళా డీజీపీ. ప్రతిపక్ష పార్టీల నేతల ఫోన్లను ట్యాప్ చేయడంలో ఆమె పాత్ర ఉందని ఆరోపిస్తూ.. ఆమెను బదిలీ చేయాలని కాంగ్రెస్ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది.

స్వతంత్ర న్యాయవ్యవస్థ అంటే.. ఎల్లప్పుడూ ప్రభుత్వ వ్యతిరేక తీర్పులని కాదు



న్యూఢిల్లీ, నవంబరు 5: స్వతంత్ర న్యాయవ్యవస్థ అంటే అర్థం.. ఎల్లప్పుడూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులివ్వాలని కాదని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో ఒక ఆంగ్ల పత్రిక ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియాను ఉపయోగించుకొని కోర్టులపై ఒత్తిడి తేవడం ద్వారా అనుకూలమైన తీర్పులు పొందేందుకు 'ప్రెజర్ గ్రూపులు' ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. 'సంప్రదాయకంగా స్వతంత్ర న్యాయవ్యవస్థ అంటే కార్యనిర్వాహక వ్యవస్థ నుంచి స్వతంత్రంగా ఉండడమనే నిర్వచనం ఉంది. ఇప్పుడు స్వతంత్ర న్యాయవ్యవస్థ అంటే ప్రభుత్వం నుంచి కూడా స్వతంత్రత అని అర్థం. అయితే, చాలా ప్రెజర్ గ్రూపులు జడ్జిల నిర్ణయం తమకు అనుకూలంగా వచ్చినప్పుడు న్యాయవ్యవస్థ స్వతంత్రంగా ఉందని అభివర్ణిస్తుంటాయి. అనుకూలంగా రాకపోతే స్వతంత్రత లేదంటున్నాయి. నా అభ్యంతరం ఇదే. స్వతంత్రంగా ఉండటం అంటే.. తన మనస్సాక్షి ఏమి చెబుతోందో ఆ ప్రకారమే జడ్జి స్వతంత్రంగా నిర్ణయించాలి. ఆ మనస్సాక్షి కూడా చట్టం, రాజ్యాంగం మార్గదర్శకంలో ఉండాలి' అని తేల్చిచెప్పారు.

నేరం ఎంతో అంతే శిక్ష పడుతోందా?

ఏకపక్ష తీర్పులను సమీక్షించే యోచనలో కేంద్రం

» విధాన రూపకల్పనలో న్యాయశాఖ

» డిసెంబరులో సుప్రీంకోర్టుకు నివేదన

న్యూఢిల్లీ, నవంబరు 5: న్యాయ సంస్కరణలను చేపడుతున్న కేంద్ర ప్రభుత్వం... నేరం- శిక్ష విషయంలో హేతుబద్ధత లోపించిన తీర్పులను పునఃసమీక్షించాలని యోచిస్తోంది.. చేసిన నేరం తీవ్రతతో సంబంధం లేకుండా న్యాయమూర్తులు అప్పుడప్పుడు ఏకపక్షంగా ఇస్తున్న తీర్పులు న్యాయవర్గాలనే విస్మయానికి గురిచేస్తున్నాయి. ఇలాంటి సందర్భంలో ఆ తరహా తీర్పులను అవసరమైతే నిలుపుదల చేసేందుకు ఉన్న మార్గాలను కేంద్రం అన్వేషిస్తోంది. దీనిపై వచ్చే డిసెంబరులో ఒక విస్పష్ట విధానాన్ని సుప్రీంకోర్టు ఎదుట కేంద్ర న్యాయశాఖ ప్రతిపాదించనుంది. బిహార్‌లో ఓ కోర్టు బాలికపై అత్యాచారం కేసులో నిందితుడిని కేవలం 30 నిమిషాలు విచారించి మరణశిక్ష విధించింది. ఈ వ్యవహారం 2022లో తీవ్ర కలకలం రేపింది. ప్రజాగ్రహానికి కారణమైన ఈ కేసులో ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని ఆ తీర్పును సవరించింది. న్యాయమూర్తిని ట్రైనింగ్‌కు పంపాలని అప్పట్లో ఆదేశాలు కూడా జారీచేసింది. ఇదే అంశాన్ని విచారిస్తున్న సుప్రీం కోర్టు.. దీనిపై తన నిర్ణయం తెలియజేయాల్సిందిగా కేంద్రాన్ని ఈ ఏడాది మే నెలలో కోరింది. ఈ మేరకు నిర్దిష్ట విధానంతో కేంద్ర న్యాయశాఖ సుప్రీంకోర్టు ముందుకు వెళ్లనుంది. ఏకపక్ష, నిర్హేతుక తీర్పుల పద్ధతిని నిరోధించే లక్ష్యంతో, శిక్షాస్మృతిలోని నిబంధనలను సవరించే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, దిగువ కోర్టులకు చిన్నచిన్న శిక్షలు విధించే అధికారం మాత్రమే ఉండాలని ప్రతిపాదిత విధానంలో కేంద్రం సూచించినట్లు తెలిసింది. పోక్సో కేసులపై దిగువ కోర్టులు తీవ్రంగా స్పందిస్తున్న తీరును కేంద్ర న్యాయశాఖ నిశితంగా పరిశీలిస్తోంది. మధ్య భారతంలోని ఓ న్యాయస్థానం పోక్సో కేసులో నిందితుడికి అరెస్టు అయిన 23 రోజుల్లోనే మరణశిక్ష విధించింది. నిందితుడిని ఉరితీయాలంటూ జరిగిన వీధి పోరాటాల ఒత్తిడికి ఆ జడ్జీ గురయి ఇలాంటి తీవ్ర నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 2021నుంచి పోక్సో కింద నమోదైన కేసుల్లో తీర్పులను ప్రతిపాదిత విధానం కింద చేపట్టే న్యాయ సమీక్ష పరిధిలోకి తీసుకురానున్నారు.

శ్రీశైలం, సాగర్‌ను ఖాళీ చెయ్యకండి

» తెలుగు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు లేఖ

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని తాగు, సాగు నీటి అవసరాలకు మాత్రమే వాడాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) తెలుగు రాష్ట్రాలను కోరింది. 2025 వానాకాలం దాకా రిజర్వాయర్లలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జలవిద్యుత్ ఉత్పాదన చివరి ప్రాధాన్యంగా ఉండాలని సూచించింది. కేఆర్ఎంబీ సభ్యుడు డాక్టర్ ఆర్.ఎన్.శంకువ ఈ మేరకు తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలకు వేర్వేరుగా లేఖలు పంపారు. శ్రీశైలం ప్రాజెక్టు వద్ద అవసరమున్నా లేకున్నా పోతిరెడ్డిపాడు నుంచి ఇరువైపులా జలవిద్యుత్ ఉత్పాదనతో నీటిని దిగువకు వదులుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే, సాగర్‌లో ప్రధాన కేంద్రంతో పాటు కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో జల విద్యుత్ ఉత్పాదన చేస్తున్నారని తెలిపారు. ఇలా పోటీ పడి తెలుగు రాష్ట్రాలు నీటి నిల్వలను దిగువకు వదులుతుండడంపై కేఆర్ఎంబీ ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే జలవిద్యుత్ ఉత్పాదనను నిలిపివేయాలని, అవసరం లేకుండా ఇతర కాంపోనెంట్ల ద్వారా నీటి తరలింపును ఆపాలని కోరింది. నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటి నిల్వలు ఉండడంతో ఎగువ నుంచి వచ్చిన నీటిని అలాగే దిగువకు వదిలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ లోనూ పూర్తి స్థాయి నిల్వలు ఉండడంతో ఎగువ నుంచి వచ్చిన నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఇలా నీరు వృథా అవుతున్న నేపథ్యంలో కేఆర్ఎంబీ తెలుగు రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.

బకాయిలు చెల్లించకుంటే లైన్లు వెయ్యం, విద్యుత్ ఇవ్వం

» నీటిపారుదల శాఖకు ట్రాన్స్‌కో అల్టిమేటం

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డెవలప్‌మెంట్ చార్జీలు, విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించకపోతే ఎత్తిపోతల పథకాలకు సబ్‌స్టేషన్లు నిర్మించలేమని, కొత్త లైన్లు వేయలేమని, విద్యుత్ కూడా ఇవ్వలేమని నీటిపారుదల శాఖకు ట్రాన్స్‌కో స్పష్టం చేసింది. నీటి పారుదల శాఖలోని ఎత్తిపోతల పథకం సలహాదారు పెంటారెడ్డి, ఈఎన్‌సీ/చీఫ్ ఇంజనీర్లతో ట్రాన్స్‌కో డైరెక్టర్లు జగత్‌రెడ్డి, సూర్యప్రకాష్ విద్యుత్ సౌధలో మంగళవారం సమావేశమయ్యారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద రూ.2000 కోట్లు, కాళేశ్వరం అదనపు టీఎంసీ పథకానికి రూ.2700 కోట్లు, సీతారామ ఎత్తిపోతల పథకం కింద రూ.120 కోట్లు సహా దాదాపు రూ.6 వేల కోట్ల దాకా డెవలప్‌మెంట్ చార్జీలు కింద తమకు చెల్లించాల్సి ఉందన్నారు. అలాగే, 2014 నుంచి ఇప్పటిదాకా ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రూ.14,957 కోట్ల విద్యుత్ బిల్లులు నీటిపారుదల శాఖ బకాయి ఉందని పేర్కొన్నారు. తక్షణమే ఆయా బకాయిలను చెల్లించాలని ట్రాన్స్‌కో ఈ సందర్భంగా స్పష్టం చేసింది. అలాగే, 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ సబ్‌స్టేషన్లు/లైన్ల కోసం నిర్దేశిత మొత్తంలో నిధులు ఇస్తేనే పనులు చేస్తామని తెలిపింది. రాష్ట్రంలోని వివిధ ఎత్తిపోతల పథకాలకు సబ్‌స్టేషన్లు, లైన్లను ట్రాన్స్ కో వేస్తుండగా డిస్కమ్‌లు విద్యుత్ సరఫరా చేస్తున్నాయి. సబ్‌స్టేషన్లు, లైన్లు వేసినందుకు డెవలప్‌మెంట్ చార్జీలను నీటిపారుదల శాఖ ట్రాన్స్‌కోకు చెల్లించాలి. అలాగే, డిస్కమ్‌లకు ఇంధన, స్థిర చార్జీలు చెల్లించాలి. దాదాపు ఆరేళ్లుగా ఈ చెల్లింపులు జరగకపోవడంతో పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయాయి.

ఎట్టకేలకు 'రెరా'కు 56 పోస్టులు మంజూరు

హైదరాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (రెరా)కు వివిధ క్యాడర్లలో 56 మంది సిబ్బందిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 39 మందిని శాశ్వత ప్రాతిపదికన, 17 మందిని పొరుగు సేవల ద్వారా నియమించుకోవాలని ప్రణాళిక, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనికి పురపాలక శాఖ తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యదర్శి, న్యాయాధికారి, రిజిస్ట్రార్, జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ తదితర పోస్టులను శాశ్వత ప్రాతిపదికన నియమించుకునే వీలు కల్పించారు. తెలంగాణ ప్రభుత్వం 2017లో రెరాను నోటిఫై చేసినా ఇప్పటి వరకు అవసరమైన సిబ్బంది కేటాయింపు మాత్రం జరగలేదు. రియల్ ఎస్టేట్ రంగంలో అక్రమాలను నిరోధించడానికి, కొనుగోలుదారుల హక్కులు కాపాడేందుకు ఏర్పాటైన రెరాను ఇన్నాళ్లూ సిబ్బంది కొరత వేధిస్తోంది. సిబ్బందిని కేటాయించాలని గతంలో పలు దఫాలు రెరా.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మరో దఫా ప్రతిపాదనలు పంపగా సిబ్బందిని కేటాయించింది.

మద్దూరి విజయ్ పోలీసుల ఎదుట హాజరుకావాలి

» న్యాయవాది సహాయం తీసుకోవచ్చు : హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జన్వాడ ఫాంహౌస్ పార్టీ కేసులో రెండో నిందితుడిగా ఉన్న మద్దూరి విజయ్ ఈ నెల 6న మోకిల పోలీసుల ఎదుట హాజరుకావాలని.. ఇందుకు న్యాయవాది సహాయం తీసుకోవచ్చని హైకోర్టు పేర్కొంది. పోలీసులు తనను వేధిస్తున్నారని పేర్కొంటూ పిటిషనర్, నిందితుడు మద్దూరి విజయ్ హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదిస్తూ.. గత నెల 27న ఫాంహౌస్ పార్టీపై దాడులు చేసి పిటిషనర్‌ను నిర్బంధించారని.. రాత్రి 10.30 గంట నుంచి ఉదయం 8.30 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారని పేర్కొన్నారు. వాంగ్మూలం కోసం వేధించారని ఆరోపించారు. మళ్లీ ఈనెల 4న బీఎన్ఎస్ఎస్ 35 (3) నోటీసు జారీచేశారని.. రెండురోజుల్లో విచారణకు హాజరుకావాలని వేధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ.. బీఎన్ఎస్ఎస్ 35 (3) నోటీసు ఇచ్చిన తర్వాత కూడా అరెస్ట్ చేస్తారని పిటిషనర్ చెప్పడం కేవలం ఆందోళన మాత్రమేనని పేర్కొన్నారు. అరెస్ట్ చేస్తారని.. వేధిస్తారని భయపడాల్సిన అవసరం లేదని.. కేసు ఇంకా విచారణలో ఉందని.. చట్టప్రకారం వ్యవహరిస్తామని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం ఈనెల 6న ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల మధ్యలో పిటిషనర్ పోలీసుల ఎదుట హాజరుకావాలని.. న్యాయవాది సహాయం తీసుకోవచ్చని.. పిటిషనర్ దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించింది.

సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీగా లచ్చిరెడ్డి

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ కలెక్టర్ వి. లచ్చిరెడ్డి సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీగా నియమితులయ్యారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న లచ్చిరెడ్డిని సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీగా నియమిస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

హైదరాబాద్‌లో పెరిగిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు

» జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో 19,527

» గత సంవత్సరం కంటే 7 శాతం అధికం

» రూ.11 వేల కోట్లకు పైగా అమ్మకాల విలువ

» స్క్వేర్‌యార్డ్స్ తాజా అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఇళ్ల రిజిస్ట్రేషన్లు పుంజుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో 7 శాతం మేర రిజిస్ట్రేషన్లు పెరిగినట్లు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ స్క్వేర్‌యార్డ్స్ వెల్లడించింది. ఈ సంస్థ తాజా నివేదిక ప్రకారం.. నగరంలో గతేడాది ఇదే త్రైమాసికంలో 18,314 రిజిస్ట్రేషన్లు నమోదు కాగా, తాజాగా ఈ ఏడాది అవి 19,527కు చేరుకోవడం విశేషం. హైదరాబాద్ రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ మార్కెట్ జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో బలమైన పనితీరును కనబరుస్తూ స్థిరంగా కొనసాగుతోందని స్క్వేర్‌యార్డ్స్ నివేదికలో పేర్కొంది. మొత్తం నమోదైన ఇళ్ల అమ్మకాల విలువ రూ.11,718 కోట్లకు పెరిగిందని, గతేడాది కన్నా 20 శాతం పెరుగుదలను సూచిస్తుందని వెల్లడించింది. స్క్వేర్‌యార్డ్స్ సేల్స్ డైరెక్టర్ దేబయన్ భట్టాచార్య మాట్లాడుతూ.. ఐటీరంగంలో వృద్ధి, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు స్థిరమైన ఆదాయం కారణంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ తిరిగి ఊపందుకుందని అన్నారు. గచ్చిబౌలి, మాదాపూర్‌లతో పాటు కోకాపేట్, నార్సింగి, ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపాన ఉన్న ప్రాంతాలు, విమానాశ్రయం, ఐటీ హబ్‌లకు మెరుగైన కనెక్టివిటీ కారణంగా అటువైపు నివాసాలకు అధికంగా ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రియల్ ఎస్టేట్ మార్కెట్‌లలో హైదరాబాద్ ఒకటిగా అవతరించిందని, దేశీయ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఇది మంచి ఆకర్షణీయంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. దేశం నలుమూలల నుంచి వలసలు కొనసాగుతున్నందున, నివాస గృహాల డిమాండ్‌లో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోందన్నారు. ఆదాయాలు పెరగడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి కారణంగా గత కొన్నేళ్లుగా లగ్జరీ, అల్ట్రా లగ్జరీ గృహాలకు డిమాండ్ పెరుగుతోందని మరొక రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధి మధుసూదన్ తెలిపారు.

సంగెం నుంచి సీఎం మూసీ యాత్ర

» కార్నర్ మీటింగ్‌తోపాటు రైతులతో చర్చ

» 8న జన్మదినం సందర్భంగా గుట్టకు సీఎం

యాదాద్రి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ బాట పర్యటన తాత్కాలిక రూట్‌మ్యాప్‌ను అధికారులు సిద్ధం చేశారు. ఈ నెల 8న ముఖ్యమంత్రి జన్మదినం పురస్కరించుకుని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకుంటారు. అనంతరం మూసీ పునరుజ్జీవం కార్యక్రమంలో భాగంగా మూసీ నది వెంట యాత్ర చేపట్టనున్నారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమైంది. వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్ద నుంచి యాత్ర చేపట్టనున్నారు. సంగెం బ్రిడ్జి వద్దే కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసేందుకు స్థానిక ఎమ్మెల్యేలు సన్నాహాలు చేస్తున్నారు. సంగెం వెళ్లే దారిలో బ్రిడ్జి చివర ఉన్న కాటమయ్య దేవాలయం నుంచి మూసీ పరిసర ప్రాంతాలను సీఎం పరిశీలించనున్నారు. అక్కడ నుంచి అసిఫ్‌నెహర్ కాల్వ వైపు సీఎం యాత్ర కొనసాగేలా రూట్‌మ్యాప్ రూపొందించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని రైతులు, మత్స్యకారులు, వివిధ కుల వృత్తుల వారితో సీఎం మాట్లాడనున్నారు. మూసీ కాలుష్యంతో జరుగుతున్న నష్టంపై వారి అభిప్రాయాలను తీసుకోనున్నారు. భీమలింగం కత్వ వద్ద ఉన్న శివలింగానికి సీఎంతో పూజలు చేయించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సంగెం గ్రామ మూసీ పరివాహక ప్రాంతంలో పునరుజ్జీవ యాత్ర సభాస్థలాన్ని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, భువనగిరి, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు పరిశీలించారు.

సీఎం పర్యటనతో సంగెం బ్రిడ్జికి మోక్షం కలిగేనా?

మూసీ ఉగ్రరూపం దాల్చితే సంగెం బ్రిడ్జి మీదుగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఈ బ్రిడ్జి ఎత్తు పెంచాలని స్థానికులు కొన్నేళ్లుగా కోరుతున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో మూసీపై బ్రిడ్జిల విషయంలో నిర్ణయం తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యేలు ఆయన దృష్టికి తీసుకొచ్చే అవకాశం ఉంది. సంగెం బ్రిడ్జితో పాటు బీబీనగర్-భూదాన్ పోచంపల్లి మండలాలను కలిపే జూలూరు వాగు వద్ద బ్రిడ్జికి మోక్షం కలుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణలో కులగణన.. దేశానికి నమూనా

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కొంటున్నవారికి మాత్రమే ఆ బాధ తెలుస్తుందని అన్నారు. అనేక మంది జీవితాలను, ఆత్మవిశ్వాసాన్ని ఇది నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కుల వ్యవస్థ, కుల వివక్ష ఉందన్న విషయాన్ని అందరూ అంగీకరిస్తారని, అయితే అది ఏ స్థాయిలో ఉందో లెక్కించి దేశ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తాను ఈ విషయాన్ని అడిగితే.. దేశాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నానంటూ ప్రధాని మోదీ, బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నిజం మాట్లాడితే దేశాన్ని విభజించినట్లా? అని ప్రశ్నించారు.



బేగంపేట విమానాశ్రయంలో రాహుల్‌గాంధీకి స్వాగతం పలుకుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

వాస్తవం బహిర్గతం కావాలి..

దేశంలోని అన్ని మతాలు ప్రాథమికంగా చెప్పేది సత్యం, అహింస అని, అందుకే దేశంలో కుల వివక్ష ఉందన్న సత్యం బహిర్గతం కావాలని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మైనారిటీలు, మహిళలు, ఇతరులు ఎంత మంది ఉన్నారో లెక్కించడంతో పాటు ఆయా వర్గాలకు దేశ సంపద ఏ మేరకు పంపిణీ జరిగిందన్నదీ తెలుసుకోవాలంటున్నామని పేర్కొన్నారు. అలాగే కార్పొరేట్, న్యాయ వ్యవస్థల్లో, ఆర్మీలో ఆయా వర్గాలవారు ఏ మేరకు ఉన్నారు, జనరల్ కేటగిరీలో పేదలు ఎంత మంది ఉన్నారన్నదీ వెలికి తీయాలంటున్నామని తెలిపారు. కులగణన.. ఎక్స్‌రే లాంటిదని పేర్కొన్నారు. కుల వివక్ష ద్వారా ప్రయోజనం పొందుతున్నవారే.. కుల వివక్ష ఏ మేరకు ఉందన్న సత్యాన్ని ప్రజలు తెలుసుకోకూడదని భావిస్తున్నారని ఆరోపించారు. కుల వివక్షపై సవాల్ చేయడానికి ప్రధాని మోదీ ఎందుకు ముందుకు రావడంలేదని ప్రశ్నించారు. కార్పొరేట్ న్యాయవ్యవస్థ, మీడియా రంగంలో దళితులు, ఆదివాసీలు, బీసీలు ఎంత మంది ఉన్నారో తెలుసుకోవడానికి ప్రధాని ఎందుకు వెనకాడుతున్నారని నిలదీశారు. తాము జాతీయ స్థాయిలో కులగణన చేపడతామని, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని బద్దలు కొడతామని పార్లమెంటు సాక్షిగా చెప్పానని గుర్తు చేశారు.

కులగణనలో ప్రశ్నలను ప్రజలే నిర్ణయించాలి

కులగణనలో అడిగే ప్రశ్నలను అధికారులు కూర్చుని నిర్ణయించడానికి తాను వ్యతిరేకమని రాహుల్‌గాంధీ తెలిపారు. కులగణనలో ఏ ప్రశ్నలు అడగాలన్నది ప్రజలే నిర్ణయించాలని అభిప్రాయపడ్డారు. కుల గణన కేవలం కులాల గణన మాత్రమే కాదని, వివక్ష, అసమానతలు ఎదుర్కొంటున్నవారి సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ఇది సాధనంగా మారుతుందని అన్నారు. ఈ కులగణన వివరాలతో పాలనా విధానం, రాబోయే తరాల భవిష్యత్తు రూపకల్పన జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో వివక్ష ఉందన్నది సత్యమని, దేశం ఆర్థికంగా, సంతోషంలో శక్తివంతమైన దేశంగా మారాలంటే కుల వివక్ష ఎంత మేరకు ఉందో, దాని స్వభావమేంటో తెలుసుకోవాల్సి ఉందని అన్నారు. ఈ సత్యం తెలియకుండా ప్రజలకు జవాబుదారీ అయిన రాజకీయ నాయకుడు వారి వద్దకు పోకూడదని రాహుల్ అభిప్రాయపడ్డారు.

కులగణన మా ప్రభుత్వ బాధ్యత: రేవంత్

సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి కుల గణన సర్వేను తమ ప్రభుత్వం బాధ్యతగా భావించిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పౌర సమాజం నుంచి సూచనలు తీసుకోవడానికి రాహుల్‌గాంధీ ఇక్కడికి రావడం గొప్ప విషయమని, ఈ నిర్ణయం తీసుకోవాలంటే గుండె ధైర్యం కావాలని అన్నారు. సామాజిక బాధ్యత, సమాన అవకాశాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలన్నదే రాహుల్ ఆలోచన అని పేర్కొన్నారు. విద్య వైద్యం, ఉద్యోగం, సామాజిక న్యాయాన్ని ప్రజలకు అందించేందుకు అడుగు ముందుకు వేశారని, ఆయన ఇచ్చిన మాటను నెరవేర్చడమే తమ కర్తవ్యమని చెప్పారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షలో 31,383 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారని, ఇందులో ఓసీలు 3076 మంది (9.8%), ఈడబ్ల్యూఎస్ వారు 2774 మంది (8.8%) ఉంటే.. ఓబీసీలు 17,921 మంది (57.11%), ఎస్సీలు 4828 (15.3%) మంది, ఎస్టీలు-2783 (8.8%) మంది ఉన్నారని సీఎం వివరించారు. ఇది తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. "మనది రైజింగ్ తెలంగాణ. దేశానికి రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను అమలు చేయడమే మన కర్తవ్యం. కులగణన పూర్తిచేసి.. బీసీలకు న్యాయంగా అందాల్సిన రిజర్వేషన్లు అందిస్తాం" అని రేవంత్ అన్నారు.

మాట నిలబెట్టుకున్న రాహుల్‌గాంధీ..

రాహుల్‌గాంధీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన సందర్భంగా.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, కుల గణన చేపడుతుందని ప్రకటించారని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క గుర్తు చేశారు. రాహుల్ చెప్పినట్లుగానే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపడుతోందని అన్నారు. ఇచ్చినమాటను ఆయన నిలబెట్టుకున్నారని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ ఏ విషయంలోనైనా మాట ఇచ్చారంటే అమలు చేసి తీరతారని అన్నారు. కులగణనతో అది మరోసారి నిరూపితమైందని కొనియాడారు. కులగణన చేపట్టడం ద్వారా దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కాగా, కులగణనను 2025 జనగణనలో పరిగణనలోకి తీసుకోవాలని ఈ సదస్సులో తీర్మానాన్ని ఆమోదించారు. సదస్సులో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా 500 నుంచి 600 మంది దాకా కాంగ్రెస్ ప్రముఖులు పాల్గొ పాల్గొన్నారు. సాయంత్రం 4.45 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయం చేరుకున్న రాహుల్‌గాంధీకి సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతం పలికారు. సదస్సులో పాల్గొన్న అనంతరం రాహుల్ ప్రత్యేక విమానంలో తిరిగి ఢిల్లీకి వెళ్లి పోయారు.

కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు

బోయిన్‌పల్లి: కులగణనపై సంప్రదింపుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలకు పాస్‌లు లేకపోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ రాక నేపథ్యంలో చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి భారీ జనసమీకరణ చేశారు. ముఖ్యంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో సుమారు 5వేల మందిని సమీకరించారు. దారిలో కటౌట్లు ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి రాహుల్‌కు స్వాగతం పలికారు. అయితే పాస్‌లు లేనివారిని పోలీసులు అనుమతించలేదు. ఇదిలా ఉండగా.. రాహుల్ కాన్వాయ్ వెళ్లే రహదారిలో పలు చోట్ల బీఆర్ఎస్ నాయకులు.. పారిశ్రామికవేత్త అదానీతో సీఎం రేవంత్ కలిసి ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం తెల్లవారుజామున వాటిని తొలగించారు. కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన కొందరు బీఆర్ఎస్ నేతలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి.. రాహుల్ సమావేశం ముగిసిన తర్వాత విడిచిపెట్టారు.



రాహుల్ గాంధీని సన్మానిస్తున్న మంత్రి దుద్దిళ్ల

అధికారంలో లేకున్నా.. ప్రజల్లోనే రాహుల్ గాంధీ

» అధికారం కోల్పోయాక కేసీఆర్ ఎక్కడున్నారు?

» బీఆర్ఎస్ నేతలకు మంత్రి శ్రీధర్ బాబు 10 ప్రశ్నలు

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): "దేశంలో సామాజిక న్యాయం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి నిరంతరం పోరాటం సాగిస్తున్నది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి పనిచేసేది, వారి తరఫున గళాన్ని వినిపించేది కాంగ్రెస్ మాత్రమే" అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉద్ఘాటించారు. కేంద్రంలో అధికారంలో లేకపోయినా తమ నేత రాహుల్‌గాంధీ దేశమంతా పర్యటిస్తున్నారని వివరించారు. అలాంటిది.. ఓడిపోయిన కేసీఆర్ ఎక్కడున్నారని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారు, రాహుల్‌గాంధీపై బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలకు కౌంటర్‌గా మంగళవారం ఆయన పది ప్రశ్నలతో ఓ బహిరంగ లేఖను విడుదల చేశారు. "మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణ త్యాగం చేసిన 1,200 మంది విద్యార్థులు, యువకుల కుటుంబాలను బీఆరెస్ పెద్దలు ఎందుకు విస్మరించారు? 2014 జూన్ 14న ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన తీర్మానంలో కేసీఆర్ స్వయంగా 1,200 మంది అమరులు అని పేర్కొన్నారు. ఆ తర్వాత అనేక సార్లు మాటమార్చి.. అమరుల సంఖ్యను వేర్వేరు ఉత్తర్వుల్లో 585కు కుదించారు. మిగతా 615 మంది ఏమైపోయారన్నదానిపై పదేళ్ల విధ్వంస పాలనలో ఎప్పుడైనా ఆత్మవిమర్శ చేసుకున్నారా? ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలకు రూ.10 లక్షల నగదు, గృహవసతి, సాగు భూమి, కుటుంబానికో ఉద్యోగం, ఉచిత విద్య, వైద్యం ఇప్పిస్తామన్న హామీలు ఏమయ్యాయి?" అని శ్రీధర్ బాబు ప్రశ్నించారు. దళిత సీఎం, దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కేజీ-టు-పీజీ ఉచిత విద్య ఏమయ్యాయని నిలదీశారు. కాళేశ్వరంతో ఏడు జిల్లాల్లోని 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని నమ్మబలికారని, లక్ష ఎకరాలనైనా సాగులోకి తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు.

యాదాద్రి థర్మల్ కేంద్రం వద్ద టౌన్‌షిప్

తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మాణం

928.52 కోట్ల అంచనాలతో టెండర్ ప్రకటన

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం సమీపంలో కొత్త టౌన్‌షిప్ ఏర్పాటు కానుంది. తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) రూ.928.52 కోట్ల అంచనాతో ఈ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌ను నిర్మించనుంది. ఇందుకోసం ఔత్సాహిక బిడ్డర్ల నుంచి టెండర్లను ఆహ్వానిస్తూ జెన్‌కో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 16 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు బిడ్లను ఆహ్వానించనున్నారు. టెక్నికల్ బిడ్లను డిసెంబరు 3న, ప్రైస్ బిడ్లను డి సెంబరు 7న తెరిచి టెండర్లను ఖరారు చేయనున్నారు. కృష్ణా నదిలో కలిసే తుంగపాడు వాగు తీరంలో ఈ టౌన్‌షిప్ నిర్మాణం జరగనుంది. డిజైన్లు, డ్రాయింగ్స్ ప్రకారం మొత్తం 3,52,771.02 చ.మీ.ల విస్తీర్ణంలో ఈ టౌన్‌షిప్ నిర్మాణం జరగనుండగా, 2,21,903.67 చ.మీ.ల విస్తీర్ణంలో నివాస గృహ సముదాయాలతో లేఅవుట్‌ను రూపొందించారు. మరో 75,185 చ.మీ.ల విస్తీర్ణంలో పార్కులు, మొక్కల పెంపకం, పచ్చిక బయళ్లు, మరో 55,682.35 చ.మీ.ల విస్తీర్ణంలో రోడ్లు, ఇతర సదుపాయాలు కల్పించనున్నారు. 4వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణం 2025 మార్చి నాటికి పూర్తికావాల్సి ఉండగా, వేల సంఖ్యలో ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగులు, ఇతర కార్మికులు ఇక్కడ రాత్రింబవళ్లు పనిచేయనున్నారు. వీరంతా తప్పనిసరిగా స్థానికంగా నివాసం ఉండాల్సిరావడంతో టౌన్‌షిప్‌ను జెన్‌కో నిర్మిస్తోంది. 11 అంతస్తుల బహుళ అంతస్తుల సముదాయాల్లో ఈ క్వార్టర్లు ఉండనున్నాయి. కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించిన తర్వాత 30 నెలల్లోగా ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంటుంది.

పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాలి: తుమ్మల

పత్తి రైతులకు భారం కాకుండా పత్తి కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలని మార్కెటింగ్ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఇప్పటివరకు రూ.82.44 కోట్ల విలువైన 11,255 టన్నుల పత్తిని 5,251 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. నిరుడు ఇదే సమయానికి కేవలం రూ.3.91 కోట్లతో 560.37 టన్నుల పత్తిని 233 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సీసీఐ ఇంతకుముందెన్నడు లేనంతగా ఎక్కువ పత్తిని కొనుగోలు చేసిందని తెలిపారు.

నేటి నుంచి కుల గణన!

కులాలవారీగా ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి స్థితిగతుల సమాచార సేకరణ

» 'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే'కు ఏర్పాట్లు పూర్తి

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బుధవారం నుంచి 'ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే' పేరిట కులగణన ప్రక్రియ చేపట్టేందుకు రేవంత్ సర్కారు సిద్ధమైంది! కులాలవారీగా.. ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి స్థితిగతులపై ఈ సర్వేలో సమాచారాన్ని సేకరించనుంది. దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ చాలాకాలంగా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, అందుకు కేంద్రం సుముఖంగా లేకపోవడంతో.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కులగణన నిర్వహిస్తామని ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గతంలో ప్రకటించారు. అందులో భాగంగానే.. రాష్ట్ర పౌరులకు సంబంధించి కులాలవారీగా సమగ్ర వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి కోసం, వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరచడానికి.. తగిన ప్రణాళికలు రూపొందించి అమలుచేయడమే ఈ సమగ్ర సర్వే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా.. మొత్తం 75 ప్రశ్నలతో ప్రతి కుటుంబానికీ చెందిన సమాచారాన్ని ఎంపిక చేసిన ఎన్యూమరేటర్లు సేకరించనున్నారు. ఆ సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచాల్సిన బాధ్యత ఎన్యూమరేటర్లదే. ఆపరేటర్‌తో ఆన్‌లైన్లో నమోదుచేయించే సందర్భంలోనూ జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్లో నమోదు చేసిన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఎవరితోనూ పంచుకోకూడదు. సమాచార భద్రత విషయంలో ఎలాంటి పొరపాట్లూ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఇచ్చిన శిక్షణలో ఎన్యూమరేటర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులనే ఎన్యూమరేటర్లుగా ఎంపిక చేసిన నేపథ్యంలో.. సమాచార సేకరణ, సమాచార భద్రత విషయంలో వారు ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠినంగా వ్యవహరించాలని, శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది.

సేకరించే వివరాలివి..

ఈ సర్వే అసలు ఉద్దేశం.. కులాల వారీగా జనాభా గణాంకాల సేకరణ. రాష్ట్రంలో ఇలాంటి సర్వే చేయడం ఇదే ప్రథమం.

- ఆధార్ వివరాలు ఐచ్ఛికం (ఆప్షనల్) అని పేర్కొన్నప్పటికీ.. ఆధార్ నంబర్‌తో కలిగే ప్రయోజనాలు వివరించి.. ఆ వివరాలను తప్పకుండా తీసుకునేందుకు ప్రయత్నించాలని ప్రభుత్వం ఎన్యూమరేటర్లకు సూచించింది.
- తెలంగాణలో.. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో.. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలూ నివసిస్తున్నారు. వీరి వివరాలను మాతృభాష కాలమ్‌లో సేకరించనున్నారు. వీటికోసం 19 రకాల కోడ్‌లు కేటాయించారు. తమిళం, మలయాళం, కన్నడ, ఇతర ఉత్తరాది రాష్ట్రాల మాతృభాషలే కాదు. లంబాడీ, కోయ, గోండు లాంటి ఆదివాసీలు, గిరిజనులు మాట్లాడే మాతృభాషల వివరాలూ నమోదు కానున్నాయి.
- దివ్యాంగులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈ సర్వేలో సేకరించనున్నారు. రాష్ట్రంలో వీరి సంఖ్యకు సంబంధించిన గణాంకాలు ఉన్నప్పటికీ ఇతర వివరాలు లేవు. ఈ సర్వేతో.. వారి వైకల్యం తీవ్రత, కండరాల క్షీణత, యాసిడ్ బాధితులు, మరుగుజ్జు, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, నత్తి, నిర్దిష్ట అభ్యాస వైకల్యం (లెర్నింగ్ డిజెబిలిటి), మానసిక అనారోగ్యం, పార్కిన్సన్, తలసీమియా తదితర 13 రకాల వైకల్యాల వివరాలు తేలనున్నాయి.
- సర్వేలో భాగంగా..కుటుంబ సభ్యులందరి మొబైల్ నంబర్లూ నమోదు చేయాలి. దీంతో మొబైల్ వినియోగదారుల సంఖ్యపై కచ్చితత్వం రానుంది.
- వైవాహిక వివరాల నమోదుతో అవివాహితులు, ఒంటరి మహిళల వివరాలు తెలుస్తాయి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు, గురుకులాల్లో చదివే విద్యార్థుల వివరాలనూ సేకరించనున్నారు.
- బడి మానేసిన విద్యార్థుల వివరాలతోపాటు ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఇతర కోర్సులు చదివిన వారి వివరాలు, గరిష్ఠ విద్యార్హత కలిగిన పట్టభద్రుల వివరాలు తేలనున్నాయి.
- ఉద్యోగ వివరాలు, వార్షిక ఆదాయం, ఆదాయపు పన్ను చెల్లింపు వివరాల ఆధారంగా వారి ఆర్థిక పరిస్థితి, పారిశ్రామికవేత్తల టర్నోవర్ వివరాలతో వారి వ్యాపారం.. గురించి తేలనుంది.
- అసంఘటిత రంగాల్లోని రోజువారీ కూలీల్లో.. వ్యవసాయం, బీడీ, హోటల్, కార్ఖానా, హమాలీ, ఉపాధి హామీ, గనుల కూలీలు, ఇటుక బట్టీ కార్మికుల వివరాలు సేకరించనున్నారు. 16 రకాల కులవృత్తి వివరాలు నమోదు చేస్తారు.
- భూమి, ధరణి పాస్‌బుక్ వివరాలతోపాటు.. రిజర్వేషన్లతో పొందిన ప్రయోజనాలు, గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ పథకాల వివరాలు, రాజకీయ నేపథ్యం లాంటి వివరాలు సేకరించనున్నారు. రాజకీయాల్లో మతం, కులం, సామాజికవర్గాల జనాభా దీంతో తేలనుంది.
- కుటుంబంలో పశు సంపద, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు, ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకున్న రుణాల వివరాలతో రాష్ట్రంలో రుణగ్రస్తుల జనాభా తేలనుంది.
- ఉన్నత విద్య, ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలకు వెళ్లిన వారి వివరాలు సర్వేలో సేకరించనున్నారు.

కులం, మతం లేదని చెప్పొచ్చు

» ఆ రాజ్యాంగ హక్కు పౌరులకు ఉంది

» కులగణనలో దీన్ని పరిశీలించండి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమకు కులం లేదు, మతం లేదు అని చెప్పే హక్కు పౌరులకు ఉందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 (1) ప్రజలు తమకు నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను ప్రసాదించిందని, అలాగే ఏ మతాన్ని, కులాన్ని అనుసరించడం లేదని చెప్పుకునే హక్కు కూడా ఉంటుందని హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈనెల 6 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే కులగణనలో కులం లేదు, మతం లేదు అనే ప్రత్యేక కాలాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, ఉద్యోగ, ఉపాధి కులగణన సర్వేలో కులం లేదు, మతం లేదు అనే కాలం చేర్చాలని రిప్రజెంటేషన్ ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని పేర్కొంటూ మహమ్మద్ వహీద్, డీఎల్ కృష్ణచంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ నందా ధర్మాసనం.. పిటిషనర్లు ఇప్పటికే రెండుసార్లు ఇచ్చిన రిప్రజెంటేషన్‌లను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. ఈ నెల 6 నుంచి సర్వే మొదలు కాబోతున్న నేపథ్యంలో కులగణన సర్వేలో 'కులం లేదు.. మతం లేదు' అనే కాలం చేర్చారా? లేదా? అన్న విషయాన్ని పిటిషనర్‌లకు తెలియజేయాలని పేర్కొంది.

రాహుల్.. సమాధానం చెప్పు ఆరు గ్యారెంటీల అమలు ఏమైంది?

» తెలంగాణ మోడల్‌పై మహారాష్ట్రలో ప్రకటనలా?: సంజయ్



సిరిసిల్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏ ముఖం పెట్టుకొని తెలంగాణకు వస్తున్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. రాహుల్ గాంధీకి ఆరు గ్యారెంటీలపై సమాధానం చెప్పే దమ్ముందా..?' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పిన తర్వాతే రాహుల్ తెలంగాణకు రావాలని అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు సంజయ్ శంకుస్థాపన చేశారు. రుద్రంగి, కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామల్లోని ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలతో కర్ణాటక, తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్.. మహారాష్ట్రలోనూ దొంగ హామీలు, అబద్ధాలతో ఓట్లు దండుకోవాలని చూస్తోందని విమర్శించారు. తెలంగాణలో గ్యారెంటీలను అమలు చేస్తున్నట్లు, ఎంతో అభివృద్ధి చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటూ మహారాష్ట్రలోని పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. గతంలో కేసీఆర్ ఇలాగే తెలంగాణ సొమ్మును మహారాష్ట్ర, పంజాబ్‌లో పంచారని.. కాంగ్రెస్ నేతలు ఆయన్ను మించిపోయారని మండిపడ్డారు. ఢిల్లీ పెద్దలకు కప్పం కడుతూ మహారాష్ట్ర ఎన్నికలకు తెలంగాణ పైసలను వాడుకుంటారా..? అని విమర్శించారు. బీజేపీ కొత్త జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జనవరిలో జరిగే అవకాశం ఉందని పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బోలాసింగ్ తెలిపారు. పార్టీ సంస్థాగత ఎన్నికల పర్వం జనవరి వరకు కొనసాగుతుందని చెప్పారు.

భూ వ్యవహారంలో మాజీ ఆర్డీవోకు ఈడీ సమన్లు

హైదరాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భూ బదలాయింపుల వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నోటీసుల పరంపర కొనసాగుతోంది. ఎమ్మార్వో జ్యోతి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా భూ బదలాయింపుల కేసులో అవసరమైన ఒక్కొక్కరికి ఈడీ నోటీసులు జారీ చేసి ప్రశ్నిస్తోంది. కొద్ది రోజుల క్రితం రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్‌ను ఈడీ మూడు రోజులు విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. విచారణ సమయంలో ఆయన నుంచి పలు పత్రాలను సేకరించిన ఈడీ.. తాజాగా మహేశ్వరం మండలం నాగారంలో భూమికి సంబంధించిన వ్యవహారంలో మాజీ ఆర్డీవో వెంకటాచారికి నోటీసులు ఇచ్చింది. నాగారంలో సుమారు 42 ఎకరాల భూ కేటాయింపులకు సంబంధించి ఈడీ విచారణ జరుపుతోంది. ఇందులో భాగంగా మాజీ ఆర్డీవోను గురువారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు రావాలని సమన్లు జారీ చేసింది.

కార్ రేస్ కేసులో మొదలైన విచారణ

గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా-ఈ రేస్‌లో అక్రమాలను నిగ్గు తేల్చేందుకు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) రంగంలోకి దిగింది. కేసు విచారణలో భాగంగా రెగ్యులర్ ఎంక్వయిరీ(ఆర్‌ఈ)ని ప్రారంభించింది. ఆర్‌ఈలో పూర్తిగా ఫైళ్లు పరిశీలించి, అక్రమాలు జరిగాయని నిర్ధారణకు వచ్చిన తర్వాత కేసు నమోదు చేయనుంది. ఆపై అవసరమైన వారికి నోటీసులు ఇచ్చి, ప్రశ్నించి స్టేట్‌మెంట్లు రికార్డు చేయనుంది. ఫార్ములా-ఈ రేస్‌కు సంబంధించి రూ.55 కోట్లు విదేశీ సంస్థలకు చెల్లించారు. మునిసిపల్ శాఖ వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా ఆయా విదేశీ సంస్థలు, ప్రతినిధులకు ఏసీబీ నోటీసులు జారీ చేసి ప్రశ్నించనుంది. అనంతరం రేస్ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన గత ప్రభుత్వ పెద్దల వద్దకు ఏసీబీ చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

టీటీడీ నూతన బోర్డు ప్రమాణ స్వీకారం నేడు

తిరుమల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): టీటీడీ నూతన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా బీఆర్ నాయుడు బుధవారం ఉదయం శ్రీవారి ఆలయంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు చైర్మన్‌గా బీఆర్ నాయుడు ప్రమాణస్వీకారం చేశాక బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంఎస్ రాజు, నర్సిరెడ్డి, జాస్తి సాంబశివరావు, రాజశేఖర గౌడ్, జంగా కృష్ణమూర్తి, దర్శన్, శాంతారాం, రామ్మూర్తి, జానకీదేవి, మహేందర్‌రెడ్డి, రంగశ్రీ, ఆనంద్‌సాయి, నరేష్‌కుమార్, అదిత్ దేశాయ్, సౌరభ్ బోరా, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

కేంద్ర నిబంధనల మేరకే ధాన్యం కొనుగోళ్లు!

» తరుగు, తాలు సమస్య ఉండదు: ఉత్తమ్



హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. బ్యాంకు గ్యారెంటీ తీసుకున్న తర్వాత మిల్లర్లకు ధాన్యం అప్పగిస్తామన్నారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ అప్పగించగానే బ్యాంకు గ్యారెంటీలను మిల్లర్లకు తిరిగి ఇచ్చేస్తామని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైస్ మిల్లుల పరిశ్రమకు అండగా ఉంటామని, ప్రభుత్వం, మిల్లర్లు పరస్పర అవగాహనతో ముందుకు సాగాలని ఉత్తమ్ సూచించారు. తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించాలని, కొనుగోళ్లలో తరుగు, తాలు సమస్యలు లేకుండా చేస్తామని తెలిపారు. ఈ సీజన్‌లో కోటిన్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, దేశంలో ఇదో రికార్డని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లకు రూ.30 వేల కోట్లు అవసరమని అంచనా వేశామని, ఇప్పటికే రూ.20 వేల కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. 32 జిల్లాల్లో 7,572 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, 3,309 రైస్‌మిల్లులు సేకరణలో భాగస్వాములవుతాయని పేర్కొన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, ఏ మాత్రం తేడా వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భద్రతా కమిషన్‌ను ఏర్పాటు చేయండి: ఎఫ్‌జీజీ

హైదరాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భద్రతా కమిషన్, పోలీసు కంప్లెయింట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. వాటి ఏర్పాటుకు సుప్రీం కోర్టు 2006లో మార్గదర్శకాలను జారీ చేసిందని గుర్తు చేసింది. ఈ మేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. భద్రతా కమిషన్.. పోలీసు శాఖ పనితీరును నిశితంగా సమీక్షించడమే కాకుండా, వారికి తగిన సూచనలు, సలహాలు ఇస్తూ చట్టపరిధిలో పనిచేసేలా చూస్తుందని ఆయన అందులో పేర్కొన్నారు.

బాల మేధావుల ప్రపంచ రికార్డుల వేడుకకు శ్రీచైతన్య సన్నద్ధం

హైదరాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐఐటీ, జేఈఈ, ఏఐఈఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షలలో నెం. 1 ర్యాంకులు సాధిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థలు.. ఇప్పుడు సరికొత్త ప్రపంచ రికార్డును సాధించేందుకు సమాయత్తమవుతున్నాయి. గణితంలో బాల మేధావుల ప్రతిభా పాటవాలను విశ్వవ్యాప్తం చేసేందుకు సంకల్పించి ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేసింది. అందుకుగాను ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకే సంస్థతో కలిసి పనిచేస్తోంది. ఈ భాగస్వామ్యం ద్వారా శ్రీచైతన్య భారీ స్థాయి విజయాలను అందించడానికి ప్రయత్నిస్తోంది. 10 వేల మంది విద్యార్థులు 600 మ్యాథ్స్ ఫార్ములాలు ఏకకాలంలో పఠనం చేసి హాట్రిక్ రికార్డు సాధించేందుకు శ్రీచైతన్య పాఠశాలలు సిద్ధమయ్యాయి. ఈ ఈవెంట్‌కు యూకేలోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారుల ప్రత్యక్ష సాక్షిగా ఉంటారు. ఈనెల 6వ తేదీన సాయంత్రం 5.30 గంటలకు తుది తీర్పు వెలువడే అకాశం ఉంది.

మిల్లర్లకు డిసెంబరు 31 గడువు

» ఆలోపు టెండరు ధాన్యం ఇవ్వకపోతే 25% జరిమానా

» ధాన్యం అప్పగింతకు తుది గడువు ఇచ్చిన మంత్రివర్గం



హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టెండరు ధాన్యం అప్పగించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రెండేళ్లుగా సాగుతూ వస్తున్న ప్రక్రియకు ఇక శుభం కార్డు వేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు పలుమార్లు గడువు పొడిగించిన ప్రభుత్వం.. డిసెంబరు 31 నాటికి తుది గడువు ఇచ్చింది. ఆలోపు రైస్‌మిల్లర్లు ధాన్యం అప్పగించకపోతే జనవరి ఒకటి నుంచి 25 శాతం జరిమానా అమలులోకి వస్తుంది. ధాన్యం టెండరు ధర క్వింటాకు రూ.2 వేలు కాగా.. గడువు దాటిపోతే క్వింటాకు రూ.2,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇటీవల మంత్రి వర్గంలో తీసుకున్న నిర్ణయాన్ని పౌర సరఫరాల సంస్థ తాజాగా రైస్ మిల్లర్లకు చేరవేసింది.

భద్రాద్రి కొత్తగూడెంలో 10 కోట్లతో సీవోఈ!

» తుమ్మల ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం

» సహజ, సేంద్రియ వ్యవసాయానికి ఊతం



హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సహజ, సేంద్రియ వ్యవసాయానికి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)' ఏర్పాటుకు రూ.10 కోట్లు మంజూరు చేయాలన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తికి ఆమోదం తెలిపింది. ఈ విషయంపై తుమ్మల గత నెలలో కేంద్రానికి లేఖ రాశారు. దీనికి కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పందిస్తూ.. ఎంఐడీహెచ్ పథకంలో సహజ, సేంద్రియ వ్యవసాయానికి సీవోఈలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి భద్రాద్రి కొత్తగూడెంలో సీవోఈ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఈ కేంద్రాల్లో ఉద్యాన పంటల రైతులకు శిక్షణ, సహకారం అందుతుందన్నారు. అలాగే పామాయిల్ సాగులో జాతీయస్థాయి లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రభుత్వం కృషిని చౌహాన్ అభినందించారు. తుమ్మల విజ్ఞప్తి మేరకు కేంద్ర అధికారుల బృందం త్వరలో తెలంగాణలో పర్యటించి, రాష్ట్ర ప్రభుత్వం, పామాయిల్ రైతులతో సంప్రదింపులు జరుపుతుందన్నారు. తుమ్మల ప్రతిపాదనల మేరకు పామాయిల్ గెలల ధర పెరుగుదలకు ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతానికి పెంచామని చౌహాన్ తెలిపారు. కాగా, ఈ నిర్ణయంతో పామాయిల్ గెలల ప్రస్తుత ధర 19,144కు చేరిందని తుమ్మల పేర్కొన్నారు. రూ.20 వేలు కూడా దాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ ధర రూ.1,25,000 తగ్గకుండా ఉండేందుకు దిగుమతి సుంకాన్ని పెంచుతూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. పెరిగిన ధరలతో రాష్ట్రంలో చాలామంది రైతులు పామాయిల్ సాగు వైపు చూసే అవకాశం ఉందన్నారు.

సన్నాలు మిల్లర్లకే

ప్రైవేటు మిల్లర్లకు సన్న ధాన్యం అమ్మేస్తున్న రైతులు.. రూ.500 బోనస్ కోల్పోతున్నా ప్రైవేటుకే ఓటు

నల్లగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొసరు కోసం చూస్తే అసలుకే నష్టం వస్తుందని భావించినట్లు ఉన్నారు నల్లగొండ జిల్లా రైతులు.. సన్నరకం ధాన్యంకు రూ.500 బోనస్ ఇస్తాం.. ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనలను పట్టించుకోవడం లేదు. బోనస్ కోసం చూస్తే తేమ నిబంధనల వల్ల అధికంగా నష్టపోతామనే ఆలోచనతో ప్రైవేటు మిల్లులకు క్యూ కడుతున్నారు. తేమ నిబంధనల బాధ, ఆరబెట్టే పని, అకాల వర్షం భయం, డబ్బు కోసం వేచి చూసే అవసరం లేకపోవడంతో రిస్కు తీసుకోకుండా ప్రైవేటు విల్లులకు సన్న ధాన్యం అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రైవేటు మిల్లర్లు క్వింటాల్‌కు రూ.2200 నుంచి రూ.2400 వరకు ఇస్తుండడంతో సంతృప్తి చెందుతున్నారు. దీంతో నల్లగొండ జిల్లాలోని ప్రైవేటు మిల్లులు సన్న ధాన్యంతో కళకళలాడుతుంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు వెలవెలబోతున్నాయి.

బోనస్ పోతేపోనీ

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం అమ్మితే బోనస్ రూ.500తో కలిపి క్వింటాల్‌కు రూ.2850 వరకు ధర లభించే అవకాశం ఉంది. ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే ధాన్యంలో తేమ 17% లోపు ఉండాలి. గింజలో నాణ్యత ఉండాలి. ఈ ప్రమాణాలను అందుకోవాలంటే కోత పూర్తయ్యాక పది రోజులు వరకు ధాన్యాన్ని ఆరబెట్టాలి. ఇలా ఆరబెడితే క్వింటాల్‌కు ఆరు నుంచి ఏడు కిలోల వరకు ధాన్యం బరువు తగ్గుతుంది. దీంతో రైతులు అమ్మే ధాన్యం లెక్క మారుతుంది. అంతేకాక, ప్రభుత్వానికి ధాన్యం విక్రయిస్తే డబ్బు కోసం వేచి ఉండాలి. ఇవేవీ లేకుండా రైతులు తెచ్చిన పచ్చి ధాన్యాన్ని తూచి ప్రైవేటు మిల్లర్లు కొనుగోలు చేసేస్తున్నారు. దీంతో బోనస్ పోతే పోని అనుకుని రైతులు ప్రైవేటు మిల్లర్లకు ధాన్యం అమ్ముతున్నారు. నల్లగొండ జిల్లాలో ఆధునిక సాంకేతికత కలిగిన మిల్లులు అధికంగా ఉన్నాయి. ఈ మిల్లుల్లోని యంత్రాలు పచ్చి ధాన్యంలోని బియ్యం గింజ విరగకుండా ఆవిరి పట్టగలవు. దీంతో మిల్లర్లు తేమ నిబంధన పెట్టడం లేదు.



మిర్యాలగూడ మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ కొనుగోలు కేంద్రం

సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలు వెలవెల

నల్లగొండ జిల్లాలో ఈ సీజన్‌లో సన్నధాన్యం 6.36లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డు ధాన్యం 5.65లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో దాదాపు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు 340 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 260 దొడ్డు రకం ధాన్యం రకాల కోసం కాగా మిగిలిన 80 సన్నరకాల కోసం పెట్టారు. ఈ కేంద్రాలన్నీ ఇప్పటికే ప్రారంభమయ్యాయి. కానీ, ఈ కేంద్రాలకు ఇప్పటిదాకా చాలా స్వల్పంగా సన్న ధాన్యం వచ్చింది. మరోపక్క ప్రైవేటు మిల్లులకు ఇప్పటికే లక్ష మెట్రిక్ టన్నుల పైచిలుకు సన్నధాన్యం చేరిందనే అంచనాలు ఉన్నాయంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయితే, ప్రస్తుతం మిల్లులకు వస్తున్న ధాన్యమంతా నాగార్జున సాగర్ ఆయకట్టేతర ప్రాంతాలకు చెందినదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న ధాన్యం మిల్లింగ్‌కు అనుకూలమైనది కావడంతో మిల్లర్లు నిబంధనలు పెట్టకుండా కొంటున్నారని తెలిపారు. నవంబరు రెండో వారం నుంచి డిసెంబరు మూడో వారం వరకు నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాల నుంచి ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అప్పుడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రద్దీ పెరుగుతుందని అంటున్నారు.

సీఎంఆర్ ఇవ్వాల్సిన గడువు 30కి పొడిగింపు

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వడానికి ఈ నెల 30 వరకు గడువును పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. 2023-24 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి మిల్లర్లకు ఇచ్చిన బియ్యం డెలివరీ గడువును కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. కేంద్ర ఆహార, వినియోగదారుల మంత్రిత్వ శాఖ అధికారి అజయ్ కుమార్ మంగళవారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.2400 లెక్కన 40 క్వింటాళ్లు అమ్మా



మిర్యాలగూడలోని మిల్లుకు క్వింటాలుకు రూ.2400 లెక్కన 40 క్వింటాళ్ల చింట్లు రకం సన్న ధాన్యం విక్రయించా. బోనస్ కోల్పోవడం నిజమే కానీ ఆరబెట్టుకుంటే తూకం తగ్గడమే కాక ఖర్చులు పెరుగుతాయి. అకాల వర్షం వస్తే ధాన్యం తడిసిపోయే ముప్పు ఉంది. ఈ బాధలేవీ లేకుండా కొనుగోలు చేస్తుండడంతో ప్రైవేటు విల్లర్‌కే ధాన్యం ఇచ్చా

- వలిశెట్టి లింగయ్య, రామలింగాలగూడెం, తిప్పర్తి మండలం, నల్లగొండ జిల్లా

తేమ శాతం నిబంధన సడలించాలి



47 క్వింటాళ్ల ధాన్యం మిల్లుకు తెచ్చా. 23 శాతం దాకా తేమ ఉందని క్వింటాకు రూ.2400 ఇచ్చారు. ఆరబెట్టి కేంద్రాల్లో విక్రయిస్తే బోనస్ వచ్చేది. కానీ, అకాల వానలు, ఆరబెట్టుకునే సదుపాయాలు లేక ప్రైవేటు మిల్లర్లకే విక్రయించా. ప్రభుత్వం తేమశాతం నిబంధనలు సడలిస్తే రైతులకు బోనస్ ప్రయోజనం దక్కుతుంది. లేకపోతే నష్టం జరుగుతుంది


- ఆలగడప అనిల్, కాసరబాద్, సూర్యాపేట జిల్లా

బోనస్ వస్తుందని రైతులకు చెబుతూనే ఉన్నాం



ఈ నెల రెండో వారం నుంచి సాగర్ ఆయకట్టు ప్రాంతాల నుంచి ధాన్యం వస్తుంది. అప్పుడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వస్తుందని భావిస్తున్నాం. తక్కువ ధరకు ధాన్యం విక్రయించవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయిస్తే బోనస్ వస్తుందని రైతులకు పదేపదే చెబుతున్నాం

- వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి, నల్లగొండ



కార్బన్ క్లాత్‌తో కూడిన ఉపకరణం; విద్యార్థిని వన్మతి

బ్యాటరీ బదులు కార్బన్ క్లాత్!

» శరీరంలోని గ్లూకోజ్‌తో విద్యుదుత్పత్తి

» పేస్‌మేకర్ వంటి వాటిలో వాడే అవకాశం

» బిట్స్ పిలానీలో పరిశోధనలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేస్‌మేకర్, కోక్లియర్ ఇంప్లాంట్స్ లాంటివి ఉన్న వ్యక్తులకు కొన్ని సమస్యలు సాధారణమే కానీ, వారు ఎదుర్కొనే అతి పెద్ద సమస్య బ్యాటరీలతోనే. ఈ ఉపకరణాలలో వాడే బ్యాటరీలు లేదా బయోఫ్యూయల్ సెల్స్ లోహంతో తయారై ఉంటాయి. దీనివల్ల కొంతకాలానికి వాటితో దుష్ఫలితాలు ఎదురయ్యే ప్రమాదం లేకపోలేదు. ఇలాంటి సమస్యలేవీ లేకుండా, అసలు బ్యాటరీల అవసరమే లేకుండా పేస్‌మేకర్, కోక్లియర్ ఇంప్లాంట్‌లు పనిచేయడం సాధ్యమేనా అంటే, సాధ్యమే అని చెబుతున్నారు బిట్స్ పిలానీ హైదరాబాద్ పరిశోధక విద్యార్థిని వన్మతి. బ్యాటరీకి బదులుగా కార్బన్ క్లాత్‌తో పేస్‌మేకర్ వంటి 'ధరించగలిగిన ఉపకరణాలను' పని చేయించవచ్చని ఆమె తెలిపారు. శరీరంలోని గ్లూకోజ్‌ను ఉపయోగించుకొని ఈ కార్బన్ క్లాత్ పని చేస్తుందన్నారు. అర సెంటీమీటర్ కార్బన్ క్లాత్‌తోనే తాము 3 వోల్టుల విద్యుత్‌ను బూస్టర్ సహాయంతో ఉత్పత్తి చేశామని, కోక్లియర్ ఇంప్లాంట్ సహా స్మార్ట్ వాచ్‌లు పని చేయడానికి కూడా ఈ విద్యుత్ సరిపోతుందని,ఖర్చు గణనీయంగా తగ్గుతుందని వన్మతి వెల్లడించారు.

సుదీర్ఘ మన్నిక.. తక్కువ వ్యయం

కార్బన్ క్లాత్ అంటే కార్బన్ ఫైబర్స్‌తో తయారైన వస్త్రం. అత్యధిక శక్తి సాంద్రత, సుదీర్ఘకాలపు మన్నిక, అతి తక్కువ వ్యయం కారణంగా కార్బన్ క్లాత్‌లపై ఇటీవలి కాలంలో విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. వేరబుల్, ఫ్లెక్సిబుల్ ఉపకరణాల్లో వీటిని ఉపయోగించటంపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. దీంట్లో భాగంగానే, బిట్స్‌లో కూడా దీనిపై రీసెర్చ్ నడుస్తోంది. ఈ ప్రాజెక్టులో తమిళనాడుకు చెందిన వన్మతి భాగంగా ఉన్నారు. అర సెంటీమీటర్ కార్బన్ క్లాత్‌పై గ్లూకోజ్ ఆక్సిడైజ్ ఎంజైమ్‌ను ఎలక్ట్రోడ్‌గా వినియోగించి తాము విద్యుత్‌ను ఉత్పత్తి చేశామని వన్మతి తెలిపారు. గ్లూకోజ్ ఆక్సిడైజ్ ఎంజైమ్ మన రక్తంలోని గ్లూకోజ్‌ను తాకగానే విద్యుత్ పుట్టి పోర్టబుల్ ఉపకరణాలకు శక్తిగా మారుతుందని వివరించారు. శరీరంలో గ్లూకోజ్ సరిగా ఉత్పత్తి అయినంత కాలం కార్బన్ క్లాత్ నుంచి విద్యుత్ పుడుతుందన్నారు. సింగిల్ సెల్ ఖర్చు రూ.100లోపే ఉంటుందని పేర్కొన్నారు. అయితే, తాము ఉపయోగించిన బూస్టర్ చాలా పెద్దగా ఉందని, దానిని శరీరంలో అమర్చడం వీలుకాదని.. బూస్టర్‌ను ఒక నాణెం సైజుకు తీసుకురావాలన్న ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

విచారణ మొదలే కాలేదు.. అప్పుడే జోక్యమా?

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు స్పీకర్ ముందు లిస్ట్ కూడా కాలేదు

» హైకోర్టు ఎలా జోక్యం చేసుకుంటుంది?

» సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టేయండి

» హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అసెంబ్లీ కార్యదర్శి తరఫున ఏజీ వాదనలు

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లు.. స్పీకర్ ఎదుట విచారణకు రాకముందే హైకోర్టు సింగిల్ జడ్జి జోక్యం చేసుకోవడం చెల్లదని రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి పేర్కొన్నారు. అనర్హత పిటిషన్లు దాఖలు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు దురుద్దేశంతో వ్యవహరించారని.. స్పీకర్ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే దురుద్దేశంతో రాజకీయం చేయాలని చూశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్లపై విచారణకు షెడ్యూల్ ఇవ్వాలని సెప్టెంబరు 9న హైకోర్టు సింగిల్ జడ్జి అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ ప్రారంభించింది. అసెంబ్లీ కార్యదర్శి తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని పేర్కొంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మార్చి 18న పిటిషన్‌లు, మార్చి 30న అదనపు అఫిడవిట్‌లు సమర్పించారు. పది రోజులు గడవకుండానే ఏప్రిల్ 10న హైకోర్టులో కూడా పిటిషన్ వేశారు. దీనిని బట్టి వారు దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారని అర్థమవుతోంది. అఫిడవిట్‌లలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పట్ల అమర్యాదపూర్వకంగా కించపర్చే భాషను ఉపయోగించారు. స్పీకర్‌కు దురుద్దేశాలు ఆపాదించేలా వ్యవహరించారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం ట్రిబ్యునల్ చైర్మన్‌గా వ్యవహరించే స్పీకర్‌కు నిర్దేశిత నిబంధనలు ఉంటాయి. పది రోజుల్లో నిర్ణయం తీసుకోండి లేదా నెలరోజుల్లో నిర్ణయం తీసుకోండి అని చెప్పడానికి స్పీకర్ ప్రభుత్వ అధికారి కాదు. రాజ్యాంగబద్ధమైన హోదాలో ఉన్న స్పీకర్ పట్ల అమర్యాదగా వ్యవహరించినందుకు, దురుద్దేశంతో కోర్టుకు వచ్చినందుకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్లను కొట్టేయాలి' అని ఏజీ పేర్కొన్నారు.

విస్తృత ధర్మాసనం తీర్పే ప్రామాణికం

హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలపై ఏజీ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన 'కిహోటో హోలోహన్' తీర్పును కాకుండా సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులతో కూడిన సాధారణ ధర్మాసనం ఇచ్చిన కైశం మేఘచంద్రసింగ్ తీర్పుపై సింగిల్ జడ్జి ఆధారపడటం చెల్లదు. ఎక్కువ మంది జడ్జిలున్న ధర్మాసనం ఇచ్చే తీర్పులే దేశంలోని హైకోర్టులు, ఇతర కోర్టులకు ప్రామాణికం. తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్టీ మారడాన్ని సవాల్ చేస్తూ ఎర్రబెల్లి దయాకర్‌రావు దాఖలు చేసిన కేసులో ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ అన్ని సుప్రీంకోర్టు తీర్పులను పరిశీలించి తీర్పు ఇచ్చింది. స్పీకర్ అధికారాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఎస్‌ఏ సంపత్‌కుమార్ కేసును సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనానికి సిఫారసు చేసింది. వీటినీ సింగిల్ జడ్జి పట్టించుకోలేదు. అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ ఏ నిర్ణయం తీసుకోకముందే కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదు. అసలు స్పీకర్ ఎదుట కేసులు లిస్ట్ కూడా కాలేదు. విచారణ ప్రారంభం కాలేదు' అని ఏజీ పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యే దానం నాగేందర్ తరఫున జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపిస్తూ.. ఎర్రబెల్లి దయాకర్‌రావు, సంపత్‌కుమార్ కేసుల్లో తానే వాదనలు వినిపించానన్నారు. ఆ తీర్పులు స్పష్టంగా ఉన్నప్పటికీ సింగిల్ జడ్జి వాటిని పట్టించుకోలేదని.. సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలు స్పీకర్‌ను కించపర్చే విధంగా ఉన్నాయన్నారు. కేసులోవిచారణను ధర్మాసనం బుధవారానికి వాయిదా వేసింది.

మరిన్ని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు!

» అనుమతుల జారీని సులభతరం చేయాలని ప్రభుత్వ కీలక నిర్ణయం

» 13 అంచెల విధానం 10కి కుదింపు

» కనీసం 50 పడకలు ఉంటే అవకాశం

» రాష్ట్రంలో ప్రస్తుతం 374 ఎంప్యానెల్ ఆస్పత్రులు.. మరో 150 వరకు పెరగొచ్చు

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్ ఆస్పత్రుల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది. ఆరోగ్యశ్రీ అనుసంధాన ఆస్పత్రిగా నమోదయ్యేందుకు ఉన్న నిబంధనల్లో కొన్నింటిని మార్చి, అనుమతులను సులభతరం చేయనుంది. కనీసం 50 పడకలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీలో ఎంప్యానెల్ అయ్యేందుకు అవకాశం కల్పించనున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 150 పైచిలుకు వరకు ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీలో ఎంప్యానెల్ అయ్యేందుకు అవకాశం కలుగుతుంది. సోమవారం ఆరోగ్యశ్రీపై మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో జనాభాకు తగ్గట్లుగా ఆరోగ్యశ్రీ అనుబంధ ఆస్పత్రులు లేవు. ప్రస్తుతం 374 మాత్రమే ఉన్నాయి. వీటిని పెంచడం ద్వారా ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి తేవడంతో పాటు వారికి నచ్చిన ఆస్పత్రికి వెళ్లే అవకాశం ఉంటుంది. కాగా, ప్రస్తుతం ఏదైనా ప్రైవేటు ఆస్పత్రి ఆరోగ్యశ్రీలో ఎంప్యానెల్ కావాలంటే 13 అంచెలు దాటుకొని రావాలి. ఎక్కడ ఆటంకం ఏర్పడినా దరఖాస్తును తిరస్కరిస్తున్నారు. అంతేకాక ఎప్పుడో కానీ దరఖాస్తులు స్వీకరించడం లేదు. దీంతో 13 అంచెలను 10కి కుదించనున్నట్లు తెలుస్తోంది. ఆస్పత్రులకు అనుమతిపై నిర్ణయం తీసుకునే ఈడీసీ (ఎంప్యానెల్ డిసిప్లినరీ కమిటీ)ని రద్దు చేయనున్నట్లు సమాచారం. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలో నిబంధనల మేరకు మౌలిక సదుపాయాలు, అర్హత గల వైద్యులు ఉన్న ఆస్పత్రులకు అవకాశం కల్పించనున్నారు. అలాగే ఈ ఆస్పత్రుల్లో ఆర్థోపెడిక్, పాలీట్రామా సేవలను మరింత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు.

బిల్లుల చెల్లింపు విధానంలో మార్పు!

గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ బకాయిలు వెయ్యి కోట్లకు పైగా ఉన్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి. వాటిని ప్రస్తుతం మెల్లమెల్లగా చెల్లిస్తూ వస్తున్నారు. ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు నెలకు సగటున రూ.100 కోట్ల వరకు బిల్లులు అవుతున్నాయి. వాటిలో కనీసం రూ.80 కోట్లైనా చెల్లిస్తే వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ఉంటుందని సర్కారు యోచిస్తోంది. బిల్లులు చెల్లించే విధానంలోనూ మార్పు తీసుకురావాలని భావిస్తోంది. ఒక నెల ప్రభుత్వ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లిస్తే.. మరుసటి నెల ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించాలన్న యోచనలో ఉంది. దీంతో కచ్చితంగా ప్రతీ రెండు నెలలకోసారి బిల్లులు వస్తాయన్న నమ్మకం ఆస్పత్రులకు కలుగుతుంది. ఆరోగ్యశ్రీలో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా ఉంటుంది. గతంలో బకాయిలు రాకపోవడంతో మెజారిటీ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలను దాదాపు నిలిపివేశాయి. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.